


# గౌతమ్ న్యూస్

తెలుగు దిన పత్రిక





హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 50, ఎడిటర్,భీముడు నాయక్ పేజిలు : 12, వెల రూ. 1 సోమవారం - 18 - మార్చి - 2024

PUBILSHED FROM HYDERABAD, CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## జగన్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ వేర్వేరు కాదు...

- వైసీపీ వ్యతిరేక ఓటును కాంగ్రెస్ కు మళ్లించే ప్రయత్నం జరుగుతోంది
- ఏపీలో కూటమి గెలుపును ఎవరూ అడ్డుకోలేరు
- ముఖ్యమంత్రి జగన్ ఒక సారా వ్యాపారి... చిటికెన వేలంత రావణుడు...దించడం ఓ లెక్కా!
- భారత్ ను విశ్వ గురువుగా మారుస్తున్న శక్తి మోదీ.. జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశాడు
- ఆవేశపూరితంగా ప్రసంగించిన పవన్
- తెలుగులో ప్రసంగం ప్రారంభించిన వైనం
- ఎన్టీఆర్ ప్రస్తావనతో తెలుగువారిని ఆకట్టుకునే ప్రయత్నం
- జగన్ క్యాబినెట్ మంత్రులపై తీవ్ర విమర్శలు
- అవినీతిలో ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు




చిలకలూరిపేట: ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల కలయికతో కూటమి ఏర్పడిన సంగతి తెలిసిందే. కూటమి ఏర్పడ్డాక, నిన్న ఎన్నికల షెడ్యూల్ ప్రకటన వెలువడ్డాక తొలిసారిగా పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం బొప్పూడి వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ సభకు హాజరవడంతో అత్యంత ప్రాముఖ్యత ఏర్పడింది. భారత్ మాతాకీ జై... నా ఆంధ్ర కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు అంటూ ప్రధాని నరేంద్ర మోదీ తెలుగులో ప్రసంగం ప్రారంభించారు. మీ అభిమానానికి నేను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అంటూ భారీగా తరలి వచ్చిన జనసందోహాన్ని చూసి ఉత్సాహవంతంగా ప్రసంగించారు. ఎన్డీయేకి ఓటు వేయాలి... ఎన్డీయే లోక్ సభ సీట్లు 400 దాటాలి అని తెలుగులో పిలుపునిచ్చారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో అభివృద్ధి సాధ్యమని అన్నారు. కేంద్రంలో తమ విజయంపై ఎలాంటి సందేహాలు లేవని, ఈసారి 400 సీట్లను టార్గెట్ గా పెట్టుకున్నామని తెలిపారు. ఏపీలోనూ టీడీపీ, జనసేన కలిసి రావడంతో ఎన్డీయే కూటమి రాష్ట్రంలోనూ విజయభేరి మోగిస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

కోటప్పకొండ సాక్షిగా...

నిన్న ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఆ తర్వాత నేను పాల్గొంటున్న తొలి సభ ఇదే. ఇక్కడి కోటప్పకొండ త్రికూటేశ్వరస్వామి ఆశీస్సులు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఆశీస్సులు లభిస్తున్నట్టుగా నేను భావిస్తున్నాను. ఈ త్రిమూర్తుల ఆశీస్సులతో ముచ్చటగా మూడోసారి మనం అధికారంలోకి వస్తాం. మరోసారి దృఢతరమైన నిర్ణయాలు తీసుకునే అవకాశాన్ని హస్తగతం చేసుకోబోతున్నాం. జూన్ 4 తేదీన వచ్చే ఫలితాలు ఎన్డీయే కూటమికి 400 పైచిలుకు సీట్లను ఇవ్వబోతున్నాయి. వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్ సాకారం కావాలంటే ఎన్డీయేకి 400కి పైగా సీట్లు అందించాలి. అందుకు మీరందరూ కష్టించి కృషి చేయాలి. ఎన్డీయే లక్ష్యం వికసిత భారత్, ఎన్డీయే లక్ష్యం వికసిత ఆంధ్రప్రదేశ్. డబుల్ ఇంజిన్ సర్కారుతో తప్పకుండా అభివృద్ధి సాధ్యమవుతుంది.

ఏపీలో ఎన్డీయే కూటమి గెలిస్తే ఎలా ఉంటుందో చూడండి

ఎన్డీయే కూటమిలో చేరేందుకు వస్తున్న భాగస్వాములతో కూటమి బలపడుతుంది. అది చంద్రబాబు కావొచ్చు, పవన్ కల్యాణ్ కావొచ్చు... వారి భాగస్వామ్యం విలువైనది. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం, ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం వస్తే ఎలా ఉంటుందో చూసుకోండి. కేంద్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం సేవా నిరతితో దేశంలోని అందరికీ సేవలు అందించడంలో నిమగ్నమయి ఉంది. పేదల గురించి ఆలోచించే ప్రభుత్వం ఎన్డీయే ప్రభుత్వం.

దేశ జనాభాలోని 30 కోట్ల మందిని పేదరికం నుంచి బయటికి తీసుకువచ్చిన ప్రభుత్వం ఎన్డీయే ప్రభుత్వం. ఇవాళ ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి 10 లక్షల ఇళ్లు ఇచ్చాం. ఇక్కడి పల్నాడు ప్రాంతంలోనే 5 వేల పక్కా గృహాల నిర్మాణం జరిగింది. పేదలకు మంచి నీరు అందించే జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఒక కోటి కుటుంబాలకు ఉచితంగా కుళాయి కనెక్షన్లు ఇచ్చాం.

ఆయుష్మాన్ భారత్ కింద పేదల కోసం 1.25 కోట్ల మందికి ఉచితంగా వైద్య సౌకర్యాలను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఏపీలో ఉన్న చిన్న, సన్నకారు రైతులందరికీ కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.700 కోట్లు ఇచ్చాం. అవి ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి పెద్ద పీట వేసే కార్యక్రమాలు. ఈ అభివృద్ధిని నిర్విఘ్నంగా జరుపుకోవాలంటే ఎన్డీయే కూటమి తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థులను, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి.

చంద్రబాబు, పవన్ ఇద్దరూ ప్రజల కోసం పోరాడుతున్నారు

ప్రాంతీయపరమైన ఆశలు, జాతీయ ప్రయోజనాలు అన్నింటినీ నెరవేరుస్తాం. ఎన్డీయేలోని ప్రతి సభ్యుడు ప్రజాసేవకే అంకితం. భాగస్వామ్య పార్టీలన్నింటిని కలుపుకుని వెళ్లడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. ఏపీలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ కూడా ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నారు. ఏపీని ఎడ్యుకేషన్ హబ్ గా మార్చాం. తిరుపతిలో ఐఐటీ, ఐసర్ నిర్మించాం.

## ఎన్నికలకు ఎన్డీయే సర్వసన్నద్ధం

ఈసారి కూడా గెలుపు మా కూటమిదే: మోదీ

మూడో టర్మ్‌లో చేయాల్సిన పని చాలా ఉందన్న ప్రధాని




న్యూఢిల్లీ: బీజేపీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) లోక్‌సభ ఎన్నికలకు సర్వసన్నద్ధంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈసారి కూడా తమ కూటమి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం ఎన్నికల సంఘం ప్రకటించిన అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్'లో పలు పోస్టులు చేశారు. 'మరోసారి మోదీ సర్కారు' అనే హ్యాష్‌ట్యాగ్‌ను జతచేశారు. గత పదేళ్ల తమ పాలనలో భారత్ ఎంతగానో అభివృద్ధి చెందిందని, వైభవోజ్వల మార్పును చూసిందని ఉద్ఘాటించారు.

## కేజ్రీవాల్ కు ఈడీ షాక్..

తొమ్మిదోసారి విచారణకు ఈడీ పిలుపు





- మార్చి 21న విచారణకు రమ్మంటూ నోటీసులు
- ముందస్తు బెయిల్ నేపథ్యంలో మరో కొత్త కేసు నమోదు

## డిసెంబరు 3... తెలంగాణకు విముక్తి కలిగిన రోజు

- కేసీఆర్ నాటిన కలుపు మొక్కలు ఇంకా వాసన వెదజల్లుతున్నాయి... అన్నింటినీ పీకేస్తా
- తెలంగాణలో కాంగ్రెస్ పాలనకు 100 రోజులు పూర్తి
- మీట్ ద ప్రెస్ కార్యక్రమం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి
- ప్రపంచం అబ్బురపడేలా ప్రజలు తీర్పు ఇచ్చారని స్పష్టీకరణ


వివరాలు 2లో..



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మీట్ ద ప్రెస్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, 2023 డిసెంబరు 3వ తేదీకి ఓ ప్రత్యేకత ఉందని అన్నారు. తెలంగాణకు విముక్తి కలిగిన రోజు అని అభివర్ణించారు. ప్రపంచం అబ్బురపడేలా ప్రజల తీర్పు వచ్చిందని వెల్లడించారు. కేసీఆర్ ది నిజాం నవాబుల వంటి పాలన అని, సంక్షేమ పథకాలు అమలు చేసినా స్వేచ్ఛను హరిస్తే ప్రజలు ఊరుకోరన్న విషయం స్పష్టమైందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నాడు నిజాం కూడా సంక్షేమ పథకాలు అమలు చేశాడని, కానీ నిజాం ఎంత చేసినా సరే, తమకు స్వేచ్ఛ లేకుండా చేశాడని ప్రజలు

## యుద్దానికి సిద్ధమైన రాజకీయ పార్టీలు..

హైదరాబాద్/అమరావతి: దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది సీఈసీ. కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మార్చి 16న మధ్యాహ్నం 3 గంటలకు లోక్‌సభ ఎన్నికలతో పాటు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. మొత్తం దేశ వ్యాప్తంగా 7 ఫేస్?లలో ఎన్నికలు జరగనున్నాయని ప్రకటించారు. నాల్గవ దశలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర,




## తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు.. ఐఎండీ అలర్ట్ జారీ




అమరావతి/హైదరాబాద్: నేటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణశాఖ తెలిపింది. ఈ మేరకు తెలుగు రాష్ట్రాలకు ఐఎండీ హెచ్చరిక జారీ చేసింది.

## ఈ నెల 20న వైసీపీ మేనిఫెస్టో విడుదల




అమరావతి: ఏపీ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. సార్వత్రిక ఎన్నికలతో పాటుగా ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు వెల్లడించింది. నాలుగో దశలో ఏపీలో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలకు ఏప్రిల్ 25 వరకూ అవకాశం కల్పించారు. ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 29వ తేదీ వరకూ గడువు ఇచ్చారు. ఏపీలోని 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలకు మే 13న ఎన్నికలు జరగనుండగా.. జూన్ 4న ఫలితాలు విడుదల కానున్నాయి. అయితే నిన్న వైసీపీ పార్టీ 175 ఎమ్మెల్యే అభ్యర్థులు, 25 ఎంపీ అభ్యర్థులను రిలీజ్ చేసింది. ఈ నెల 20న వైసీపీ మేనిఫెస్టో విడుదల చేయనున్నారు.







## కేజ్రీవాల్ కు ఈడీ షాక్.. తొమ్మిదోసారి విచారణకు ఈడీ పిలుపు

ఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు షాక్ ఇచ్చారు. ఢిల్లీ లిక్కర్ కేసులో విచారణకు రావాలంటూ తొమ్మిదోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 21న ఢిల్లీలోని ఈడీ ఆఫీసుకు రావాలని అందులో సూచించారు. వరుస నోటీసులు, తెలంగాణ ఎమ్మెల్సీ కవిత అరెస్టు నేపథ్యంలో కేజ్రీవాల్ అరెస్ట్ కూడా తప్పదంటూ రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరోవైపు, తమ నోటీసులకు కేజ్రీవాల్ స్పందించడం లేదంటూ ఇటీవల రౌస్ ఎవెన్యూ కోర్టును ఈడీ ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీంతో తనను అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలంటూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కూడా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ విచారించిన కోర్టు.. రూ.లక్ష ష్యూరిటీ, షరతులతో కేజ్రీవాల్ కు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. శనివారం ఈమేరకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, కేజ్రీవాల్ కు ఆదివారం మరోసారి ఈడీ అధికారులు నోటీసులు జారీ చేయడం గమనార్హం. ముందస్తు బెయిల్ నేపథ్యంలో కేజ్రీవాల్ పై ఈడీ అధికారులు మరో కొత్త కేసు నమోదు చేసినట్లు ఆప్ వర్గాలు వెల్లడించాయి. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆదివారం మీడియా సమావేశంలో వెల్లడిస్తామని ఆ పార్టీ నేతలు తెలిపారు.

## ఎన్నికలకు ఎన్డీయే సర్వసన్నద్ధం

మొదటి పేజి తరువాయి

'మరోసారి మోదీ సర్కారు' అనే హ్యాష్‌ట్యాగ్‌ను జతచేశారు. గత పదేళ్ల తమ పాలనలో భారత్ ఎంతగానో అభివృద్ధి చెందిందని, వైభవోజ్వల మార్పును చూసిందని ఉద్ఘాటించారు. 140 కోట్ల మంది భారతీయుల శక్తియుక్తులతో అభివృద్ధిలో దేశం కొత్త రికార్డులు సృష్టించిందని హర్షం వ్యక్తంచేశారు. ప్రజలకు సుపరిపాలన అందించామని పేర్కొన్నారు. ఈ ట్రాక్ రికార్డును ఆధారంగా చేసుకొని ప్రజల్లోకి వెళ్తామని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలను అతిపెద్ద ప్రజాస్వామ్య వేడుకగా అభివర్ణించారు. ప్రధానమంత్రిగా వరుసగా మూడో పర్యాయం బాధ్యతలు చేపడతానని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. ఈసారి పేదరికం, అవినీతిపై యుద్ధం వేగవంతం చేస్తానని తేల్చిచెప్పారు. సామాజిక న్యాయాన్ని మరింత బలోపేతం చేయడం తన ధ్యేయమని పేర్కొన్నారు. మూడో టర్మ్‌లో చేయాల్సిన పని చాలా ఉందని వెల్లడించారు. దేశ ప్రగతి కోసం రాబోయే వెయ్యి సంవత్సరాలకు అవసరమైన రోడ్‌మ్యాప్‌ను వచ్చే ఐదేళ్లలో తయారు చేసుకోవాలని చెప్పారు.

ప్రజల ఆశీస్సుల నుంచే నాకు కొత్త శక్తి

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 70 ఏళ్లు పాలించిన ప్రభుత్వాలు సృష్టించిన ఖాళీలను గత పదేళ్ల భర్తీ చేశామని ప్రధాని మోదీ తెలియజేశారు. దేశం సౌభాగ్యవంతంగా మారుతుందని, స్వావలంబన సాధిస్తుందన్న ఆత్మవిశ్వాసాన్ని ప్రజల్లో పెంచామని వివరించారు. 'వికసిత్ భారత్' అనే లక్ష్య సాధనకు మనమంతా కలిసికట్టుగా పని చేయాలని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. మన దేశాన్ని ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుకోవడానికి, మన యువత కలలను సాకారం చేయడానికి మరింత పట్టుదలతో కృషి చేద్దామని సూచించారు. ప్రతిపక్షాల పరిస్థితి చుక్కాని లేని నావలా మారిందని నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. ఎన్నికలకు వెళ్లడానికి విపక్షాలకు ఒక బలమైన అంశమే లేదన్నారు. ప్రజల కోసం కష్టపడుతున్న తమను దూషించడం, ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం తప్ప విపక్షాలకు ఇంకేమీ తెలియదని విమర్శించారు.

## తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు.. ఐఎండీ అలర్ట్ జారీ

మొదటి పేజి తరువాయి

ఈ నెల 21 వరకు ఏపీ, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వానలు పడుతాయని అంచనా వేసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడతాయని తెలిపింది. మరోవైపు పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతాయని తెలిపింది. సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్టు అంచనా వేసింది.తూర్పు విదర్భ నుండి ఉత్తర తమిళనాడు వరకు విస్తరించి ఉన్న ద్రోణి ఇప్పుడు మరత్వాడా నుండి అంతర్గత కర్ణాటక మరియు తమిళనాడును దాటి కొమోరిన్ ప్రాంతం వరకు విస్తరించింది. దీని ఫలితంగా, మార్చి 20 వరకు మధ్య తెలంగాణ, కోస్తాంధ్ర, యానాంలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదే విధంగా జార?ండ్, ఒడిశా, విదర్భ, ఛత్తీస్‌గఢ్, తూర్పు మధ్యప్రదేశ్‌లు అక్కడక్కడా తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. పశ్చిమ బెంగాల్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, త్రిపుర రాష్ట్రాలపై దీని ప్రభావం ఉండనుంది.

## నన్ను అధ్యక్షుడిగా ఎన్నుకోండి.. లేకపోతే దేశంలో రక్తపాతం తప్పదు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా తనను ఎన్నుకోకపోతే దేశంలో రక్తపాతం తప్పదని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అధ్యక్ష ఎన్నిక జరుగనున్న నవంబర్ 5.. అమెరికా చరిత్రలో అత్యంత ముఖ్యమైన తేదీ అని చెప్పారు. ఒహియోలోని వాండాలియాలో జరిగిన ర్యాలీలో ట్రంప్ మాట్లాడారు. అయితే ఈ వ్యాఖలు ఏ ఉద్దేశంలో చేశారో స్పష్టంగా వెల్లడించలేదు. అధ్యక్షుడిగా తాను ఎన్నికైతే అమెరికాకు దిగుమతి చేసుకున్న కార్లను చైనా విక్రయించలేదని పేర్కొన్నారు. మెక్సికోలో కార్లను తయారు చేసి వాటిని అమెరికన్లను అమ్మాలని డ్రాగన్ దేశం చూస్తున్నదని విమర్శించారు. తన ప్రత్యర్థి అయిన జో బైడెన్‌ను 'చెత్త' అధ్యక్షుడిగా అభివర్ణించారు. వలసదారులకు మిలియన్ల కొద్ది వర్క్ పర్మిట్లు మంజూరు చేయడం ద్వారా ఆఫ్రికన్-అమెరికన్ ఓటర్లకు బైడెన్ వెన్నుపోటుపొడిచారని ఆరోపించారు.

## ఏపీకి 11.536 ఎకరాలు.. తెలంగాణకు 8.245 ఎకరాలు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ విభజన పూర్తయింది. ఏపీకి 11.536 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలను కేటాయిస్తూ శనివారం కేంద్ర హోంశాఖ ఉత్తర్వులిచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత ఢిల్లీలోని ఏపీ భవన్ విభజన జరగలేదు. ఇటీవల రెండు రాష్ట్రాల ప్రభుత్వాల అధికారుల సమన్వయంతో విభజన పూర్తయింది. ఢిల్లీలోని అశోకా రోడ్‌లోని ఆంధ్రప్రదేశ్ భవన్ 19.781 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం దీని విలువ రూ.9,913.505 కోట్లు ఉన్నట్లు కేంద్ర హోంశాఖ తెలిపింది. పంపకాల్లో భాగంగా ఏపీకి 58.32 శాతం వాటా దక్కగా, తెలంగాణకు 41.68 శాతం ఆస్తులు దక్కాయి.

ఏపీ భవన్‌కు ఇలా

19.781 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భవన్‌ను రెండు భాగాలుగా విభజించారు. విభజనలో భాగంగా ఏపీకి 11.536 ఎకరాలను అప్పగించారు. దీనిలో 5.781 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఏపీ భవన్, 4.315 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గోదావరి బ్లాక్, 3.359 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న నర్సింగ్ హాస్టల్, 2.396 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పటౌడీ హౌస్‌ను కేటాయించారు. 0.512 విస్తీర్ణంలో ఉన్న ఇంటర్నల్ రోడ్డు, 0.954 విస్తీర్ణంలోని శబరీ బ్లాక్ కొంత భాగాన్ని అప్పగించారు. ఏపీకి కేటాయించిన స్థలం విలువ రూ.5,781.416కోట్లు.

తెలంగాణ భవన్‌కు ఇలా..

విభజనలో భాగంగా తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించారు. దీనిలో మూడెకరాల విస్తీర్ణంలో ఉన్న శబరీ బ్లాక్, 5.245 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పటౌడీ హౌస్‌ను కేటాయించారు. తెలంగాణకు కేటాయించిన 8.245 ఎకరాల విలువ రూ.4,132.089 కోట్లు.

## డామిట్ కథ అడ్డం తిరిగింది



అమరావతి: డామిట్ కథ అడ్డం తిరిగింది. మార్చి ఆఖర్లో నోటిఫికేషన్, ఏప్రిల్ రెండోవారంలోనే ఎన్నికలు అని లోపల్లోపల లెక్కలేసుకుని చంకలు చర్చుకున్న లీడర్లంతా ఇప్పుడు కుయ్యో మొర్రో అంటున్నారు. దయచేసి మరో రెండునెలలు వేచి ఉండండి అంటూ ఈసీ చెప్పిన ఆ చల్లటి కబురు.. అభ్యర్థుల్ని కుళ్లబొడుస్తోంది. ఇంటికెళ్లి సౌండ్ రాకుండా కుమిలికుమిలి ఏడుస్తున్నారు నేతలు. రక్తకన్నీరొక్కటే తక్కువక్కడ. మే 13న ఎన్నికలు.. జూన్ 4న కౌంటింగ్ అని ఎలక్షన్ షెడ్యూల్ వచ్చీరాగానే తెలుగురాష్ట్రాల్లో మిక్సడ్ ఫీలింగ్స్. మొదట్లో ఎగిరి గంతులేశారు లీడర్లు. ఎన్నాళ్లో వేచిన ఉదయం ఈనాడే వచ్చెనుగా.. అంటూ ఆ కాసేపూ సంబరాలూ చేసుకున్నారు. ఆ తర్వాతే.. ఒకరి మొహాలొకరు చూసుకుని తెల్లమొహాలేశారు. కారణం.. పోలింగ్ కోసం మరో 56 రోజుల సుదీర్ఘకాలం వెయిట్ చెయ్యాల్సి రావడం. సో.. ఇవాల్టితో మొదలుపెడితే.. దాదాపు రెండు నెలల పాటు ఓటర్ల చుట్టూ చక్కర్లు కొట్టే తీరాలి. కనబడ్డ చోటల్లా చేతులెత్తి మొక్కాలి.. అదొక తియ్యటి నరకం..! ఎవ్వరికీ చెప్పుకోలేని కనాకష్టం. నిన్నమొన్నటిదాకా టికెట్ వస్తుందో రాదో తెలీదు. ఇప్పటికీ కొన్ని చోట్ల ఏ పార్టీ పోటీ చేస్తుందన్న క్లారిటీయే లేదు. ఎలాగోలా బీఫారమ్ తెచ్చుకుని నెల, నెలన్నరలో చావో రేవో తేల్చుకుందామనుకుంటే.. ఇప్పుడు రెండునెలల పోరాటం తప్పనిసరైపోయింది. కొందరైతే నియోజకవర్గంలో తాయిలాల పంపకం కూడా షురూ చేసుకున్నారు. గిఫ్ట్ బాక్సులు పంచిపెట్టినోళ్లంతా ఓటర్లు తమ గుప్పిట్లోనే ఉన్నారన్న భరోసాతో గడుపుతున్నారు. కానీ.. మళ్లీ మనసు మార్చుకుని చేజారిపోకుండా, మరో పార్టీ వైపు చూడకుండా తటస్థ ఓటర్లను కంటికి రెప్పల్లా మే 13 దాకా కాపాడుకుంటూ రావాలి. వీలునుబట్టి ఓటర్ల ఇంటి చుట్టూ ప్రదక్షిణలూ చేయాలి. హతవిధీ.. ఎంత కష్టం.. ఎంత కష్టం..? అధిష్టానాల అవస్థలు కూడా తక్కువేమీ లేవు. ఊరూరా తిరిగి ప్రచారం చేసుకోడానికి కావల్సినంత టైమ్ దొరికిందని సంబరపడిపోవాలా.. 56 రోజుల పాటు ఈ పోరాటం నాన్‌స్టాప్‌గా చేయాల్సిందేనని వేదన చెందాలా? కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది గనుక, దుఃఖాన్నంతా కడుపులోపలే దాచుకుంటున్నాయి పార్టీలు. 16 అసెంబ్లీ, 17 లోక్‌సభ స్థానాల్లో టీడీపీ, 14 అసెంబ్లీ, 2 లోక్ సభ స్థానాల్లో జనసేన ఇంకా అభ్యర్థుల్నే ప్రకటించలేదు. తెలంగాణలో కూడా జాబితాల కసరత్తు అసంపూర్ణంగానే ఉంది. క్యాండిడేట్ల పేర్లు ఖరారు చేయడం ఒక ఎత్తయితే.. వాళ్లతో నియోజకవర్గాల వారీగా ఎదురయ్యే అసమ్మతుల్ని చల్లార్చడం ఇంకో ఎత్తు. 2019లో నోటిఫికేషన్ వెలువడగానే తొలి దశలోనే ఏప్రిల్ 16న పోలింగ్ జరిగింది. పెద్ద గ్యాపేమీ రాలేదు., ఇప్పుడలా కాదు.. ఒక్కొక్క ఓటరునీ దాదాపు రెండునెలల పాటు జాగ్రత్తగా చూసుకోవాలి. ఇది అత్యంత ఓపికతో కూడిన విషయం.. పైగా చాలా ఖరీదైన వ్యవహారం. అంచనా కంటే మించి మరికొన్ని నోట్ల కట్టలు బైటికి తియ్యాలి.. ప్రచారంలో ఖర్చు పెట్టాలి.. కార్యకర్తల్ని మేపాలి.. అవసరాన్ని బట్టి ఓటర్ల మీద కుమ్మరించాలి. తడిసి మోపెడవ్వడం ఖాయం. ఇంతా చేరి పోలింగ్ తేదీని దాటుకుంటే.. ఫలితం కోసం జూన్ 4 దాకా అంటే.. మరో 20 రోజులు ఆగాలి. ఈ క్లారిటీతోనే కడుపు దేవేసినట్లవుతోంది మన నాయకులకు. కళ్లల్లో రక్తకన్నీరు కుక్కుకుని.. కిమ్మనకుండా ఉండిపోయారు తెలుగు రాష్ట్రాల్లో సగటు అభ్యర్థి మహాశయుడు.

# యుద్ధానికి సిద్ధమైన రాజకీయ పార్టీలు..

మొదటి పేజి తరువాయి



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, చత్తీస్గడ్ తోపాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారు కేంద్ర ఎన్నికల కమిషనర్. నామినేషన్లకు సంబంధించి తేదీలు విడుదల చేశారు. ఈ 4వ ఫేజ్ కి సంబంధించి ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడనుంది. ఏప్రిల్ 25 వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవడానికి గడువు ఇచ్చారు. ఏప్రిల్ 26న అధికారులు దరఖాస్తులను పరిశీలిస్తారు. ఒకవేళ నామినేషన్ వేసిన అభ్యర్థులు వాటిని ఉపసంహరించుకునేందుకు ఏప్రిల్ 29 వరకు గడువు ఇచ్చారు. ఈ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు 96 ప్రధాన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు అధికారులు. కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాలు కలిపి మొత్తం 10 చోట్ల ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ మాత్రం మే 13న ఉంటుంది. ఫలితాలు జూన్ 4న విడుదల అవుతాయి. ఈ 4వ విడతలో జరిగే ఎన్నికలు ఎన్నికలు తెలుగురాష్ట్రాల్లో కీలకంగా మారనున్నాయి. ఇటు తెలంగాణలో ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం సాధించి లోక్ సభలో కూడా తన ఉనికిని చాటుకోవాలని ఉవ్విళూరుతోంది కాంగ్రెస్. బీఆర్ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ నాయకులు పక్కపార్టీల వైపు చూస్తున్నారు. ఇక బీజేపీ ఈ సారి 400 ఎంపీ స్థానాలే లక్ష్యంగా కదనరంగంలోకి దిగుతోంది. అందులో భాగంగా తెలంగాణలో కొంత పట్టు సాధించిన కమలదళం ఈ లోక్ సభ ఎన్నికలను ఉపయోగించుకోవాలని చూస్తోంది. మొత్తం 17 స్థానాలకు గాను 12పైగా లోక్ సభ సీట్లలో విజయం సాధించాలని చూస్తోంది. అలాగే ఏపీలో కూడా ఈ సారి ఎన్నికలు హోరాహోరీ వాతావరణాన్ని తలపిస్తోంది. ఒక వైపు అధికార వైసీపీ వై నాట్ 175 అంటూ సిద్ధం పేరుతో ప్రజల ముందుకు వచ్చింది. టీడీపీ మాత్రం జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా నేతల మధ్య నెలకొన్న అసమ్మతితో కాస్త గందరగోళంలో పడింది. అటు అసెంబ్లీ, ఇటు పార్లమెంట్ రెండింటికీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో విజయం ఎవరికి వరిస్తుందో అని రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా దేశ వ్యాప్తంగా ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ రాష్ట్రాంలో ఎవరు విజయం సాధిస్తారో తెలియాలంటే జూన్ 4 వరకు ఎదురు చూడాల్సిందే.

## డిసెంబరు 3... తెలంగాణకు విముక్తి కలిగిన రోజు



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మీట్ ద ప్రెస్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, 2023 డిసెంబరు 3వ తేదీకి ఓ ప్రత్యేకత ఉందని అన్నారు. తెలంగాణకు విముక్తి కలిగిన రోజు అని అభివర్ణించారు. ప్రపంచం అబ్బురపడేలా ప్రజల తీర్పు వచ్చిందని వెల్లడించారు. కేసీఆర్ ది నిజాం నవాబుల వంటి పాలన అని, సంక్షేమ పథకాలు అమలు చేసినా స్వేచ్ఛను హరిస్తే ప్రజలు ఊరుకోరన్న విషయం స్పష్టమైందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. నాడు నిజాం కూడా సంక్షేమ పథకాలు అమలు చేశాడని, కానీ నిజాం ఎంత చేసినా సరే, తమకు స్వేచ్ఛ లేకుండా చేశాడని ప్రజలు తిరగబడ్డారని వివరించారు. కేసీఆర్ కూడా అదే విధంగా తన ఆధిపత్యాన్ని కొనసాగించాలని చూశారని, తన వారసులను సీఎంను చేయాలని చూశాడని రేవంత్ రెడ్డి విమర్శించారు. దాంతో కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు అధికారం నుంచి దింపారని వ్యాఖ్యానించారు. నిజాం తరహాలోనే కేసీఆర్ కూడా రాచరికాన్ని తీసుకురావాలని చూశారని, కేసీఆర్ పాలనలో తెలంగాణ నిర్బంధానికి గురైందని అన్నారు. ప్రజాస్వామ్యంపై కేసీఆర్ కు నమ్మకం లేదని, ప్రజల స్వేచ్ఛకు ఏనాడూ విలువ ఇవ్వలేదని ఆరోపించారు. ఇక, తమ పాలన ప్రజల అభీష్టం మేరకే సాగుతుందని, ప్రజాభిప్రాయాలకు విలువనిస్తామని రేవంత్ రెడ్డి చెప్పారు. ధర్నాలు ఎందుకు? ధర్నా చౌక్ వద్దు అన్న వారికి అక్కడ ధర్నా చేసేందుకు అనుమతి ఇచ్చామని అన్నారు. నియంతలు ఎప్పుడూ సంస్కృతిని ధ్వంసం చేయాలని చూస్తారని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా టీఎస్ ఈఆర్సీ చైర్మన్ తన్నీరు శ్రీరంగారావుపై సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. ఇంటి పేరు తన్నీరు అయినంత మాత్రాన పన్నీరు కాలేరని చురక అంటించారు. కేసీఆర్ నాటిన కలుపు మొక్కలు ఇంకా కొన్ని ఉన్నాయని ఎత్తిపొడిచారు. కలుపు మొక్కలు అన్నింటినీ పీకి పారేస్తామని చెప్పారు. ఇలాంటి కలుపు మొక్కలను పీకిపారేయడానికి రోజుకు 18 గంటలు పనిచేస్తానని స్పష్టం చేశారు. విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ నిన్న మాకు నోటీసులిచ్చింది... ముందుగా డబ్బు కట్టాకే జీరో విద్యుత్ బిల్లు ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది అని రేవంత్ రెడ్డి వివరించారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చినప్పుడు ఈ ఆదేశం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇలాంటి తెలివితేటలు మానుకోవాలని హితవు పలికారు. కేసీఆర్ ఆనవాళ్లు ఇంకా కొన్ని కనిపిస్తూనే ఉన్నాయని, కేసీఆర్ గంజాయి మొక్కలు ఇంకా వాసనలు వెదజల్లుతున్నాయని అన్నారు. అందుకే ఆ గంజాయి మొక్కలను పీకే పనిలో ఉన్నా... ఇప్పటికే కొన్ని గంజాయి మొక్కలు పీకాను... పీకాల్సిన గంజాయి మొక్కలు కొన్ని ఉన్నాయి... గంజాయి మొక్క అనేదే లేకుండా చేస్తా అని హెచ్చరించారు. తన్నీరు కూడా ఆ కుర్చీలో ఎక్కువ రోజులు ఉండరని స్పష్టం చేశారు.

# జగన్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ వేర్వేరు కాదు...

మొదటి పేజి తరువాయి



విశాఖలో ఐఐఎం, ఐఐపీఈ ఏర్పాటు నెలకొల్పాం. విజయనగరం జిల్లాలో గిరిజన వర్శిటీ ఏర్పాటు చేశాం.

### వాళ్లు వాడుకుని పారేస్తారు

ఇప్పుడు మన ముందుకు ఇండియా కూటమి వచ్చింది. ఆ కూటమిలోని వారందరూ ఒకరినొకరు ఉపయోగించుకుని కేవలం అంతవరకు పరిమితం చేస్తారు. వాళ్లది యూజ్ అండ్ త్రో పద్ధతి. వాడుకుని పారేస్తుంటారు. ఇవాళ కాంగ్రెస్ పార్టీకి ఒక విజన్ అంటూ లేదు. వారి భావజాలంపై ఒకసారి దృష్టి చూడండి. కేరళలో వామపక్షాలు కావొచ్చు, కాంగ్రెస్ కానివ్వండి... ఒకరినొకరు తిట్టి పోసుకుంటారు. పశ్చిమ బెంగాల్ లోనూ అంతే. తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు ఒకరినొకరు దూషించుకుంటారు. పంజాబ్ లోనూ పరిస్థితి ఇదే తీరుగా ఉంటుంది. కాంగ్రెస్, ఆప్ ఒకరినొకరు తిట్టుకోవడమే పని. సొంత లాభం తప్ప, వారి దృష్టిలో దేశ ప్రయోజనాలకు ఏమాత్రం విలువ లేదు.

### ఎన్టీఆర్... తెలుగుజాతి కీర్తిపతాక

రామాలయం ప్రారంభం రోజున మీరు ఇంటింటా రాముడ్ని స్వాగతించారు. తెలుగులో ఎన్టీఆర్ గారు శ్రీరాముడు, శ్రీకృష్ణుడి పాత్రలకు తన నటనతో జీవం పోశారు. నటించడం అనడం కంటే ఆ పాత్రల్లో ఆయన జీవించారు అంటే సబబుగా ఉంటుంది. కాంగ్రెస్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన ప్రజలకు ఎన్టీఆర్ ఆపన్న హస్తం అందించారు. పేదలకు, రైతులకు అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. కాంగ్రెస్ దెబ్బతీసిన ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మహనీయుడు ఎన్టీఆర్. తెలుగు ప్రజలకు కాంగ్రెస్ చేసిన అవమానం నుంచే టీడీపీ పుట్టింది. తెలుగుజాతి పౌరుషం ఏంటో చూపించి కాంగ్రెస్ ను మట్టికరిపించిన ఘనత ఎన్టీఆర్ కే దక్కుతుంది. ఎన్టీఆర్ శతజయంతి వేడుకల వేళ వెండి నాణేన్ని కూడా తీసుకువచ్చాం. ఇక, మరొక ఉన్నతమైన వ్యక్తి పీవీ నరసింహారావు. ఆయన తెలుగుజాతి ముద్దుబిడ్డ. ఆయన ఘనతను ఎన్డీయే ప్రభుత్వం గురించి భారతరత్న ప్రకటించింది. కానీ కాంగ్రెస్ పార్టీ ఆయనను ఎంత అవమానించిందో అందరికీ తెలుసు.

### ఏపీ మంత్రులు ఒకరిని మించిన వాళ్లు మరొకరు

ఆంధ్ర రాష్ట్ర ప్రజలు రెండు సంకల్పాలు తీసుకున్నారని భావిస్తున్నా. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వాన్ని స్థాపించాలన్నది ఒక సంకల్పం... అవినీతిలో కూరుకుపోయిన ఇక్కడి ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి పెకలించి వేయాలని ఇక్కడి ప్రజలు భావిస్తున్నట్టు నాకు అర్థమవుతోంది. ఈ రాష్ట్రంలోని మంత్రులు సవ్యమైన పరిపాలన అందించడం కంటే కూడా, ఒకరిని మించి మరొకరు అవినీతి చేయడంపైనే దృష్టి కేంద్రీకరించినట్టు తెలుస్తోంది. ఈ ఐదేళ్లలో ఏపీ అభివృద్ధి సంపూర్ణంగా కుంటుపడింది అని నేను ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

### ఓటు చీలకుండా చూడండి

ఏపీ అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి ఎన్డీయేకి ఓటు వేయాలి. ఏపీ ప్రజలు ఒకటి గమనించాలి. ఇక్కడ జగన్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ వేరు వేరు కాదు. ఈ రెండు పార్టీలు కూడా ఒకే ఒరలో ఉన్న కత్తులు. ఈ రెండు పార్టీల నాయకత్వం ఒకే కుటుంబం నుంచి వచ్చిన విషయాన్ని గమనించాలి. వైసీపీపై ప్రజల్లో ఏదైనా వ్యతిరేకత ఉంటే దాన్ని నెమ్మదిగా కాంగ్రెస్ వైపు మళ్లించడానికి చూస్తున్నారు. అందుకే మీరు ఈ ఎన్నికల్లో తెలివిగా వ్యవహరించి ఓటు చీలకుండా చూడాలి. మీ ఓటును ఎన్డీయే కూటమికే వేయాలి. ఎన్డీయే కూటమి అధికారంలో ఉంటే రాబోయే ఐదేళ్లలో పేదల అభ్యున్నతిని చూడబోతున్నాం. ప్రతి ఒక్కరికీ అవకాశం ఇచ్చే ప్రభుత్వాన్ని మీరు చూడబోతున్నారు. ఎన్డీయే కూటమికి వేసే ఓటుతో... రాబోయే ఐదేళ్లలో ఏపీకి అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం మీరు పునాదులు వేస్తారు. రాబోయే ఐదేళ్లలో పోర్టుల అభివృద్ధి మాత్రమే కాదు, నీలి విప్లవానికి కూడా మీరు ఎన్డీయేకి వేసే మీ ఓటుతో పునాదులు వేస్తారు" అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.





ఈ సందర్భంగా ప్రధాని మోదీ సభకు వచ్చిన వారి మొబైల్ ఫోన్ లైట్లు ఆన్ చేయించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో వెలుగులు నింపండి... ఢిల్లీకి కూడా సందేశం పంపండి... ఏపీలోని ఇంటింటికీ సందేశం పంపండి అని పిలుపునిచ్చారు.

బొప్పూడి ప్రజాగళం సభలో జనసేనాని పవన్ కల్యాణ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా తన ప్రసంగాన్ని ఆసక్తికరంగా ప్రారంభించారు. సీఎం జగన్ పై విమర్శనాస్త్రాలు సంధించారు. "పితృదేవతల ముక్తి కోసం వారి వారసులు హిమాలయ పర్వత శ్రేణుల్లోని గంగోత్రి నుంచి మొదలయ్యే గంగానది ధార కోసం ఎలా ఎదురుచూస్తున్నారో... అలా నరేంద్ర మోదీ గారి రాక కోసం అభివృద్ధి లేక అప్పులతో నలిగిపోతున్న ఆంధ్ర ప్రజానీకం, దాష్టీకం తోటి, దోపిడీ తోటి నలిగిపోతున్న ఆంధ్ర ప్రజానీకం, అవినీతి, ప్రజాస్వామిక విధానాలతో నలిగిపోతున్న ఆంధ్ర ప్రజానీకానికి మన ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాక కోసం అలా ఎదురు చూస్తున్నారు. హిమాలయాల నుంచి గంగమ్మ తల్లి భూమి మీదకు వచ్చి ఎలా సేద దీర్చిందో మన ప్రియతమ ప్రధాని మోదీ రాక, ఈ ఎన్డీయే పునర్ కలయిక 5 కోట్ల మంది ఆంధ్రులకు అలా ఆనందాన్ని ఇచ్చింది. దేశ ప్రజల ఆశీస్సులతో ముచ్చటగా మూడోసారి ప్రధాని కాబోతూ, హ్యాట్రిక్ కొట్టబోతున్న నరేంద్ర మోదీ గారికి ఏపీ ప్రజల నుంచి, జనసేన నుంచి శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాం.

### భారత్ ను విశ్వ గురువుగా మారుస్తున్న శక్తి మోదీ.. జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశాడు: చంద్రబాబు

రాబోయే ఎన్నికల్లో గెలుపు ఎన్డీయేదే అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రధాని మోదీకి అండగా ఉంటామని చెప్పడానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారని చెప్పారు. చిలకలూరిపేటలో టీడీపీ, జనసేన, బీజేపీలు నిర్వహించిన ప్రజాగళం సభలో ప్రసంగిస్తూ చంద్రబాబు ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీని ప్రశంసిస్తూ, ఆకాశానికి ఎత్తేశారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి జగన్ పై విమర్శలు గుప్పించారు.

### చంద్రబాబు ప్రసంగం హైలైట్స్:

మీరు ఇవ్వబోయే తీర్పు రాష్ట్ర భవిష్యత్తను మారుస్తుంది. మీ జీవితాలను తీర్చి దిద్దే బాధ్యత.మూడు పార్టీల జెండాలు వేరైనా... అజెండా ఒకటే.

ప్రజా సంక్షేమం కోసం తపించే వ్యక్తి పవన్ కల్యాణ్. మోదీ అంటే ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం. ప్రపంచం మెచ్చిన గొప్ప నాయకుడు. దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా మార్చడానికి నిర్విరామంగా కృషి చేస్తున్నారు. మోదీ నినాదం... సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్. మోదీ అంటే ఒక నమ్మకం. ప్రపంచంలోని ఆర్థిక వ్యవస్థల్లో 11వ స్థానంలో ఉన్న భారత్ ను 5వ స్థానానికి చేర్చిన నేత మోదీ. త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థానానికి చేరుస్తారు. కరోనా సమయంలో మన ప్రాణాలను కాపాడింది మోదీనే. వంద దేశాలకు వ్యాక్సిన్ అందించిన ఘనత మోదీదే. దేశంలో పేదరికం లేకుండా చేయడం మన సంకల్పం కావాలి. పేదరికం లేకుండా చేయగల శక్తి మోదీకి ఉంది. మోదీ ఆశయాలతో మనమంతా అనుసంధానం కావాలి. సరైన సమయంలో దేశానికి మోదీలాంటి నేత వచ్చారు. దేశం దూసుకుపోతుంటే... రాష్ట్రం పూర్తిగా వెనుకబడిపోయింది. వికసిత్ ఆంధ్రప్రదేశ్ మనందరి లక్ష్యం కావాలి. ల్యాండ్, శాండ్, మైన్, వైన్ పేరుతో రాష్ట్రాన్ని దోచుకున్న దుర్మార్గుడు జగన్. రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి లేదు. ఎక్కడ చూసినా అవినీతి, అక్రమమే. రాష్ట్రంలో ఎక్కడ చూసినా గంజాయి కనిపిస్తుంది. జగన్ అధికార దాహానికి బాబాయ్ బలయ్యాడు. జగన్ ఎలాంటి వాడో ఆయన చెల్లెళ్లే చెపుతున్నారు. మూడు రాజధానుల పేరుతో జగన్ మూడు ముక్కలాట ఆడారు. అమరావతిని భ్రష్టు పట్టించారు. బంగారం లాంటి రాష్ట్రాన్ని నాశనం చేశారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశాం. పోలవరంను జగన్ గోదావరిలో కలిపేశారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను తరిమేశారు. విపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టి రాజకీయాలను కలుషితం చేశారు. జగన్ పాలనకు ముగింపు పలుకుదాం. ఎన్డీఏను గెలిపించుకుందాం.

## ఓణీల ఫంక్షన్ లో పాల్గొన్న సిపిఐ జిల్లా సమితి సభ్యులు, 8వ వార్డు కౌన్సిలర్ కంచర్ల జమలయ్య



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(**గౌతమ్ న్యూస్ **): కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన సింగరేణి కార్మిక ప్రాంతం రామవరం పట్టణంలోని పంజాబ్ గడ్డ 8వ మున్సిపల్ వార్డ్ సిపిఐ శాఖ కార్యవర్గ సభ్యులు మట్టపర్తి రమేష్ కూతురు ఓణీల ఫంక్షన్ లో సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి సభ్యులు 8వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ కంచర్ల జమలయ్య పంజాబ్ గడ్డ సిపిఐ సీనియర్ నాయకులు రాజాని దేవదాస్ సిపిఐ నాయకులు కొత్తూరు రవి, చప్పిడి కోటేశ్వరరావు టిఆర్ఎస్ నాయకులు పితాని అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల కోసం కొత్త మొబైల్ యాప్
# లాంచ్ చేసిన ఎన్నికల కమీషన్

హైదరాబాద్ (**గౌతమ్ న్యూస్ **): దేశవ్యాప్తంగా ఎన్నికల హడ వుడి మొదలైంది. లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో రాజకీయ పార్టీ ల్లో టెన్షన్ వాతావరణం కనబడుతోంది. ఏ నియోజకవర్గం నుంచి ఎవరెవరు పోటీ చేస్తున్నా రని జనాలు తీవ్రంగా చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే తమ నియో జకవర్గంలో పోటీ చేస్తున్న వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులకు సంబంధిం చిన వివరాలు తెలుసుకోవ డానికి ఎన్నికల కమిషన్ ఓ కొత్త మొబైల్ యాప్ ను తీసుకువచ్చింది. అభ్యర్థుల ప్రొఫైల్ తో పాటు అతడు, ఆమెపై ఉన్న వివిధ కేసులు, నేర చరిత్ర వివ రాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. వాస్తవానికి లోక్ సభ ఎన్ని కల షెడ్యూల్ విడుదలకు ముందే ఆయన ఈ యాప్ ను విడుదల చేశారు. 'నో యువర్ క్యాండిడేట్ కేవైసీ పేరుతో ఈ యాప్ ప్రస్తుతం గూగుల్ ప్లే స్టోర్ లో అందు బాటులో ఉంది. ఆండ్రాయిడ్ వినియోగదా రులతో పాటు ఐఓఎస్ వినియోగ దారులకూ ఈ యాప్ ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు రాజీవ్ కుమార్ తెలిపారు. ప్రతీ ఓటరుకు తన నియోజక వర్గంలో పోటీపడుతున్న అభ్యర్థుల గురించి తెలుసు కునే హక్కు ఉందని ఆయన అన్నారు. అభ్యర్థుల నేర చరిత్ర వివరాలు తెలుసుకుంటే ఎవరికి ఓటేయాలనే దానిపై ఓటర్ కు స్పష్టత వస్తుం దని, సరైన అభ్యర్థిని ఎన్నుకునే వెసులుబాటు ఓటర్లకు కలుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించాలి
# ఆరోగ్యమే మహాభాగ్యం

జిల్లా కాంగ్రెస్ నాయకులు,డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి(**గౌతమ్ న్యూస్ **): పాల్వంచ : ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించాలని ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి జిల్లాల డిసిఎంఎస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ పరిధి అల్లూరి సెంటర్ లోని వరలక్ష్మి ఫంక్షన్ హాల్ లో ఆదివారం ఆరోగ్య అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వావ్ హెల్త్ సేవలను కొత్వాల ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ మనం తినే ఆహారం వలన శరీరంలో కొవ్వు అధికంగా పెరిగి అనేక రకాల ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వాటికీ వావ్ హెల్త్ యాప్ ద్వారా చేకేప్ లు నిర్వహిస్తూ ఆరోగ్య సేవలను అందించే కార్యక్రమానికి నిర్వాహకులు శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కొత్వాల కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బాడిశ శంకర్ రావు, బాడిశ ప్రవీణ్ కుమార్, షేక్ హుస్సేన్, బంగారం వర్తక సంఘం అధ్యక్షులు పసుమర్తి రాము, వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాష్, అడ్వకేట్ మల్లెల ఉషారాణి, కాంగ్రెస్ నాయకులు బద్ది కిషోర్, కోండం వెంకన్న, పులి సత్యనారాయణ, శాంతి వర్ధన్, గండు భరత్, కాపర్తి వెంకటాచారి, కేశబోయిన కోటేశ్వరరావు, గల్లా శోభన్ బాబు, ఉపాధి హామీ రంగా, బుడగం రవి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర
## కళ్యాణ మహోత్సవం ను జయప్రదం చేయండి

డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బోడెపూడి విఠల్ రావు




ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ (**గౌతమ్ న్యూస్ **): ఈనెల 19 నుండి 22వ తారీకు వరకు జరుగు కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర కళ్యాణ మహోత్సవ కార్యక్రమమును మరియు ఈ సందర్భంగా జరుగు జాతర కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, కొండాయిగూడెం కొమ్మినేపల్లి పండితాపురం భక్త బృందం పిలుపునిచ్చారు. ఈనెల 19 నుండి 22 వరకు పండితాపురం గ్రామంలో శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి కళ్యాణం, సందర్భంగా దేవాలయ అలంకరణ కార్యక్రమాలు, మరియు జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నీటి వనరులు, వాహనాల పార్కింగ్ స్థలము, వివిధ రకాల షాపులకు స్థల కేటాయింపు ను భక్త బృందం తో పాటు మల్లి బాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బోడెపూడి విఠల్ రావు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ పాత్రికేయులతో మాట్లాడుతూ కొన్ని తరాల నుండి అనాదిగా ఈ గ్రామంలో శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర కళ్యాణం జరుపబడుతూ ఉందని, జాతర కార్యక్రమం పెద్ద ఎత్తున జరుగుతుందని, గతంలో తాళ్ల తిరునాళ్ల గా ప్రసిద్ధి పొందిందని ఈ కార్యక్రమంలో ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం మహబూబాబాద్, నల్గొండ, వరంగల్లు జిల్లాల నుండి భారీ ఎత్తున భక్తులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమం లో కొండాయిగూడెం మత్స్య శాఖ అధ్యక్షులు మేకల మల్లికార్జునరావు, మాజీ సర్పంచ్ బానోతు నరసింహ నాయక్,మేకపోతులమహేష్, చల్ల మల్లయ్య జక్కంపూడి వెంకటేశ్వర్లు ఎల్ హెచ్ పి ఎస్ మండల అధ్యక్షులు భూక్య నాగేంద్రబాబు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్, బండి ఉపేందర్, తొండల ముత్తయ్య, బండి లక్ష్మీనర్సు,జలగం శ్రీను, చల్ల వెంకన్న,సాంబశివరావు బండి నాగరాజు, బొమ్మగాని పిచ్చయ్య బద్దల శేఖర్,తదితరులు పాల్గొన్నారు

## కన్నేటి వెంకన్నకు పొంగులేటి ప్రసాద్ రెడ్డి పరామర్శ

కాచిరాజు గూడెంలో మసీదు సందర్శన

రెడ్డి పల్లి లో నూతన జంటకు ఆశీర్వాదం



ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్(**గౌతమ్ న్యూస్ **): ఇటీవల అస్వస్థతకు గురైన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కన్నేటి వెంకన్న ను కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి మంగళవారం మంగళ గూడెం గ్రామంలోనీ ఆయన నివాసానికి వెళ్లి



పరామర్శించారు. ఏమీ కాదని ధైర్యం చెప్పారు. అక్కడే పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి..యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అంతకు ముందు కాచిరాజుగూడెం లో నూతన



మసీదును సందర్శించారు. అక్కడి ముస్లిం లతో మాట్లాడారు. ఉపవాస దీక్ష విజయవంతం గా పూర్తి కావాలని ఆకాంక్షించారు. ఆ తర్వాత రెడ్డి పల్లి లో తిప్పిరెడ్డి రామకృష్ణా రెడ్డి కుమారుడు అన్వేష్ రెడ్డి రిసెప్షన్ కు హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. ఆ తర్వత పలు శుభకార్యాలకు హాజరై..దీవించారు.

# ముందస్తు ప్రణాళికతోనే ప్రశాంతంగా ఎన్నికలు

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలి: శ్రీనివాస్ ఐపిఎస్.,




రామగుండం(**గౌతమ్ న్యూస్ **): రాబోయే జనరల్ ఎన్నికల చట్టాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి సంబంధించి అవగాహన కల్పించేందుకు కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులకు రామగుండము పోలీస్ కమీషనర్ ఎం. శ్రీనివాస్ ఎన్నికల శిక్షణ సమావేశం రామగుండము పోలీస్ కమిషనరేట్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ .... రానున్న జనరల్ ఎన్నికలకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని దానికి అధికారులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలని సిపి అన్నారు. అధికారులంతా ఎన్నికల నియమావళి కి లోబడి పనిచేయాల్సి ఉంటుందని, ఎన్నికల డ్యూటీ చేస్తున్నటువంటి అధికారులు మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ లో గల అంశాలపై, ఎన్నికల బందోబస్తు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, సిబ్బంది మోహరింపు, కేంద్ర బలగాలతో సమన్వయం తదితర అన్ని అంశాలపై పోలీసు అధికారులకు స్పష్టత ఉండాలి అన్నారు దానికి అనుగుణంగా పోలీసు అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. రాబోయే ఎన్నికలకు సంబంధించి పోలీస్ అధికారులకు ఎన్నికల నియమావళి పట్ల ఎటువంటి అవగాహనా రాహిత్యం లేకుండా, వారికి గల పలు సందేహాలను నివృత్తి చేసేందుకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు. ప్రతి ఎన్నికల్లో కొత్త సవాళ్లు ఎదురవుతాయని ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు వల్నరబుల్ పోలింగ్ ప్రాంతాలకు గుర్తింపు పట్ల స్పష్టత ఉండాలని, ఎన్నికల నిర్వహణలో పోలీస్ పాత్ర భద్రత దళాల మోహరింపు నామినేషన్ దాఖల నుండి ప్రచారం పోలింగ్ రోజు నిర్వహణ తదితర అంశాలపై చేపట్టే ప్రణాళికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమస్యత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వద్ద ఎలా శాంతి భద్రతను పర్యవేక్షించాలి, ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు చేపట్టవలసిన ప్రత్యేక చర్యలు, ప్రత్యేక బందోబస్తు పై సూచనలు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని గత ఎన్నికల్లో అమలు చేసిన గుడ్ ప్రాక్టీస్ ను అమలు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు ముందే ఈ విధంగా అయినా ప్రణాళిక సిద్ధం చేసుకోవడం వల్ల ఎన్నికల నిర్వహణ మరింత సులభతరంగా ఉంటుందని అన్నారు. ఎన్నికలను శాంతియుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఉత్తమ విధానాలు, పారదర్శకత పాటించాల్సిన అవసరాన్ని వివరించారు. గత ఎన్నికల సంబంధిత నేరాల చరిత్ర ఉన్నవారు, రౌడీషీటర్లు, ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే వారి జాబితా సిద్ధం చేసుకోవాలి. వారికి కౌన్సిలింగ్ నిర్వహించి వారిని సంబంధిత అధికారుల ముందు బైండోవర్ చేయాలి. ఎన్నికల సమయంలో జైలు నుండి బయటకు వచ్చిన వారి వివరాలు సేకరించాలి. ట్రబుల్ మంగర్స్ పై నిఘా ఉంచాలి వారిని పోలీస్ స్టేషన్ లకు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించాలి సేన్సేసినల్ కేసులలో నిందితులు, కమ్యూనల్ ఆఫెండర్స్, గొడవలు సృష్టించే వారిని లా అండ్ ఆర్డర్ సమస్య కలిగించే వారిని గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. NBWS, మిగిలిన వారిని కూడా గుర్తించి బైండోవర్ చేయాలని ఆదేశించారు. తమ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్నటువంటి ఆయుధ లైసెన్స్ కలిగిన వారి వద్ద నుండి ఆయుధాలను డిపాజిట్ చేపించాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో నగదు, మద్యం అక్రమ రవాణా, అనుమానిత వాహనాల తనిఖీ, పోలింగ్ స్టేషన్ల నిర్వహణ తదితర భద్రతా సంబంధిత అంశాలను సీపీ గారు తెలిపారు. రామగుండం కమిషనర్ పరిధిలోని ఈరోజు నుండి వారం రోజులపాటు పోలీస్ అధికారులకు తరువాత ఏఎస్ ఐ,హెచ్ సీ,పిసీ లకు ఎన్నికల సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రెండు జిల్లాలకు సంబంధించిన ఏసీపీలు సిఐలు, ఎలక్షన్ సెల్ సీఐ,ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# కక్షిదారులకు సత్వర న్యాయం దిశగా కోర్టులు పని చేయాలి

## హై కోర్టు జడ్జీ కె.శ్రీ లక్ష్మణ్




నర్సంపేట(**గౌతమ్ న్యూస్ **): కక్షిదారులకు సత్వర న్యాయం దిశగా కోర్టులు పని చేయాలని హై కోర్టు జడ్జీ కె.శ్రీ లక్ష్మణ్ అన్నారు. నర్సంపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ , అదనపు జ్యూడిషల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా... ముఖ్య అతిథులుగా విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె లక్ష్మణ్ , నామావరపు రాజేశ్వర్ రావు మాట్లాడుతూ....1937 వ సంవత్సరంలో ప్రారంభమైన నర్సంపేట కోర్టుకు ఎంతో ఘన చరిత్ర కలిగి ఉందని,ఎంతో అనుభవజ్ఞులైన ప్రతిభ గల న్యాయవాదులు ఈ కోర్టులో పనిచేయడం ఈ ప్రాంత వాసుల అదృష్టం అని తెలిపారు. ఈ కోర్టు ద్వార అనేకమంది పేద ప్రజలకు న్యాయం చేకూర్చడం జరిగిందని తెలిపారు. కేసులు ఎక్కువ పెండింగ్స్ ఉన్న కారణంగా అడిషనల్ కోర్ట్ మంజూరు చేశామన్నారు. ఇకనుండి సంవత్సరాల కొద్ది పెండింగ్ ఉన్న అనేక కేసులకు సత్వరమే పరిష్కారం



లభిస్తుందని తెలిపారు. న్యాయవాదులంతా ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతూ,ప్రతిభను సంతరించుకుంటూ కక్షదారులకు న్యాయ వ్యవస్థపై నమ్మకాన్ని కలిగించేలా చేయాలని కోరారు. ఈ సందర్భంగా నర్సంపేట బార్ అసోసియేషన్ వారి విజ్ఞప్తి మేరకు పూర్వకాలపు బిల్డింగ్ ను రెనోవేషన్ చేయించాలని, రికార్డు రూమ్లను సరైన రీతిలో భద్ర పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని,అదేవిధంగా అదనపు జిల్లా న్యాయస్థానాన్ని నర్సంపేటకు మంజూరు చేయాలని కోరగా నేటి ముఖ్య అతిథులైన గౌరవ జడ్జిలు సానుకూలంగా స్పందించారు. నేటి కార్యక్రమంలో భాగంగా 30 సంవత్సరాల పైగా న్యాయవాద వృత్తిలో నర్సంపేట కోర్టులో పనిచేస్తున్న సీనియర్ న్యాయవాదులు గౌరవ ముఖ్య అతిథులచే సన్మానం పొందారు. ఈ కార్యక్రమంలో హై కోర్టు రిజిష్టర్ నందికొండ నర్సింగరావు వరంగల్ జిల్లా న్యాయమూర్తి రాధాదేవి, హన్మకొండ జిల్లా న్యాయమూర్తి కృష్ణమూర్తి,సబ్ జడ్జి సాయి కుమార్,జూనియర్ సివిల్ జడ్జి శిరీష , జిల్లా లోనీ వివిధ కోర్టు ల న్యాయమూర్తులు ,నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేష్ యాదవ్ , కార్యదర్శి సీలువేరు కిరణ్ కుమార్ , ఉపాధ్యక్షుడు పుట్టపాక రవి , సీనియర్ అడ్వకేట్ అంబటి శ్రీనివాస్ ,కొడిదెల సంజయ్ కుమార్,తండా సరంగపాని,తోగరు నర్సింహారెడ్డి,అర్ లక్ష్మీ నారాయణ,,షేక్ రెహముద్దిన్, మోటు రీ రవి, పోనుగోటి అజయ్,




కొడెం శ్రీధర్, జన్ను మహేందర్,టీ సునిత,డి రంగనాధ స్వామి, గుళ్ల ప్రభాకర్,మంకలి ప్రభాకర్,తిరుమల్ చౌహాన్, బొడ్డుపెల్లీ అజయ్, టి స్రవంతి , నాగుల రమేష్,చాగంటి సూరయ్య,జంపాల కేదారి,కోంగరి రాజు,రాజేందర్,మంచిక రమేష్, రఫీ,బోట్ల పవన్,తాళ్లూరి కృష్ణ,కంశాని అశోక్,నాందగిరి రజినీ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చదవాలన్న తపన గోల్డ్ మెడల్ విజేతగా నిలిపింది

విమర్శలనే విజయాలుగా మలచిన డాక్టర్ బంటు కృష్ణ




సూర్యాపేట(**గౌతమ్ న్యూస్ **): చదవాలన్న తపన, ఆరాటం డాక్టర్ బంటు కృష్ణను గోల్డ్ మెడల్ విజేతగా గెలిపిందని తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ మోతిలాల్ నాయక్ అన్నారు. జర్నలిజంలో పీహెచ్డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా తోపాటు రాష్ట్రస్థాయిలో సూర్యాపేట పేరు మారుమోగేలా గోల్డ్ మెడల్ ను కూడా సాధించి రాష్ట్ర గవర్నర్ తమిళ్ సై చేతుల మీదుగా అందుకున్న సూర్యాపేట జిల్లా వాసి, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ బంటు కృష్ణను తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆయన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. అవిరళ కృషితో అసాధ్యాన్ని జర్నలిస్టు కృష్ణ సుసాధ్యం చేశాడని, విమర్శలను విజయాలుగా మలుచుకుని ఇంత పెద్ద ఘనతను సాధించాడని ఆయన ప్రశంసించారు. మాటలు ఎందరో చెప్తారని, కొందరు మాత్రమే ఆచరణ లో పెట్టి గమ్యానికి చేరుకుంటారని, అలాంటి వారిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాదిరిగా ఆయన బాటలోనే నడుస్తున్న నిత్య చదువరి అయిన మనలో ఒకటైన డాక్టర్ బంటు కృష్ణ సూర్యాపేట పేరు, ప్రతిష్టలు ఇనుమడింప చేసేలా విద్యా రంగంలో అగ్ర శిఖరాన్ని చేరుకోవడం మన అందరికీ గర్వకారణం అన్నారు. ఓటమి విజయానికి నాంది అని, ఎన్ని ఫెయిల్యూర్స్ చవిచూసినప్పటికీ అకుంఠిత దీక్ష, కఠోర శ్రమ, మొక్కవోని ధైర్యంతో విజయం సాధించే వరకు పోరాడడం గొప్ప విషయం అన్నారు. ఇంకా ఈ సన్మాన కార్యక్రమంలో తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్, గెజిటెడ్ ఉపాధ్యాయులు ధరావత్ వస్త్రం నాయక్, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్ర బగ్గులాల్ నాయక్, సూర్యాపేట డివిజన్ ఉపాధ్యక్షులు బానోతు లింగ నాయక్, సర్పంచ్ ధరావత్ రవి నాయక్, లారీ అసోసియేషన్ అధ్యక్షులు భూక్య ఉపేందర్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు రెడ్యానాయక్, పెన్ పహాడ్ మండల ప్రధాన కార్యదర్శి సక్రునాయక్, రాంజీ నాయక్, లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 10 వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద
# పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తు

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో(**గౌతమ్ న్యూస్ **): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ర 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో 10 వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఈరోజు ఒక ప్రకటనను విడుదల చేశారు.పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ ను అమలు చేస్తున్నట్లు తెలియజేశారు.పరీక్షలు రాయడానికి హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనవ్వకుండా ప్రశాంతంగా సమాధానాలు రాయాలని సూచించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు వారు చేపట్టే చర్యలకు ప్రజలు మరియు విద్యార్థులు పోలీస్ వారి సూచనలు పాటించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల చుట్టూ 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షా కేంద్రాల దగ్గర అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసివేయబడతాయి.ముందుగానే వారికి నోటీసులు జారీ చేయడం జరిగింది . పరీక్ష రాయడానికి హాజరయ్యే విద్యార్థులు మాత్రమే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుంది.గేటు మూసివేసిన తర్వాత ఎవ్వరినీ లోపలికి అనుమతించరు. విద్యార్థులకు,ఇన్విజిలేటర్స్ మరియు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్స్ నకు కూడా ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవు. పరీక్షా కేంద్రంలో ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే దగ్గరలోని పోలీసు వారికి సమాచారం అందించాలి.

## మంచినీటి బావిని పరిశీలించిన ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి



నర్సంపేట (**గౌతమ్ న్యూస్ **): నర్సంపేట పట్టణంలోని వరమ్మ తోట బావి, ఫిల్టర్ బెడ్, నల్లాల బావిని, సందర్శించిన గౌరవ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గారు మాట్లాడుతూ బావులను, ఫిల్టర్ బెడ్ ను,వెంటనే మరమ్మత్తులు చేసి వేసవిలో పట్టణ ప్రజలకు ఇబ్బందులకు గురి కాకుండా నీరు అందించాలని సంబంధిత మున్సిపల్ సిబ్బందికి సూచించారు...

# అంబులెన్స్ లోనే డెలివరీ

8 నెలల మొదటి కానుపును సుఖ ప్రసవం చేసిన టెక్నిషియన్.

కృతజ్ఞతలు తెలిపిన గర్భిణీ కుటుంబీకులు.



ఏటూరునాగారం(మేడారం)ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్(**గౌతమ్ న్యూస్ **): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామానికి చెందిన మాదరి కృష్ణవేణి 22 కి పురిటి నొప్పులు రావడంతో స్థానిక ఆశ వర్కర్ సహాయం తో అంబులెన్స్ కి సమాచారం అందించారు. పూర్తి సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది గర్భిణీ స్త్రీ ఇంటికి వెళ్లి విషయాన్ని గమనించి ప్రథమ చికిత్స అనంతరం మొదటి కానుపు సుఖ ప్రసవం కోసం రక్త స్రావం అవుతున్న గర్భిణీ చికిత్స అందిస్తూ మెరుగైన వైద్యసేవలకొరకు ములుగు జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో ములుగు కేంద్రానికి సమీపాన నొప్పులు అధికం అవడాన్ని గమనించిన టెక్నిషియన్ శివలింగంప్రసాద్ గర్భిణీ మహిళకు సుఖ ప్రసవం చేశారు. రాత్రి 2 గంటల51 నిమిషాలకు మగ బిడ్డకు జన్మనిచ్చిన బాలింత తల్లి ,బిడ్డల కు ప్రథమ చికిత్స చేసి ఆరోగ్యం గా ఉన్న తల్లీ, బిడ్డలను ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి గైనకాలజీ డాక్టర్ కి జరిగిన విషయాన్ని వివరించి ఆసుపత్రిలో చేర్పించారు. సమాచారం అందించిన వెంటనే 8 గర్భిణీ స్త్రీకి మొదటి కానుపును సుఖ ప్రసవం చేసిన 108 టెక్నిషియన్ శివలింగంప్రసాద్ ని,పైలెట్ ఓదెలును గర్భిణీ స్త్రీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ ఘటనలో స్థానిక ఆశ వర్కర్ రజిత,గర్భిణీ కుటుంబ సభ్యులు ఉన్నారు.

## తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ
# (టిఆర్ఎస్ పార్టీ) గుర్తు రబ్బర్ స్టాంపు

- జై భీమ్ శ్రీనివాస్ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు

నందిగామ(**గౌతమ్ న్యూస్ **): 15-03-2024 శుక్రవారం నాడు కేంద్ర ఎన్నికల సంఘం వారు తెలుగు రాజ్యాధికార సమితి పార్టీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరగబోయే ఎన్నికలకు 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు మరియు 25 పార్లమెంటు నియోజకవర్గాలకు కామన్ సింబల్ -రబ్బర్ స్టాంప్- గుర్తును కేటాయించారు అని టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జై భీమ్ శ్రీనివాస్ ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు రబ్బర్ స్టాంపు గుర్తుతో తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ (టిఆర్ఎస్ పార్టీ) నుంచి 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో మరియు 25 పార్లమెంటు నియోజకవర్గాలలో అభ్యర్థులు ఎన్నికల్లో నామినేషన్ వేస్తారని ఆ పార్టీ అధ్యక్షుడు జై భీమ్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు

## నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్, అరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థల ఆత్మీయ కలయిక

### నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్, అరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం

### తెలుగు రాష్ట్రాల పేద విద్యార్థుల, గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి

### మోహన్ చౌహన్ ఇండియన్, డాక్టర్ అశోక్ పరికిపండ్ల

మహబూబాబాద్ జిల్లా/బెంగళూరు(**గౌతమ్ న్యూస్ ):** నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ మరియు ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థలు తెలుగు రాష్ట్రాల పేద విద్యార్థుల అభివృద్ధి కొరకు, ప్రభుత్వ పాఠశాల మరియు వెనుకబడ్డ గ్రామాల అభివృద్ధి కొరకు కలిసి పని చేయాలని స్వచ్ఛంద సభ్యులు నిర్ణయించినట్లు నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మోహన్, ఎన్.ఐ.టి వరంగల్ పూర్వ విద్యార్థి బెంగళూరులో జరిగిన ఒక సమావేశంలో అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య మిత్ర వ్యవస్థాపకులు డాక్టర్ అశోక్ పరికిపండ్ల, నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మోహన్, జాతీయ కార్యదర్శి జయకృష్ణ ఐఐటీ రోపార్ పూర్వ విద్యార్థి




పాల్గొన్నారు. తమ స్వచ్ఛంద సంస్థలు తెలుగు రాష్ట్రాల పేద విద్యార్థుల అభివృద్ధి తమ వంతు అన్ని విధాలుగా ప్రయత్నం చేయాలని నిర్ణయించారు. తమ స్వచ్ఛంద సంస్థల సేవ భాగాలు అయినా నాణ్యమైన విద్య, ఉపాధి, ఆరోగ్యం మరియు ప్రకృతి పరిరక్షణ పైన ప్రతి గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేసి, తెలుగు రాష్ట్రాల్లో తమ సేవలను విస్తరించాలని నిర్ణయించారు. ఇలాంటి సేవభావం వున్న రాష్ట్ర ప్రజలు అందరూ తమ ఫౌండేషన్ లో భాగం అవ్వాలని కోరారు. వాలంటీర్ గా భాగస్వామ్యం అయ్యే ప్రజలు, స్వచ్ఛంద స్వంస్థలు, స్కూల్స్, కాలేజీలు, వేరే సంస్థలు తమ ఫౌండేషన్ వాట్సాప్ నెంబర్ 78927 82387 కి మెసేజ్ లేదా కాల్ చేయాల్సిందిగా విజ్ఞప్తి చేసారు. జై విజ్ఞాన్, జై భారత్ అనే నినాదంతో ముందుకు వెళ్తున్నారు.

## జ్ఞాపకశక్తి ఒకటే.. తర్ఫీదు తేడా

వజ్రం నాగేశ్వరరావు







గార్ల (**గౌతమ్ న్యూస్ ):** గార్ల.. ఆసక్తి,సాధన,తర్ఫీదు, పునఛ్చరణ ద్వారా సమకూరే జ్ఞాపకశక్తి వరం కాదని, కేవలం ఛాయిస్ లాంటిదని బేసిక్ మెమొరీ ట్రైనర్ వజ్రం నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ ఉన్నత స్థాయికి దోహదం చేసే పండువ లాంటి పరీక్షలు ప్రగతికి సోపానాలన్నారు. చదివినది, విన్నది, చూసినది, అనుభవించినది, ఏదైనా సరే మళ్లీ తిరిగి గుర్తుకు తెచ్చుకోవడానికి వీలుగా మెదడులో (మస్తిష్కం) పదిల పరుచుకునే శక్తినే "జ్ఞాపకశక్తి" అంటారన్నారు. నెగిటివ్ ఫిలింలో ఫోటో దాగి ఉన్నట్లే, జ్ఞాపక శక్తి లేదు అనుకోవటం తమ శక్తిని తామే తక్కువ అంచనా వేసుకోవడం మాత్రమే అన్నారు. గత అనుభవాలను స్మృతి పదంలో ఉంచుకోవడం ద్వారా వారి అభ్యసన సామర్థ్యం పెరుగుతుంది. 1,రీడ్.. అవగాహనతో అర్థవంతంగా చదవటం, 2 రిమెంబర్.. జ్ఞాపకం ఉంచుకొనుట, 3 రికాల్.. పునఃశ్చరణ ద్వారానే జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయి, 4 రీ- ప్రొడ్యూస్.. తిరిగి పరీక్షలో వ్రాయటం. అభ్యాసన పద్ధతులను వినియోగించుకోవాలన్నారు. విషయము విషయ అవగాహన విశ్లేషణతో అర్థమైతేనే గుర్తుండి పోతుందని, అలాగే జ్ఞాపకశక్తి నేర్చుకోవటం అనే కార్యక్రమానికి ప్రాతిపదికగా నిలుస్తుంది. ఎరికిన్ సన్, ఛేజ్, శాస్త్రవేత్తలు అభిప్రాయం మేరకు పామరుల నుంచి పండితుల వరకు జ్ఞాపకశక్తి ఒక్కటేనని, పూర్వజన్మ సుకృతం కాదని వరం అంతకన్నా కాదని, కేవలం ప్రాక్టీస్ (తర్ఫీదు) ద్వారానే సంక్రమిస్తుందన్నారు. ఎవరికి సూపర్ క్వాలిటీ అంటూ ప్రత్యేకతలు ఉండవని శాస్త్రవేత్తల అభిప్రాయాలను గుర్తు చేశారు. నా ఖర్మని, దురదృష్టమని, నా తలరాత, నా విధిరాత, నా మతిమరుపు అంతే, నా గతి ఇంతే, చదివింది గుర్తుండదని, నాకు జ్ఞాపక శక్తి తక్కువని, తనలో తాను బలహీనతలు సృష్టించుకోద్దని, అర్థం లేని భయాలు వద్దని, న్యూనత భావాలనుకు లోను కాకూడదన్నారు. నేను బాగా చదవగలను, చదివింది పరీక్షలో రాయగలను, నేను అనుకున్న జిపిఏ సాధించగలనని విద్యార్థులు పాజిటివ్ దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. చదువులో చేతిరాత సైతం ఒక ముఖ్యమైన భాగమని గ్రాహం అధ్యయనం స్పష్టం చేసిందన్నారు. ప్రశ్నకు సూటిగా రాసే విషయం ప్రధానమని, ప్రశ్నపత్రం చదివాక బాగా రాయగలను అనుకునే ప్రశ్నలకు సెక్షన్ నెంబర్, ప్రశ్న సంఖ్య రాసి చక్కటి చేతిరాతతో సమాధానాలు రాయాలని, తదుపరి మిగతా వాటిని రాయాలని వజ్రం సూచించారు

## తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీకి సోప్ డిష్ ( సోప్ డిష్ ) గుర్తు కేటాయించిన కేంద్ర ఎన్నికల సంఘం


### జై భీమ్ శ్రీనివాస్, టిఆర్ఎస్ పార్టీ (తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ) అధ్యక్షులు

నందిగామ(**గౌతమ్ న్యూస్ ):** 11.03.2024 న అనగా సోమవారం కేంద్ర ఎన్నికల సంఘము టిఆర్ఎస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో 17 పార్లమెంట్ నియోజకవర్గం పోటీ చేయడానికి టిఆర్ఎస్ పార్టీకి సోప్ డిష్ గుర్తును కేంద్ర ఎన్నికల సంఘం కేటాయించింది అని టిఆర్ఎస్ పార్టీ అధినేత జై భీమ్ శ్రీనివాస్ తెలిపారు భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే 17 పార్లమెంటు నియోజకవర్గంల్లో టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఎన్నికలు బరిలో ఉంటారు అని పార్టీ అధ్యక్షులు జై భీమ్ శ్రీనివాస్ తెలిపారు తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే 17 పార్లమెంటు నియోజకవర్గం ఎలక్షన్లకు టిఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసే 17 మంది ఎంపీ అభ్యర్థులు ఇప్పటికే ఖరారు అయ్యారని , ఈ అభ్యర్థులు భవిష్యత్తులో తెలంగాణ పార్లమెంటు ఎలక్షన్ లో చరిత్ర తిరగరాయబోతున్నారని పార్టీ అధ్యక్షుడు ప్రకటన తెలిపారు టిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థులు గెలిచిన తర్వాత పార్లమెంట్లో భారతదేశానికి హైదరాబాదును రెండో రాజధాని చేయాలని పోరాటం చేస్తామని తెలిపారు టిఆర్ఎస్ పార్టీ 17 పార్లమెంట్ అభ్యర్థుల తరపున భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో వారి తరపున ప్రచారం చేస్తానని పార్టీ అధినేత జై భీమ్ శ్రీనివాస్ తెలిపారు టిఆర్ఎస్ పార్టీ ఎప్పుడు బడుగు బలహీన వర్గాలకు సంబంధించిన పార్టీ అని మరియు తెలంగాణ ప్రజలందరూ టిఆర్ఎస్ పార్టీ గుర్తు అయిన సోప్ డిష్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి టిఆర్ఎస్ పార్టీ 17 పార్లమెంట్ అభ్యర్థులని గెలిపించవలసిందిగా టిఆర్ఎస్ పార్టీ (తెలుగు రాజ్యాధికార సమితి) పార్టీ అధ్యక్షుడు జై భీమ్ శ్రీనివాసు కోరారు

## జై భీమ్ శ్రీనివాస్ ఎన్నికల గుర్తు బకెట్ జై భీమ్ శ్రీనివాస్ నందిగామ ఎమ్మెల్యే అభ్యర్థి మరియు విజయవాడ పార్లమెంటు ఎంపీ అభ్యర్థి



నందిగామ(**గౌతమ్ న్యూస్ ):** వచ్చే ఎలక్షన్లలో నందిగామ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా మరియు విజయవాడ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా బకెట్ గుర్తుతో పోటీ చేస్తున్నాను అని జై భీమ్ శ్రీనివాస్ ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు టిఆర్ఎస్ పార్టీ అనగా తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ మరియు నవరంగ్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా ఈ రెండు పార్టీల పొత్తుతో ఉమ్మడి అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని జై భీమ్ శ్రీనివాస్ తెలిపారు టిఆర్ఎస్ పార్టీ ఒక దళిత బిడ్డ పెట్టుకున్న పార్టీ అని మరియు నవరంగ్ కాంగ్రెస్ పార్టీ ఒక మైనార్టీ బిడ్డ పెట్టుకుని పార్టీ అని ఈ రెండు పార్టీల పొత్తు వలన బహుజన ఓట్లు మాకే పడతాయని మాకు నమ్మకం ఉందని జై భీమ్ శ్రీనివాస తెలిపారు వచ్చే ఎన్నికల్లో దళితులు , మైనార్టీలు అందరూ కలిసి ఉమ్మడిగా పొత్తు పెట్టుకుని ,ఎలక్షన్లో పోటీ చేయడమో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక చరిత్ర అవుతుంది అని జై భీమ్ శ్రీనివాస్ తెలిపారు ప్రజల ఆశీస్సులతో ,దేవుడు దీవెనలతో గెలిస్తే విజయవాడ పార్లమెంట్ పరిధిలో ఉన్న ప్రతి కుటుంబానికి విద్య పరంగా, వైద్య పరంగా, న్యాయ సాయం చేస్తానని జై భీమ్ శ్రీనివాస్ తెలిపారు




# నూతన ప్రెస్ క్లబ్బు లోకి వలసలు!!

నాగర్ కర్నూల్ వనపర్తి (**గౌతమ్ న్యూస్ ):** ఇటీవల నూతనంగా ఏర్పడ్డ వనపర్తి ప్రెస్ క్లబ్ నూతన కమిటీలోకి సభ్యులుగా చేరడానికి ఇతర జర్నలిస్ట్ యూనియన్ సంఘాల నుంచి వలసల పరంపరం కొనసాగుతుందని వనపర్తి జిల్లా అధ్యక్షులు అంబటి స్వామి ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు కే రవిశంకర్ గౌడ్ అన్నారు, గత కొన్ని సంవత్సరాల నుంచి జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడంలో



ఘోరంగా విఫలమైన గత జర్నలిస్టు యూనియన్ నాయకులను నమ్మి మోసపోయిన అనేకమంది ప్రతిభగల జర్నలిస్టులు ఈ మధ్యకాలంలో



నూతనంగా జర్నలిస్టు సమస్యల కోసం పోరాటం చేయడానికి ముందుకు వచ్చిన ప్రెస్ క్లబ్ వనపర్తి జిల్లా కమిటీలో చేరడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పక్కనపెట్టి స్వార్థ స్వలాభాల కోసం కుటుంబ పాలన మాదిరిగానే జర్నలిస్టుల పాలన కూడా ఈ తెలంగాణ రాష్ట్రంలో జరిగిందని అందుకోసమే ఇటీవల ప్రభుత్వ నూతనంగా ఏర్పడిన సంగతి నూతన సంఘం ఏర్పడడానికి కారణం అని ఈ సందర్భంగా అన్నారు, ఎవరైనా ఎప్పుడైనా ఎక్కడైనా స్వార్థం పక్షపాతం, ఆవేశం , ఆవేదన అక్రమ సంపాదననే ముఖ్యంగా భావించి పనిచేసే రోజులకు చెల్లు చిట్టి అని చెప్పారు, ప్రతి సంక్షేమ పథకాలలో కూడా పేద ప్రజలకు దరిచేరకుండా ఉండకుండా పోయినప్పుడు జర్నలిస్టులు ముందు స్థానంలో ఉండి ప్రజా గొంతు గళం విప్పి కళం విప్పి ప్రశ్నించే అధికారం ఉన్నప్పటికీ అలాంటి కొంతమంది చేసిన దుర్మార్గమైన పనుల వల్ల ఈరోజు జర్నలిస్టుల దుస్థితి దయనీయ పరిస్థితుల్లో ఉందని ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు, తన సొంత ఇంటి నుంచి ఇండ్ల స్థలాలు ఇచ్చినట్లు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు హెల్త్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు మాయమాటలతోనా వేల రూపాయల డబ్బులు దండుకుని కోట్ల రూపాయలకు పడగెత్తిన గత జర్నలిస్టు యూనియన్ సంఘాల నాయకులను తరిమి కొట్టడానికి మీ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే అధికారం వాక్కు స్వతంత్రం ఉన్న సంగతి తెలిసి కూడా అమాయక మాటలతోనే నట్టేట ముంచినా గత పాలకుల గత జర్నలిస్టు సంఘాల నాయకుల భరతం పట్టడానికి ముందుకు వచ్చిన నూతన కమిటీని నమ్ముకుని ఎంతో మంది జర్నలిస్టులు ప్రెస్ క్లబ్ లో జాయిన్ కావడం అభినందనీయమని వారు ఈ సందర్భంగా అభినందించారు, ఇప్పటికైనా కళ్ళు తెరిచి నష్టపోయిన జర్నలిస్టు అందరు కూడా ఇటీవల నూతనంగా ఏర్పడ్డ ప్రశ్నలు సభ్యులుగా చేరడానికి ముందుకు రావడం పట్ల వారి సమస్యల పట్ల ప్రెస్ క్లబ్ ఎప్పటికీ వెల్లవేళ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతామని ఎవరు భయభ్రాంతులకు గురిచేసిన భయపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు, ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తున్న సంగతి గుర్తుపెట్టుకోవాలని సూచించారు, ఏదోరకంగా అనగదొప్పడానికి ప్రయత్నిస్తే ప్రజాక్షేత్రంలో చేసుకుంటామని ఈ సందర్భంగా అన్నారు,

## రాజకీయాల్లో బాధ గౌని కుటుంబం

### రాజకీయాల్లో అలుపెరుగని నాయకులు!!

నాగర్ కర్నూల్ వనపర్తి (**గౌతమ్ న్యూస్ ):** కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పానగల్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన బాధగౌని కుటుంబానికి చెందిన ముగ్గురు



రాజకీయాలలో అలుపెరుగని పోరాటం చేస్తూ వార్డు నెంబర్ నుంచి మొదలుకుంటే విద్యార్థి సంఘం నాయకుడిగా అంచెలంచెలు గా ఎదుగుతూ ఎంపిటిసి సభ్యులుగా ఒకే కుటుంబంలో ఇప్పటివరకు మూడుసార్లు రిజర్వేషన్ ప్రాతిపదికన ప్రజలు పట్టం కట్టడం



అభినందనీయమని నియోజకవర్గంలోని ప్రజలే కాక వనపర్తి జిల్లాలోని సమీప గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు, పానగల్ మండల చింతకుంట గ్రామానికి చెందిన బి , రమాదేవి 2001 నుంచి 2006 వరకు అప్పటి తెలుగుదేశం పార్టీలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో ఒక చరిత్ర సృష్టించి చింతకుంట మల్లయ్య పల్లి గ్రామాలకు చెందిన ఎంపిటిసి సభ్యురాలుగా గెలుపొందడం జరిగింది, ఆ తర్వాత జరిగిన 2014 నుంచి 2019 వరకు తిరిగి టిఆర్ఎస్ పార్టీ నుంచి బాధగౌని కిరణ్ కుమార్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి అదే కుటుంబం నుంచి రెండోసారి ఎంపీటీసీ సభ్యునిగా అత్యధిక మెజార్టీతో గెలుపొంది విజయ దంక మోగించారు మళ్లీ తిరిగి 2019లో జరిగిన ఎన్నికల్లో చింతకుంట మల్లయ్య పల్లి, గ్రామాల నుంచి తిరిగి రెండోసారి టిఆర్ఎస్ పార్టీ నుంచి బాధగౌని రమాదేవి గెలుపొంది చింతకుంట మల్లయ్య పల్లి గ్రామాలకు ఎనలేని సేవలు అందిస్తూ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా మిగిలిపోయారు, రాజకీయాలంటే ఒక కుటుంబంలో ఒక్కసారి మాత్రమే ప్రజలు ఆదరించి అభిమానిస్తున్న ఈ రోజుల్లో ఎమ్మెల్యే ఎంపీలతో సహా రెండోసారి మూడోసారి గెలపొందకుండా కుటుంబ రాజకీయాలు పనికి రాకుండా చేస్తున్న ఈ రోజుల్లో చింతకుంట మల్లయ్య పల్లి గ్రామాల మధ్యన జరిగిన ఎంపిటిసి ఎన్నికల్లో మాత్రం చింతకుంట గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన బి రమాదేవి రెండుసార్లు , బి కిరణ్ కుమార్ ఒకసారి వహిస్తూ ప్రజలకు ప్రజాసేవ కోసం నిరంతరం పరితపిస్తూ నిరంతరం ప్రజల మధ్యన ఉంటూ ప్రజలకు సేవ చేయడమే వాళ్ళ గెలుపుకు శిరోధార్యమని ఆ గ్రామాల ప్రజలు అంటున్నారు, అయినా గ్రామ రాజకీయలే కాదు మండల స్థాయి రాజకీయాల్లో కూడా పై ముగ్గురు వ్యక్తులు కీలకపాత్ర పోషిస్తున్నారని పానగల్ మండలంలోని కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం లోని ఎమ్మెల్యే స్థాయి అభ్యర్థులు మండల పరిషత్ అధ్యక్షులు జడ్పిటిసిలు సర్పంచులు ఎంపిటిసిలు రాజకీయ అనుభవం వలన రమాదేవి రవీందర్ గౌడ్ తో పాటు బి కిరణ్ కుమార్ గౌడ్ సేవలు ఎప్పటికీ ఉంటాయని వారి అడుగుజాడల్లో మండల ప్రజలు గ్రామ ప్రజలు ఎప్పటికీ ఎల్లవేళలా సహాయ సహకారం అందిస్తామని ప్రజలు హామీ ఇచ్చారు, రాబోయే రాజకీయాల్లో వారు ఏ పార్టీలో మొగ్గు చూపిన ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి, ప్రజల సమస్యలు గ్రామ సమస్యల పరిష్కారం దిశగా పని చేసే నాయకుని ఎన్నుకుంటామని ప్రజలు హామీ ఇవ్వడం గర్వ కారణం, వాళ్ల రాజకీయ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల అభివృద్ధి కోసం ప్రజల సంక్షేమం కోసం బి రమాదేవి తో పాటు ఆమె భర్త బి రవీందర్ గౌడ్, తమ్ముడు బి కిరణ్ కుమార్ గౌడ్ ఏ పార్టీలో చేరిన ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉంటుందని ప్రజలు ఈ సందర్భంగా హామీ ఇస్తున్నారు,

## అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఏది....



### నిద్రవస్త లో అధికారులు..

నల్లబెల్లి మండల (**గౌతమ్ న్యూస్ ):** మండలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్న అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలో కొంతమంది గ్రామపంచాయతీ అనుమతి లేకుండా జి ప్లస్ 2 వరకు అక్రమంగా భవనాలు నిర్మిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా ఇండ్ల నిర్మాణాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అలాగే మండలంలోని శనిగరం నల్లబెల్లి గ్రామాల పరిధిలో అనేక అసైన్డ్ భూములు ఉన్నాయి, వీటికి ప్రభుత్వ స్థలాలుగా రెవెన్యూ అధికారులు గుర్తించినప్పటికీ హద్దులు ఏర్పాటు చేయకపోవడం వల్ల క్రయ విక్రయాలు కొనసాగుతూ భవన నిర్మాణాలు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదంతా జరుగుతున్న రెవెన్యూ జిపి అధికారులు చోద్యం చూడడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై తాసిల్దార్ రాజేష్ ను వివరణ కోరగా... అనుమతి లేకుండా భవన నిర్మాణాలు చేపట్టిన అసైన్డ్ భూముల్లో క్రయవిక్రయాలు చేపట్టి ఇండ్లు నిర్మించిన భవనాలను కూల్చివేస్తామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు నిద్ర మత్తు వదిలి అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## పరీక్షలు రాసే విద్యార్థులకు త్రాగునీరు సదుపాయం కల్పించాలి



మెట్టుపల్లి(**గౌతమ్ న్యూస్ ):** పదో తరగతి పరీక్షల కేంద్రాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి అని ఏబీవీపీ మెట్ పల్లి నగర కార్యదర్శి కాసిపాక అరవింద్ అన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్ష కేంద్రాలలో త్రాగు నీరు సదుపాయం కల్పించాలని , రూంలలో పరిశు భ్రత పాటించాలని మరియు అత్యవసర సమయం లో విద్యార్థులుకు ప్రాథమిక చికిత్స అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నగర కార్యదర్శి కాసిపాక అరవింద్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు పరీక్ష సమయాలు దృష్టిలో పెట్టుకొని ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా నిశ్చింతగా తాము చదివిన అంశాలు జవాబు పత్రాలలో వ్రాయలని సూచించారు. ఆల్ ది బెస్ట్ చెప్పారు.

## ప్రజావాణి కార్యక్రమం రద్దు

### జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా (**గౌతమ్ న్యూస్ ):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోలోక్ సభ ఎన్నికలు-2024 నోటిఫికేషన్ విడుదల అయినందున ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి ప్రజావాణి కార్యక్రమ నిర్వహణ వివరాలను ప్రకటించడం జరుగుతుందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని తెలిపారు.


## జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఐపిఎస్., ఆదేశాలతో పోలీసు అధికారులు, సిబ్బంది మద్యం, ఇసుక, గంజాయి, కోడిపందాలు మరియు జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై దాడులు నిర్వహించి, రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్ఫోర్స్మెంట్ కేసులు నమోదు






అనకాపల్లి(**గౌతమ్ న్యూస్ ):** కోడి పందాలు, జూదం తదితర లు అరికట్టేందుకు పోలీసులు దాడి చేసి ఒక కేసు నమోదు చేసి, ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రూ.1,500/- నగదును స్వాధీనం చేసుకున్న జిల్లా పోలీసులు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 9 మందిపై కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగించిన 26 మంది పై కేసులు నమోదు చేశారు. ఎం.వి.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 236 కేసులు నమోదు చేసి, ఈ-చలానా గా రూ.45,020/- లు విధించారు. ప్రజలకు దిశా యాప్ పట్ల అవగాహన కల్పించి, 16 మందితో యాప్ డౌన్లోడ్ చేయించారు. 6,03,550 మంది తో యాప్ ను డౌన్లోడ్ చేయించగా, 2,13,850 మందితో రిజిస్ట్రేషన్ చేయించారు. జిల్లా పోలీసులు, సెబ్ అధికారులు దాడి చేసి, 17 కేసులు నమోదు చేసి, 16 మంది నిందితులను అదుపులోనికి తీసుకుని, 29 లీటర్ల అక్రమ మద్యం, 20 లీటర్ల నాటుసారా ను స్వాధీనం చేసుకుని, 600 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేసిన పోలీసులు. ఎస్పీ ఆదేశాలతో రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని, పోలింగు కేంద్రాలను సందర్శించి, గ్రామస్తులతో సమావేశమయ్యి ఎన్నికలకు సంబంధించి గ్రామస్తులకు అవగాహన కల్పించాలని, ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో కేంద్ర పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకొనేలా ప్రజల భద్రతకు భరోసా కల్పించాలని అధికారులను ఆదేశించారు.

## కసింకోట వైఎస్ఆర్సిపి నాయకులను కలిసిన అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్



అనకాపల్లి (**గౌతమ్ న్యూస్ ):** కసింకోట మండలం,ఉగ్గినపాలెం గ్రామ సమీపంలో కసింకోట మండల పార్టీ అధ్యక్షులు మలసాల కిషోర్ గెస్ట్ హౌస్ నందు కసింకోట మండలంలో గల వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. పల్లపు సోమవారం గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు గౌతు నాయుడు ఆధ్వర్యంలో ఎద్దు అప్పారావు,గొంతిన నాయుడు,కుంచ ఉపేంద్ర, నారిపల్లి నానాజీ లకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనకాపల్లి లో పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ భద్రావతి సమేత భవన్నారాయణ స్వామివార్ల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. కమిటీ సభ్యులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అనకాపల్లి,మూలపేట,ఊడేరు గ్రామాల్లో జరుగుతున్న వివిధ రజస్వల ఫంక్షన్ ల లో పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ప్రధానమంత్రి సభ!!

## వనపర్తి డిఎస్పి శ్రీనివాస్ యాదవ్!!



నాగర్ కర్నూల్ వనపర్తి **(గౌతమ్ న్యూస్ ):** ఈనెల 16న నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగిన భారత ప్రధాని నరేంద్ర మోడీ విజయసంకల్పయాత్ర ప్రశాంతంగా జరిగినట్లు నాగర్ కర్నూల్ డిఎస్పి బుర్రి శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు, ఆదివారం విజయ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఉద్దేశించి గౌతమ్ న్యూస్ ఛానల్ ప్రతినిధి తో మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాల్లో త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విజయ సంకల్ప యాత్ర పేరుతోనే నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో భారీ బహిరంగ సభ నిర్వహించారని ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నల్లమల్ల అటవీ ప్రాంతంలో పర్యటించిన నరేంద్ర మోడీకి పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని డిఎస్పి శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు, నరేంద్ర మోడీ పర్యటనకు కేంద్ర బలగాలు వచ్చినప్పటికీ స్థానిక పోలీసులు ముఖ్యంగా నాగర్ కర్నూల్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని కొల్లాపూర్ నాగర్ కర్నూల్ అచ్చంపేట కల్వకుర్తి ప్రాంతాలలోని సర్కిల్ ఇన్స్పెక్టర్ లతో పాటు ఎస్సైలు హెడ్ కానిస్టేబుల్ సివిల్ కానిస్టేబుల్ తో పాటు కేంద్ర బలగాల సహకారంతో న జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు, ఏది ఏమైనప్పటికీ నాగర్ కర్నూల్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ సహాయ సహకారాలతో ఆదేశాలతో ఎప్పటికప్పుడు పటిష్టమైన నిఘా విభాగం ఉంటుందని రాబోయే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామని ఆయన అన్నారు, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రలోభాలకు గురికాకుండా ప్రజలు చైతన్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు, నాగర్ కర్నూలు జిల్లాలో ఏ విషయంలో కూడా పోలీసులు ఎప్పుడు కూడా నిష్పక్షపాతంగా పనిచేస్తున్నారని సంగతి ఈ సందర్భంగా గుర్తు చేశారు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విజయసంకల్పయాత్ర విజయటంతంగా ముగిసిన సందర్భంగా జిల్లాలోని పోలీసులను అభినందించారు,

# బడుగు బలహీన వర్గాలు, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ని గెలిపించండి



మెట్టుపలి**(గౌతమ్ న్యూస్ ):** మల్లాపూర్ మండలం ఓబులాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మెట్పల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల నర్సు హన్మాండ్లు మాజీ వైస్ చైర్మన్ కౌన్సిలర్ యమా రాజయ్య మాట్లాడుతూ జరగబోయే పార్లమెంట్ ఎలక్షన్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవడమే మా ధ్యేయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి గాంధీ కుటుంబం ఎంతగానో సేవ చేసిందని రాహుల్ గాంధీ ని ప్రధానిగా చేయాలనే కోరిక మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ శ్రీ కొమిరెడ్డి రాములు అని రైతులు రైతు కూలీలు బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీలు సబ్బండ వర్గాలు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని తెలిపారు జువ్వాడి నర్సింగరావు కొమిరెడ్డి కరంచంద్ ఆధ్వర్యంలో ఎంపీ ఎలక్షన్లో కోరుట్ల నియోజకవర్గం లో అధిక ఓట్లు రావడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో మల్లాపూర్ మండల అధికార ప్రతినిధి బోయిని హన్మాండ్లు యూత్ కాంగ్రెస్ నాయకులు జావిడి రాజారెడ్డి మరియు ముదిరాజ్ యువజన నాయకులు పలుగొన్నారు

# పదవ తరగతి పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు

## కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్ .



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా **(గౌతమ్ న్యూస్ ):** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లోని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుండి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలో 10 వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ శాఖ పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కే సురేష్ కుమార్ ఆదివారంఒక ప్రకటనను విడుదల చేశారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ ను అమలు చేస్తున్నట్లు తెలియజేశారు.పరీక్షలు రాయడానికి హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనవ్వకుండా ప్రశాంతంగా సమాధానాలు రాయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు వారు చేపట్టే చర్యలకు ప్రజలు మరియు విద్యార్థులు పోలీస్ వారి సూచనలు పాటించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల చుట్టూ 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షా కేంద్రాల దగ్గర అన్ని జిరాక్స్ సెంటర్స్ మూసివేయబడతాయి.ముందుగానే వారికి నోటీసులు జారీ చేయడం జరిగింది. పరీక్ష రాయడానికి హాజరయ్యే విద్యార్థులు మాత్రమే పరీక్ష కేంద్రంలోనికి అనుమతించడం జరిగుతుంది. గేటు మూసివేసిన తర్వాత ఎవ్వరినీ లోపలికి అనుమతించరు. విద్యార్థులకు, ఇన్విజిలేటర్స్ మరియు ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్స్ నకు కూడా ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవు. పరీక్షా కేంద్రంలో ఏమైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే దగ్గరలోని పోలీసు వారికి సమాచారం అందించాలి.

# ఉత్కంఠ పోరు లో దేగడెవిల్స్ ద్వితీయ బహుమతి సాధించింది

## జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జ వ్వాజి.అనిల్ గౌడ్.



ద్వితీయ బహుమతి పొందిన క్రీడాకారులను అభినందిస్తున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జవాజి అనిల్ గౌడ్

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా **(గౌతమ్ న్యూస్ ):** కొముర౦ భీం జిల్లా గోలేటి లో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్లో తిర్యాని మండలానికి చెందిన దేగ డెవిల్స్ క్రికెట్ జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాజి అనిల్ గౌడ్ .క్రీడాకారులను అభినందించి బహుమతులను అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయిలో మారుమూల మండలమైన తిర్యాని మండల క్రీడాకారులు అద్భుత ప్రదర్శనను కనబరిచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకోవడం హర్షించదగ్గ విషయమని క్రీడాకారులనుఅభినందిస్తున్నానని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రేబ్బన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సుదర్శన్ గౌడ్ చిరంజీవి గౌడ్ రాజేష్ మద్దెల . సురేందర్ రాజు. క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు .

# ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో 55వ పేదింటి అమ్మాయిల వివాహం





మెట్టుపల్లి **(గౌతమ్ న్యూస్ ):** మెట్పల్లి పట్టణంలోని కోర్టు వాడ లో నివసిస్తున్న లావణ్య డి/ఓ మద్దివేని నర్సవ వెంకటేష్ నిరుపేద కుటుంబం అని ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ కి సమాచారం తెలుపగా ట్రస్ట్ వారు వెళ్లి వివరాలు తెలుసుకొని పెళ్లికి కావలసిన లిపుస్తె మట్టెలు, పెళ్లి కూతురికి పట్టు చీర,150 మందికి సరిపడ భోజనం సరుకులు అందించడం జరిగింది..

# ఆపిల్ ప్లే పాటశాల లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

## బహుమతులు అందించిన ఎమ్మెల్యే సతీమణి నీలిమ రెడ్డి



కాజిపేట**(గౌతమ్ న్యూస్ ):** కాజీపేట 47డివిజన్ లో ఆపిల్ ప్లే స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమా రెడ్డి. విద్యార్థులకు బహుమతులు అందజేశారు ఈ సందర్భంగా ఆయన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమారెడ్డి మాట్లాడుతూ ప్లే స్కూల్ నడుపడం ఇబ్బందులతో కూడుకున్న పని అని రిస్క్ తీసుకొని నడుపుతున్న ప్రిన్సిపాల్ జి రాజు, రమాదేవి లను అభినందించి సన్మానించారు 47డివిజన్ ప్రజలు తమను గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిల్ లారెన్స్, డివిజన్ అధ్యక్షులు ఎస్ కే అస్గర్, శివకృష్ణ, ఇప్పశ్రీకాంత్, సమతా,రేవతి, నాగరాజు, దార్ల రాజకుమార్, బిదరి రాజేందర్, మధు, నికుంజన్, దొంగలకుమారుస్వామి, భానుచందర్, వీరేష్, బబ్లు, కిరణ్, భరత్ రాజ్, శ్యామ్, ప్రభాకర్, మల్లేశం, జానపట్ల యాదగిరి, బండారి నర్సింగ్, రామ్, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు



# నందిగామ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ తంగిరాల సౌమ్య

## ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోది సత్కరించిరు




నందిగామ**(గౌతమ్ న్యూస్ ):** గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోది తెలుగుదేశం పార్టీ తరపున చిలకలూరి పేట సభావేదిక మీద సత్కరించిన మన నందిగామ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీ తంగిరాల సౌమ్య

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న తుంబూరు దయాకర్ రెడ్డి



ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్**(గౌతమ్ న్యూస్ ):** నేలకొండపల్లి మండల కేంద్రంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు నిర్వహించిన ఇఫ్తార్ విందులో మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి పాల్గొన్నారు. ముస్లింలు అత్యంత పవిత్రమైన పర్వదినంగా జరుపుకునే రంజాన్ పండుగ ప్రతీ ఒకరికి సకల శుభాలు కలగచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరి భద్రయ్య, చెర్వు స్వర్ణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లో జరిగిన పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు

## జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్



ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ **(గౌతమ్ న్యూస్ ):** లోక్ సభ సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినందున, ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమైనందున ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు నిర్వహణలో భాగంగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికముగా రద్దు చేయడం జరిగిందని, ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# క్రీడలు మానసికవు ఉల్లాసానికి ఫిజికల్ ఫిట్నెస్ కు ఎంతో దోహదపడుతాయి

## సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా.



భద్రాద్రి కొత్తగూడెం ఆర్ సి **(గౌతమ్ న్యూస్ ):** కొత్తగూడెం : ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలంలోని రుద్రంపూర్ ఏరియా ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్ నందు చాలెంజర్స్ కప్ 2024 క్రికెట్ పోటీలకు ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా పాల్గొని మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దౌరుద్య నికి మనిషి ఒత్తిడి తగ్గించడానికి దోహదపడతాయని విద్యతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరం మనిషి వ్యక్తిత్వ వికాసాన్ని పెంచే క్రీడల పట్ల మా సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని యువత పెడదారి పట్టకుండా సన్మార్గంలో నడిపించే వారి ఆలోచన విధానం మార్చడానికి క్రీడలు దోహదపడతాయని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఏఐటియుసి సెంట్రల్ కార్యదర్శి గనిగల వీరస్వామి, ఏఐటియుసి బ్రాంచ్ సహాయ కార్యదర్శి జక్కుల గట్టయ్య, ఐఎన్టియుసి కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు రజాక్ , సిపిఐ రుద్రంపూర్ శాఖ కార్యదర్శి తోటరాజు,5 షాఫ్ట్ ఫిట్ సెక్రటరీ హుమాయూన్, సిపిఐ నాయకులు దస్రూ,రామ్ చందర్, క్రికెట్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ చేకూరి వెంకట్,రాకేష్ ,హనుమంతు తదితరులు పాల్గొన్నారు

# 'వెనక్కి తగ్గేది లేదు.. గాజాపై దాడులు కొనసాగిస్తాం'

గాజాపై ఇజ్రాయెల్ సైన్యం చేస్తున్న దాడులకు సంబంధించి ప్రపంచ దేశాల ఒత్తిడిని ప్రధానమంత్రి బెంజమిన్ నెతాన్యహు తోసిపుచ్చారు. ఆదివారం ఆయన కేబినెట్ సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఎలాంటి అంతర్జాతీయ ఒత్తిళ్లు తలొగ్గి మేము యుద్ధంలో మా లక్ష్యాన్ని మధ్యలో ఆపలేము. హమాస్‌ను అంతం చేయటం, బంధీలను విడిపించుకోవటం, గాజాలోని హమాస్‌కు వ్యతిరేకంగా పోరాటం విషయంలో ప్రపంచ దేశాల ఒత్తిడిని పట్టించుకోం. రఫా నుంచి దాడులు కొనసాగిస్తాం. మరికొన్ని వారాల పాటు దాడులు జరుపుతాం' అని అన్నారు. ప్రపంచ దేశాల ఒత్తిడిపై కూడా బెంజమిన్ నెతాన్యహు స్పందించారు. 'మీకు జ్ఞపకశక్తి తక్కువగా ఉందా? అక్టోబర్7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన భీకరమైన దాడులు అంత త్వరగా మర్చిపోయారా? హమాస్ వ్యతిరేకంగా పోరాడుతున్న ఇజ్రాయెల్‌ను ఇంత త్వరగా వ్యతిరేకిస్తారా?' అని తీవ్రంగా మండిపడ్డారు. దాడుల సమయంలో రఫా నగరం నుంచి పౌరులను ఖాళీ చేయాలనే ప్రణాళికతో ఉన్నామని తెలిపారు. అయితే ఈ విషయంలో మిత్రదేశాలు ఇజ్రాయెల్‌పై సందేహం వ్యక్తం చేస్తున్నాయని అన్నారు. ఇప్పటివరకు ఇజ్రాయెల్ చేసిన దాడిలో 31,600 మంది పాలస్తీనా పౌరులు మృతి చెందారు. అక్టోబర్ 7న హమాస్ చేసిన మెరుపుదాడిలో 1200 మంది ఇజ్రాయెల్‌పౌరులు మృతి చెందారు. 253 మంది ఇజ్రాయెల్ పౌరులను హమాస్ బలగాలు బంధీలుగా తరలించుకుపోయిన విషయం తెలిసిందే.

# ఏడు రోజులపాటు కస్టడీకి అప్పగించిన ఢిల్లీ అవెన్యూ కోర్టు

- ఈడీ కస్టడీకి కవిత
- ఈ నెల 23న మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి కోర్టులో హాజరుపర్చాలని ఆదేశాలు
- అంతకుముందు సుదీర్ఘంగా ఇరుపక్షాల వాదనలు
- సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగా అరెస్టు చట్టవిరుద్ధమన్న కవిత లాయర్లు
- నిబంధనల మేరకే అదుపులోకి తీసుకున్నామన్న ఈడీ
- కుంభకోణంలో ఆమె పాత్రపై ఆధారాలు ఉన్నాయని వివరణ
- కవిత భర్త అనిల్, ముగ్గురు వ్యక్తిగత సిబ్బందికి ఈడీ నోటీసులు!
- సోమవారం ఢిల్లీలో విచారణకు రావాలని సూచన



న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టు ఏడు రోజుల ఈడీ కస్టడీకి అప్పగించింది. తిరిగి ఈ నెల 23న మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి కోర్టులో హాజరుపర్చాలని ఈడీ అధికారులను ఆదేశించింది. ఈడీ కవితను శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో అరెస్టు చేసి, ఢిల్లీకి తరలించిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం ఇద్దరు వైద్యులను ఈడీ కార్యాలయానికి పిలిపించి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం ఉదయం 11.30 సమయంలో ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు ముందు హాజరుపర్చారు. మద్యం స్కాం కేసుకు సంబంధించి కవిత నుంచి కీలక అంశాలు రాబట్టాల్సి ఉందని, ఆమెను 10 రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు.

### అరెస్టు అక్రమం: కవిత తరఫు న్యాయవాది

కవిత అరెస్టు అక్రమమని ఆమె తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి కోర్టుకు చెప్పారు. శుక్రవారం కవితను అరెస్టు చేసిన ఈడీ అధికారులు.. ఆమెను కలిసేందుకు తమకు అనుమతివ్వలేదని, విచారణకు ముందు ఆమెతో మాట్లాడేందుకు ఐదు నిమిషాలు సమయం ఇవ్వాలని కోరారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ నాగ్‌పాల్.. కవితతో మాట్లాడేందుకు అనుమతించారు. కాసేపటి తర్వాత విచారణ తిరిగి ప్రారంభించారు. సెప్టెంబర్ 15న సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తదుపరి విచారణ వరకూ కవితపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోబోమని ఈడీ హామీ ఇచ్చిందని న్యాయవాది విక్రమ్ చౌదరి గుర్తు చేశారు. కానీ ఆ హామీని ఉల్లంఘించి కవితను అక్రమంగా అరెస్ట్ చేసిందని చెప్పారు. ఇలా సుప్రీంకోర్టులో విచారణలో ఉన్న సమయంలో కవితను అరెస్టు చేయడాన్ని బ్లాక్‌డేగా అభివర్ణించారు. సుప్రీంకోర్టు మహిళలను విచారించే అంశంలో నళిని చిదంబరం వేసిన పిటిషన్‌కు కవిత పిటిషన్‌ను జతచేసి, విచారణకు చేపట్టిందని న్యాయమూర్తికి వివరించారు.

### నిబంధనల మేరకే అరెస్టు చేశాం: ఈడీ

కవితను నిబంధనల మేరకే అరెస్టు చేశామని ఈడీ తరఫు న్యాయవాది జోసెబ్ హుస్సేన్ కోర్టుకు విన్నవించారు. పత్రికల్లో వచ్చిన విషయాలను పరిగణనలోకి తీసుకోవద్దని న్యాయమూర్తిని కోరారు. తర్వాతి 10 రోజుల్లో సమన్లు ఇవ్వబోమని మాత్రమే సెప్టెంబర్ 15న సుప్రీంకోర్టుకు ఈడీ చెప్పిందని.. విచారణ నుంచి మినహాయింపు ఇవ్వలేదని వివరించారు. ఒక ఆర్డర్ అనుకూలంగా ఉంటే దానిని నిరవధిక కాలానికి వర్తింపజేసుకోవద్దని, ఇతరులకు ఇచ్చిన ఉత్తర్వులను, మధ్యంతర ఉత్తర్వులను మొత్తానికి వర్తించుకోవడం సరికాదని స్పష్టం చేశారు. కవితపై తీవ్ర చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని, కవిత సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి మాత్రమే చేశారని జోసెబ్ వివరించారు. లిక్కర్ స్కాం కేసులో కవిత పాత్రపై ఆధారాలు ఉన్నాయని, ఆమె నుంచి కీలక అంశాలు రాబట్టేందుకు పది రోజులు ఈడీ కస్టడీకి ఇవ్వాలని కోరారు. ఇరువర్గాల వాదనలను విన్న రౌజ్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి.. సాయంత్రం 4.30 గంటలకు తీర్పు వెలువరించారు. కవితను ఏడు రోజుల పాటు ఈడీ కస్టడీకి అనుమతించారు.

### నా అరెస్టు అక్రమం: కవిత

ఈడీ అదుపులో ఉన్న ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలో కోర్టుకు హాజరయ్యే ముందు మీడియాతో మాట్లాడారు. తనను ఈడీ అధికారులు అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. దీనిపై పోరాటం చేస్తామని చెప్పారు. కాగా కవిత భర్త అనిల్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, రవిచంద్ర, బడుగుల లింగయ్య యాదవ్, కవిత పీఏలు రాజేశ్, అశోక్ కౌశిక్ తదితరులు రౌజ్ అవెన్యూ కోర్టుకు వచ్చారు. కోర్టులో జరిగిన వాదనలు విన్నారు.

### కవిత భర్త అనిల్, వ్యక్తిగత సిబ్బందికి ఈడీ నోటీసులు!

కవిత భర్త అనిల్‌కు, ఆమె వ్యక్తిగత సిబ్బంది ముగ్గురికి ఈడీ నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. వారిని సోమవారం ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని పేర్కొన్నట్టు సమాచారం. హైదరాబాద్‌లో సోదాల సందర్భంగా ఈడీ అధికారులు ఈ నలుగురి ఫోన్లను సీజ్ చేశారు కూడా.

# టార్గెట్.. బీఆర్ఎస్ ఖతం!

## 38 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో మూడో వంతు మందిని దారిలోకి తెచ్చుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రణాళిక

## అండగా ఉంటామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే భరోసా ఇస్తున్నారన్న సీఎం రేవంత్

హైదరాబాద్: 'నన్ను నా పని చేయనిస్తే ప్రతిపక్షాలుగా మీ పని మీరు చేసుకోవచ్చు. నాకేదో కాళ్లలో కట్టె పెట్టాలి. ఈ ప్రభుత్వాన్ని పడగొట్టాలనుకుంటే... మిమ్మల్ని దించుతామని చెప్పి దించి చూపెట్టాం. ఇప్పుడు కూడా స్పష్టంగా చెబుతున్నా. పడగొట్టాలన్న ఆలోచన మీరు చేస్తే మీరు నిద్ర లేచే లోపు మీ పక్కన ఎవరూ ఉండరు. అలా వాళ్లు కోరుకుంటే నాకేమీ అభ్యంతరం లేదు. మీరు తారీఖు చెప్పండి. పడగొట్టేది ఏంటో చెప్పండి. దాని పరిణామాలేంటో నేను చెప్తా..' అని శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆన్‌రికార్డ్ మాట్లాడిన మాటలు ఇవి. ఇప్పుడు ఈ వ్యాఖ్యలే రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమవుతున్నాయి. రేవంత్ భరోసా వెనుక ఉన్న




ఆంతర్యమేంటన్న దానిపై పలు రకాల ఊహాగానాలు మొదలయ్యాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రస్తుతం బీఆర్ఎస్ పక్షాన ఉన్న 38 మంది ఎమ్మెల్యేల్లో 26 మంది కాంగ్రెస్‌తో టచ్‌లోకి వచ్చారని తెలుస్తోంది. ఏ క్షణమైనా, పరిస్థితి ఎలా ఉన్నా ఎదుర్కొనే ప్రణాళికలో భాగంగానే అన్ని రకాల మంతనాలు పూర్తయ్యాయని, భవిష్యత్తులో ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసుకున్నామని రేవంత్ సన్నిహితులు బహిరంగంగానే చెబుతుండటం గమనార్హం. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబ సభ్యులతోపాటు కొత్తగా ఎన్నికైన ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లాకు ఒకరు చొప్పున బీఆర్ఎస్‌తో బంధం తెంచుకోలేని పరిస్థితుల్లో ఉన్న ఎమ్మెల్యేలు మినహా అందరూ టచ్‌లోకి వచ్చినట్లు వారు చెబుతుండటం చర్చనీయాంశమవుతోంది.

### కర్ణాటక తర్వాత ఇక్కడేనా


పార్లమెంటు ఎన్నికల తర్వాత వచ్చే ఫలితాల ఆధారంగా, కర్ణాటక రాజకీయాల్లో మార్పులను బట్టి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందా లేదా అన్నది తేలుతుందని ఇప్పటికే బీజేపీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. కేంద్రంలో మంచి మెజార్టీతో మోదీ మళ్లీ అధికారంలోకి వచ్చి, కర్ణాటకలో సిద్ధరామయ్య సర్కారును పడగొట్టగలిగితే తెలంగాణలోనూ కచ్చితంగా ఆపరేషన్ ఉంటుందని కమలనాథులు కూడా బహిరంగంగానే చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక టీమ్ ముందు జాగ్రత్త ఏర్పాట్లు చేసుకుంటోందని తెలుస్తోంది. అనివార్య పరిస్థితులు వస్తే ఏకంగా బీఆర్ఎస్ శాసనసభాపక్షాన్ని (బీఆర్ఎస్ఎల్పీ) కాంగ్రెస్‌లో విలీనం చేసే లక్ష్యంగానే ఇది సాగుతోందని సమాచారం. ఈ భరోసాతోనే మీడియా సమావేశంలో రేవంత్ భరోసాతో కూడిన వ్యాఖ్యలు చేశారనే చర్చ జరుగుతోంది. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో రేవంత్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల నిమిత్తం తనను కలిసిన ఎమ్మెల్యేలు కూడా అండగా నిలుస్తామని, నిజంగా అలాంటి పరిస్థితులు వస్తే తాము నిలబడతామని చెబుతున్నారని రేవంత్ వెల్లడించడం గమనార్హం.

## పాలస్తీనాకు కొత్త ప్రధాని.. అమెరికా ఒత్తిళ్లతోనే



ఇజ్రాయెల్‌తో యుద్ధం వేళ.. పాలస్తీనాకు కొత్త ప్రధాని నియమితులయ్యారు. మొహమ్మద్ ముస్తఫాను కొత్త ప్రధానిగా నియమిస్తూ తాజాగా ఆ దేశ అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ నిర్ణయం తీసుకున్నారు. ముస్తఫా చాలాకాలంగా అధ్యక్షుడు అబ్బాస్ వద్ద సలహాదారునిగా పని చేస్తుండడం గమనార్హం. అయితే.. ఈ ఎంపికపై పాలస్తీనాలో మిశ్రమ స్పందన వినిపిస్తోంది. ఇజ్రాయెల్‌పై దాడి అనంతరం.. ప్రధానిగా ఉన్న మొహమ్మద్ శతాయే ఫిబ్రవరిలో రాజీనామా చేశారు. అప్పటి నుంచి అధ్యక్షుడు అబ్బాసే ప్రధాని పేషీకి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇప్పుడు నమ్మకస్తుడు ముస్తఫాకు ప్రధాని బాధ్యతలు అప్పగించారు. పాలస్తీనా అథారిటీలో సంస్కరణలు చేపట్టాలని ఒత్తిడి నెలకొన్న నేపథ్యంలోనే ఈ నియామకం చేపట్టినట్లు అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్ ప్రకటించారు. అయితే.. అమెరికా ఒత్తిళ్లతోనే అధ్యక్షుడు ఈ నియామకం చేపట్టినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ముస్తఫా నేపథ్యానికి వస్తే.. అమెరికాలోని వాషింగ్టన్ యూనివర్సిటీలో చదువుకున్నారు. పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్‌లో సభ్యుడిగా ఉన్నారు. ఆర్థికవేత్తగా.. ప్రపంచ బ్యాంకులో పలు హోదాల్లో పనిచేశారు. 2014లో గాజాపై ఇజ్రాయెల్ దాడి తర్వాత పునర్నిర్మాణ పనుల్లో ముస్తఫా భాగం కావడం గమనార్హం. అయితే.. కొత్త ప్రధాని అధికారాలు ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో చాలా పరిమితంగానే ఉండనున్నాయి. ధ్వంసమైన గాజా స్ట్రిప్ పునర్నిర్మాణం, పలు వ్యవస్థల సంస్కరణల బాధ్యతలను ప్రధానికి అప్పగించనున్నట్లు తెలుస్తోంది. 2007 నుంచి గాజా స్ట్రిప్ హమాస్ నియంత్రణలోకి వెళ్లగా, వెస్ట్‌బ్యాంక్‌లో పాలస్తీనా అథారిటీ అధికారంలో ఉంది. గాజాలోని పరిస్థితుల్ని అమెరికా ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నది తెలిసిందే. ఇక గత అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన మారణకాండలో 1,200 మంది చనిపోయిన విషయం తెలిసిందే. సుమారు 250 మందిని మిలిటెంట్లు బందీలుగా చేసుకున్నారు. మరోవైపు ఇజ్రాయెల్ భీకర దాడుల్లో పాలస్తీనా భూభాగంలో 31,000పైగా ప్రజలు మృతి చెందారు.

## 'సీఏఏ' అమలుపై అమెరికా కీలక ప్రకటన



వాషింగ్టన్: భారత్ తాజాగా అమలులోకి తీసుకువచ్చిన సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్(సీఏఏ)పై అగ్రరాజ్యం అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. సీఏఏ అమలు తీరును తాము నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఈ విషయమై గురువారం అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ మీడియాతో మాట్లాడారు. 'మార్చి 11 సీఏఏ నోటిఫికేషన్‌పై మేం ఆందోళనతో ఉన్నాం. ఈ చట్టం అమలు తీరును గమనిస్తున్నాం. మత పరమైన స్వేచ్ఛను గౌరవించడం, అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించడం అనేవి ప్రజాస్వామ్య మూల సూత్రాలు' అని మిల్లర్ పేర్కొన్నారు. అయితే హిందూ అమెరికన్లు మాత్రం సీఏఏను స్వాగతిస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించడం గమనార్హం. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల నుంచి డిసెంబర్ 31, 2014కు ముందు వలస వచ్చిన నాన్ ముస్లింలకు సీఏఏ ప్రకారం భారత పౌరసత్వం ఇస్తున్నారు. కేవలం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే చాలు వలసవచ్చిన వారికి పౌరసత్వం జారీ చేస్తున్నారు. ఈ చట్టం కింద దేశంలోని ఒక్క ముస్లిం కూడా తమ పౌరసత్వాన్ని కోల్పోడని భారత ప్రభుత్వం ఇప్పటికే క్లారిటీ ఇచ్చింది. దేశంలో అన్ని మతాలు సమానమేనని స్పష్టం చేసింది.

## కేరళలో రష్యా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ కేంద్రం

తిరువనంతపురం: రష్యా ఎన్నికలు శుక్రవారం(మార్చ్ 15) ఉదయం ప్రారంభమయ్యాయి. అయితే ఈ ఎన్నికల పోలింగ్ భారత్‌లోని కేరళ రాజధాని తిరువనంతపురంలో కూడా జరుగుతుండడం విశేషం. కేరళలో నివసిస్తున్న రష్యా పౌరులు తిరువనంతపురంలోని రష్యా కాన్సులేట్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఈ తరహాలో ఇక్కడ నివసిస్తున్న రష్యన్ల కోసం పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం ఇది మూడోసారని రష్యా కాన్సులేట్ డైరెక్టర్ రతీష్ నాయర్ తెలిపారు. పోలింగ్ విషయంలో తమకు సహకరిస్తున్న రష్యన్లకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. టూరిస్టులుగా లేదా నివాసం ఉండేందుకు భారత్ వచ్చిన రష్యన్లకు దేశ అధ్యక్ష ఎన్నికల్లో ఓటు వేసేందుకు అవకాశం కల్పించడం సంతోషంగా ఉందని రష్యా పౌరురాలు ఉలియా తెలిపారు. రష్యా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ మార్చ్ 17వరకు మూడు రోజుల పాటు జరగనుంది. ప్రస్తుత అధ్యక్షుడు పుతిన్‌తో పోటీపడేందుకు ముగ్గురు అభ్యర్థులకు రష్యా సెంట్రల్ ఎలక్షన్ కమిషన్(సీఈసీ)అనుమతిచ్చింది. ఈ ముగ్గురు ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధాన్ని సమర్థించిన వారే కావడం గమనార్హం. ఈ ఎన్నికల్లో పుతిన్ గెలుపు దాదాపు ఖాయమేనన్న అంచనాలున్నాయి.





## డీఎంకే, కాంగ్రెస్ వైఖరి ఇప్పటికీ అలాగే.. మండిపడ్డ మోదీ





తమిళనాడు: తమిళనాడును డీఎంకే - కాంగ్రెస్ ఇండియా కూటమి ఎప్పటికీ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మార్చలేవని కన్యాకుమారిలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మహిళలతో ఎలా అనుచితంగా ప్రవర్తించాలో కాంగ్రెస్, డీఎంకేలకు మాత్రమే తెలుసు. డీఎంకే మహిళల పేరుతో రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. జయలలితకు డీఎంకే నేతలు ఏం చేశారో అందరికీ గుర్తుంది. మహిళల పట్ల వారి వైఖరి ఇప్పటికీ అలాగే ఉంది. తమిళనాడులో మహిళలపై నేరాలు పెరిగాయి. మేము పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చినప్పుడు కాంగ్రెస్ - డీఎంకే మద్దతు ఇవ్వలేదు. తమిళనాడు ఓడరేవు మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధాని తెలిపారు. నేను ఇటీవల తూత్తుకుడిలో చిదంబరనార్ పోర్టును ప్రారంభించాను. మా ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం కూడా కృషి చేస్తోంది. ఆధునిక ఫిషింగ్ బోట్‌లకు ఆర్థిక సహాయం అందించడం నుంచి వాటిని కిసాన్ క్రెడిట్ కార్డ్ పథకం పరిధిలోకి తీసుకురావడం వరకు మేము వారి సంరక్షణను తీసుకున్నామని మోదీ వెల్లడించారు. ప్రధాని మోదీ తన ప్రభుత్వ సంక్షేమ పథకాలను, డీఎంకే నేతృత్వంలోని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎత్తిచూపుతూ 2జీ కుంభకోణంతో ప్రజల సొమ్మును దోచుకున్నారని అన్నారు. ఒకవైపు బీజేపీ సంక్షేమ పథకాలు.. మరోవైపు మీ వద్ద INDI అలయన్స్ స్కామ్ జాబితా ఉంది. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ.. తమిళనాడులోని డీఎంకే - కాంగ్రెస్ కూటమి దురహంకారాన్ని బద్దలు కొట్టనుందని మోదీ అన్నారు.

## కంపెనీలపై దాడులు.. 'అన్నీ ఊహలు..అవాస్తవాలే'



ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసిన వారి పేర్లను బయటపెట్టాలనే సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఆయా వివరాలను వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం బహిర్గతం చేసింది. దాంతో భారతీయ స్టేట్ బ్యాంక్ సమర్పించిన డేటాను ప్రజలకు అందుబాటులో ఉంచింది. మొత్తం 763 పేజీలతో ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌లో వివరాలను అప్‌లోడ్ చేసింది. అయితే ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసిన కొన్ని సంస్థలపై గతంలో సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు చేశాయని పలువురు గుర్తు చేస్తున్నారు. రాజకీయ పార్టీలకు అత్యధిక విరాళాలిచ్చిన టాప్ 30 కంపెనీల్లో 15 కంపెనీలకుపైగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), సీబీఐ, ఇన్‌కమ్ ట్యాక్స్ (ఐటీ)వంటి సంస్థల దర్యాప్తు ఎదుర్కొన్నవే కావడం గమనార్హం. ఈ వ్యవహారంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ప్రముఖ మీడియా స?ంస్థతో జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. విరాళాలకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల దాడులకు సంబంధం ఉందంటూ జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదన్నారు. ఈడీ కంపెనీలపై రైడ్ చేస్తేనే ఆత్మరక్షణ కోసం ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశారనుకోవడం ఊహాగానమే అవుతుందన్నారు. బాండ్లు కొనుగోలు చేసిన తర్వాత కూడా ఆయా సంస్థలపై దాడులు జరిగిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఆ విరాళాలు మొత్తం భాజపాకే వెళ్లాయని చాలా మంది భావిస్తున్నారని, కొన్ని ప్రాంతీయ పార్టీలకు కూడా జమైనట్లు తెలిపారు. ఎన్నికల బాండ్లకు సంబంధించి సమగ్ర సమాచారంతో పూర్తి వివరాలు ఇవ్వాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించించింది కదా అని ప్రస్తావించగా ప్రస్తుతం ఆ అంశం కోర్టు పరిధిలో ఉందన్నారు. తనకంటే ముందు ఆర్థిక మంత్రిగా పనిచేసిన అరుణ్‌జైట్లీ మునుపటి కంటే మెరుగైనదిగా భావించి ఈ ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌ను తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు కొనుగోలు చేసిన బాండ్లు నేరుగా రాజకీయ పార్టీల ఖాతాల్లోనే పడుతున్నాయన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి ముందుకెళ్లాలన్నారు. ఎలక్షన్ కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎన్నికల బాండ్ల విరాళాల్లో ఎక్కువ మొత్తం బీజేపీకి వెళ్లగా ఆ తర్వాతి స్థానాల్లో తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ తదితర పార్టీలున్నాయి.

# ఈ నియోజకవర్గంలో ఉద్దండుల మధ్య హోరాహోరీ పోటీ.. గెలుపెవరిదో...



తెలంగాణా: పార్లమెంట్ ఎన్నికల వేళ మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గం ఆసక్తికర చర్చ మొదలైంది. అక్కడి నుండి బరిలోకి దిగుతున్న ఆ ముగ్గురు అభ్యర్థులు ఉద్దండులే. ఇద్దరు మాజీ ఎంపీలు కాగా ఒకరు సిట్టింగ్ ఎంపీ. పైగా ఓకే సామాజిక వర్గానికి చెందిన వారు. ఇంతకీ ఎవరా నేతలు.? ఎవరి బలమెంతా.. బలగమెంతా.. వాచ్ దిస్ స్టోరీ. దేశవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల సందడి షురూ అయింది. కొత్త పాత నేతలు కథనరంగలోకి కాలు దువ్వుతున్నారు. ఇక ప్రధాన రాజకీయ పార్టీలు గెలుపు ఓటమిపై ఎవరి ధీమా వారిదే.. అయితే ఎన్నికల్లో కొన్ని పార్లమెంట్ స్థానాలు జనంలో ఆసక్తికర చర్చగా మారుతున్నాయి. నేతల మధ్య పోటీ రక్తి కట్టిస్తుంది. ప్రధానంగా మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలోనే ప్రత్యేక చర్చగా మారింది. ఈ స్థానం నుండి పోటీ చేస్తున్న మూడు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు మాజీలే. కాంగ్రెస్, బిజెపి నుండి పోటీచేస్తున్న ఇద్దరు అభ్యర్థులు మాజీ ఎంపీలు కాగా, బీఆర్ఎస్ నుండి సిట్టింగ్ ఎంపీ మరోసారి బరిలోకి దిగారు. మహబూబాబాద్ లోక్ సభ ఎన్నికల్లో పోటీపడుతున్న ముగ్గురు ముఖ్యనేతల్లో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ 2009లో మహబూబాబాద్ పార్లమెంటు స్థానం నుండి గెలిచి లోక్ సభ?లో అడుగు పెట్టారు. బీజేపీ నుండి బరిలోకి దిగుతున్న ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ 2014లో ఇదే పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ ఎంపీగా ఎన్నికయ్యారు. 2019లో మాలోత్ కవిత మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ ఎంపీగా ఎన్నికయ్యారు. ఈ నియోజక వర్గం నుండి పార్లమెంట్?లో అడుగుపెట్టిన ఏకైన గిరిజన మహిళగా చరిత్ర సృష్టించారు. ప్రస్తుతం ఈ ముగ్గురు మహబూబాబాద్ పార్లమెంటు స్థానం నుండి మరోసారి ఎంపీగా ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. బలరాం నాయక్ కాంగ్రెస్ పార్టీ నుంచి నాలుగోసారి ఎన్నికల బరిలో నిలుస్తుండగా, అజ్మీరా సీతారాం నాయక్ బీఆర్ఎస్?ను వీడి బీజేపీలో చేరి టికెట్ దక్కించుకొని రెండోసారి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవిత రెండోసారి ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ముగ్గురు ఉద్దండుల మధ్య పోటీ నేపథ్యంలో మానుకోట పార్లమెంటు స్థానంలో ఈసారి పోరు ఉత్కంఠభరితంగా సాగనుంది. బలరాం నాయక్ పార్లమెంటు సభ్యుడిగా ఉన్న సమయంలో కేంద్ర మంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధికి చేసిన కృషి కలిసి వస్తుందని ఆశాభావంతో ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం, పలుమార్లు ఓటమిపాలైన సానుభూతి కలిసి వస్తుందని భావిస్తున్నారు. ఇక వివాదరహితుడిగా పేరున్న అజ్మీర సీతారాం నాయక్ పాత పరిచయాలు, గతంలో ఎంపీగా ఉన్నసమయంలో చేసిన అభివృద్ధి, బీఆర్ఎస్?తో ఉన్న అనుబంధం, ప్రధాని నరేంద్ర మోడీ చరిష్మా తన గెలుపుకు బాటలు వేస్తాయని ధీమాతో ఉన్నారు. సిట్టింగ్ ఎంపీ మాలోత్ కవిత ఎంపీగా కాకుండా ఎమ్మెల్యే తరహాలో ప్రతి నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేయడం, అధికార కాంగ్రెస్?పై ప్రజల్లో భ్రమలు తొలగి తన గెలుపునకు అనుకూల అంశాలుగా మారుతాయనే ఆశా భావంతో ఉన్నారు. రాష్ట్రంలో ముగ్గురు దిగ్గజాలు పోటీ పడుతున్న మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం ప్రతిష్టాత్మకంగా మారింది. జనంలో చర్చగా నిలిచింది. మరి మానుకోట ప్రజలు ఎవరిని రెండోసారి పార్లమెంట్?కు పంపుతారో చూడాలి.

## ఎన్నికల షెడ్యూల్ ఖరారు - ఇక హోరా హోరీ..!!

ఢిల్లీ: దేశ వ్యాప్తంగా పార్లమెంట్..ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు కౌంట్ డౌన్ మొదలైంది. ఎన్నికల సంఘంలో కొత్తగా నియమితులైన ఇద్దరు కమిషనర్లు బాధ్యతలు స్వీకరించారు. దేశ వ్యాప్తంగా ఎన్నికల సంసిద్ధత పైన కీలక సమీక్ష చేస్తున్నారు. రేపు (శనివారం) మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముహూర్తంగా ఖరారైంది. ఏపీలో తొలి విడతలోనే పోలింగ్ ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో, ఏపీలో రాజకీయం మరింత వేడెక్కనుంది.

### నేడే షెడ్యూల్

నేడు(శనివారం) మధ్యాహ్నం 3 గంటలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించనుంది. లోక్‌సభతో పాటు ఏపీ, ఒడిషా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాలకు ఎన్నికల షెడ్యూల్ ఖరారు కానుంది. ఇదే సమయంలో జమ్ము కాశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఇప్పటికే ఎన్నికల నిర్వహణ కసరత్తు ప్రారంభించారు. గత కొన్ని నెలలుగా రాష్ట్రాల్లో ఉన్న చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్లతో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంల తరలింపు, భద్రతా దళాల మొహరింపు, సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేయాలని కేంద్ర అధికారులు స్పష్టం చేశారు.

### హోరా హోరీ పోరు

ఈ సారి ఎన్నికలు మొత్తం ఏడు విడతల్లో జరిగే అవకాశం ఉంది.




ఏపీలో తొలి విడతలో జరిగే ఛాన్స్ ఉందని అంచనా వేస్తున్నారు. 2019 లో మార్చి 10న షెడ్యూల్ ప్రకటించింది. మార్చి 18న నోటిఫికేషన్ జారీ అయింది. ఏప్రిల్ 11న పోలింగ్ జరగ్గా, మే 23న ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ సారి మార్చి 16న షెడ్యూల్ వస్తుండటంతో ఏపీలో ఏప్రిల్ 20-25 మధ్య పోలింగ్ ఉంటుందని ఢిల్లీ వర్గాల సమాచారం. ఏపీలో తొలి విడతలోనే 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలకు పోలింగ్ జరుగుతుందని భావిస్తున్నారు. గతంలోనూ తొలి విడతలోనే ఏపీలో ఎన్నికలు నిర్వహించటం ద్వారా..ఇతర రాష్ట్రాలకు అధికారులు, భద్రతా సిబ్బందిని వినియోగించుకోవటానికి ఎన్నికల సంఘానికి వెసులుబాటు ఉంటుంది.

### ప్రతిష్ఠాత్మక ఎన్నికలు

తొలి విడతలో ఏపీతో పాటుగా తెలంగాణలోనూ ఎన్నికలు జరగటం ఖాయంగా కనిపిస్తోంది. ఇక, ఏపీలో ఇప్పటికే ఎన్నికల సమరం హీటెక్కింది. వైసీపీని ఓడించే లక్ష్యంతో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పాటయ్యాయి. జగన్ ఒంటరిగా ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. కాంగ్రెస్ - వామపక్షాలు కూటమిగా జత కట్టాయి. రేపు (శనివారం) సీఎం జగన్ తమ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల తుది జాబితా ఇడుపుల పాయ వేదికగా వైఎస్సార్ ఘాట్ వద్ద ప్రకటించనున్నారు. ఇటు టీడీపీ కూటమి సైతం అభ్యర్థుల పైన దాదాపు స్పష్టత ఇచ్చింది. షెడ్యూల్ వచ్చిన సమయం నుంచి ప్రచారం హీటెక్కనుంది. రెండు వైపులా మేనిఫెస్టోలు కీలకం కానున్నాయి. దీంతో..ఏపీలో ఈ షెడ్యూల్ ప్రకటన ద్వారా రాజకీయ పోరు మరింత ఉత్కంఠగా మారటం ఖాయంగా కనిపిస్తోంది.

## మొదలైన రష్యా అధ్యక్ష ఎన్నికల పోలింగ్.. ఐదోసారి అధ్యక్ష పీఠం దిశగా

**రష్యా అధ్యక్ష ఎన్నికల్లో హాట్‌ఫేవరెట్‌గా వ్లాదిమిర్ పుతిన్**

**నేటి నుంచి మూడ్రోజులపాటు కొనసాగనున్న అధ్యక్ష ఎన్నికల పోలింగ్**

**దాదాపు ఖాయమైన గెలుపు**

**ఈ విజయంతో 2030దాకా పుతిన్ పాలనే!!**




వ్లాదిమిర్ పుతిన్ పేరు చెబితే ఠక్కున గుర్తొచ్చే దేశం రష్యా. చాలా సంవత్సరాలుగా పుతిన్ ఏలుబడిలో ఉన్న రష్యాలో ఇవాళ్టి నుంచి మూడు రోజులు కీలకంగా మారనుంది. అందుకు కారణం.. ఆ దేశానికి అధ్యక్ష ఎన్నికలు జరుగుతుండడం. గతంలో ఒక్కరోజులో పోలింగ్ పూర్తయ్యేది. అయితే.. దేశ చరిత్రలో తొలిసారిగా వరసగా మూడు రోజులపాటు అంటే 15, 16, 17 తేదీల్లో పోలింగ్‌కు రష్యా సిద్ధమైంది. శుక్రవారం పోలింగ్ ప్రారంభమైందక్కడ.. ప్రస్తుత పదవీకాలంతో కలిపి పుతిన్ ఇప్పటికే నాలుగు సార్లు(2000, 2004, 2012, 2018)లో అధ్యక్ష పీఠాన్ని అధిరోహించారు. 2008లో ప్రధానిగానూ సేవలందించారు. మానవహక్కుల గొంతుక, విపక్ష నేత అలెక్సీ నావల్నీ గత నెల మారుమూల కారాగారంలో అనుమానాస్పద స్థితిలో చనిపోవడంతో ఈసారి పుతిన్ వ్యతిరేక ఓటింగ్ పెరుగుతుందా? లేదా అనేది వేచిచూడాలి. ఉక్రెయిన్‌పై దురాక్రమణతో ప్రస్తుతం తన అధీనంలో ఉన్న నాలుగు ఉక్రెయిన్ రీజియన్‌లలోనూ ఈ ఎన్నిక క్రతువు కొనసాగనుంది.

### పుతిన్ హవా..

అధ్యక్ష రేసులో పుతిన్ విజయబావుటా ఎగరేస్తారని ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ మీడియా కోడైకూస్తోంది. అయినా సరే పౌర హక్కులను కాలరాస్తూ, నియంత పోకడలతో దేశాన్ని ఏలుతున్న పుతిన్ పాలనకు అంతం పలుకుతామంటూ విపక్ష పార్టీల నేతలు ప్రతినబూనారు. ఎన్నికల రణరంగంలో పుతిన్‌ను ఓడిస్తామంటూ లిబరల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ రష్యా(ఎల్‌డీపీఆర్) తరపున అభ్యర్థిగా లియోనిడ్ స్లట్‌స్కీ, న్యూ పీపుల్ పార్టీ అభ్యర్థిగా వ్లాదిస్లేవ్ దవాన్‌కోవ్, కమ్యూనిస్ట్ పార్టీ అభ్యర్థిగా నికోలే ఖరిటోనోవ్‌లు ఎన్నికల బరిలో నిలిచారు. దేశ ఓటర్లలో పుతిన్‌కు 75 శాతం మద్దతు ఉందని, ఈ ముగ్గురు తలో 5 శాతం ఓట్లతో సరిపెట్టుకుంటారని ముందస్తు పోలింగ్ అంచనాలు విశ్లేస్తున్నాయి.

### పోలింగ్ ఎక్కడెక్కడ

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ గురువారం కంటే ముందే మొదలుపెట్టారు. శుక్రవారం సాధారణ ఓటింగ్ మొదలైంది. ఆక్రమిత ఉక్రెయిన్ ప్రాంతాలపై పుతిన్ ప్రధానంగా దృష్టిపెట్టారు. రష్యా భూభాగంలో ఎలాగూ మెజారిటీ సాధిస్తానని పుతిన్ బలంగా నమ్ముతున్నారు. ఉక్రెయిన్ ప్రాంతాల్లో గెలిచి తమది అధర్మ యుద్ధం కాదని ప్రపంచానికి చాటి చెప్పాలని పుతిన్ యోచిస్తున్నారు. ఇక్కడ స్థానిక ఎన్నికలు, రెఫరెండమ్‌లు ఇప్పటికే నిర్వహించారు. అంతర్జాతీయ నిబంధనలు ఉల్లంఘనకు గురయ్యాయని ప్రపంచదేశాలు మొత్తుకున్నా పుతిన్ పట్టించుకోవట్లేదు. ఈసారి 11.42 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలుస్తోంది. అర్హులైన ఓటర్లు విదేశాల్లో ఉన్నా సరే ఓటేయొచ్చు. మార్చి 19 కల్లా తొలి దఫా ఫలితాలు వెల్లడి కావచ్చు. తుది ఫలితాలు తెలియాలంటే మార్చి 29వ తేదీకా ఆగాల్సిందే. 2018 గత అధ్యక్ష ఎన్నికల్లో 68 శాతం పోలింగ్ నమోదైంది.



### ఇంకెన్నాళ్లు పుతిన్ పాలిస్తారు

మరో రెండు పర్యాయాలు దేశ అధ్యక్షుడిగా కొనసాగేందుకు అనువుగా చట్టం చేసి 2021లో పుతిన్ దానిపై సంతకం చేశారు. ఈసారి గెలిచి, 2030లోనూ గెలిస్తే 2036దాకా పుతిన్ దేశాధ్యక్షుడిగా కొనసాగుతారు. రష్యా పాలకుడు జోసెఫ్ స్టాలిన్ తర్వాత అత్యంత ఎక్కువకాలం దేశాన్ని పాలించిన నేతగా పుతిన్ పేరు ఇప్పటికే చరిత్రకెక్కింది.

### కుంభస్థలిని కొట్టగలరా

పోటీలో ఏ అభ్యర్థి నిలబడాలి అనేది దాదాపు దేశ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ(సీఈసీ) నిర్ణయిస్తుంది. ఎల్‌డీపీఆర్ నేత లియోనిడ్ స్లట్‌స్కీ, న్యూ పీపుల్ పార్టీ నేత వ్లాదిస్లేవ్ దవాన్‌కోవ్, కమ్యూనిస్ట్ పార్టీ నేత నికోలే ఖరిటోనోవ్‌లు ఈసారి బరిలో దిగారు. పుతిన్‌ను వీరంతా విమర్శిస్తున్నప్పటికీ ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని వీరు వ్యతిరేకించలేదు. యుద్ధాన్ని వ్యతిరేకించిన ఏకైక విపక్ష నేత బోరిస్ నదేహ్‌దిన్‌ను పోటీకి నిలబడకుండా సీఈసీ అడ్డుకుంది. అభ్యర్థిత్వానికి సరిపడా సంతకాలను సేకరించలేకపోయారని ఆయన అభ్యర్థిత్వాన్ని తిరస్కించింది. మరో అభ్యర్థి యెకటేరియా డుంట్‌సోవానూ సీఈసీ ఇలాగే పక్కకునెట్టింది. పుతిన్‌ను ప్రధానంగా విమర్శించే విపక్ష నేత అలెక్సీ నావల్నీ ఇప్పుడు ప్రాణాలతో లేడు. స్లట్‌స్కీ, దవాన్‌కోవ్, ఖరిటోనోవ్‌లు దేశ సమైక్యత విషయానికొచ్చేసరికి పుతిన్‌కు పరోక్షంగా మద్దతు పలుకుతారు. ఈ లెక్కన దేశ సమైక్యత జెండా పట్టిన పుతిన్‌కే ఎక్కువ ఓట్లు పడతాయి. దీంతో వీళ్లు పుతిన్‌ను ఓడించడం అనేది అసంభవం.

### పుతిన్‌కు నిజంగా అంతటి ఫాలోయింగ్ ఉందా

రష్యా పౌరులు ఆంక్షల చట్రం, నిఘా నీడలో జీవిస్తారని పశ్చిమదేశాలు తరచూ ఆరోపిస్తుంటాయి. దీంతో పుతిన్‌ను ఇష్టపడే ఎన్నుకుంటున్నారా లేదంటే మరో ప్రత్యామ్నాయం లేక పుతిన్‌కు జై కొడుతున్నారా అనేది ఇతమిద్ధంగా ఎవరికీ తెలీదు. పుతిన్ పాపులారిటీ 80 శాతాన్ని దాటేసిందని అక్కడి ప్రభుత్వేతర ఎన్నికల మేథో సంస్థ 'ది లెవడా సెంటర్' ఇటీవల ప్రకటించింది. అయితే 2023 చివరి నుంచి దేశవ్యాప్తంగా పెరిగిన ద్రవ్యోల్బణం, నిత్యావసరాల ధరవరలు ఎగిసిన నేపథ్యంలో పుతిన్ పాలనపై ప్రజల్లో ఆగ్రహావేశాలు పెరిగాయని సంస్థ విశ్లేషించడం గమనార్హం. తనను వ్యతిరేకించే వాళ్లను పుతిన్ అస్సలు సహించలేడని పుతిన్‌కు గతంలో ప్రసంగాలు రాసి ఇచ్చిన అబ్బాస్ గలియమోవ్ చెప్పారు.

# వేడి నుంచి కాస్త ఊరట

**ఆకాశం మేఘావృతం కావడంతో తగ్గిన ఉష్ణోగ్రతలు.. కానీ ఉక్కపోత**


**మరత్వాడ నుంచి కర్ణాటక, తమిళనాడు మీదుగా కొనసాగుతున్న ద్రోణి**

**దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు అక్కడక్కడా తేలికపాటి వానలు**



హైదరాబాద్: రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు కాస్త తగ్గాయి. ఆకాశం మేఘావృతం కావడంతో ఉష్ణోగ్రతల్లో తగ్గుదల నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. వాతావరణంలో తేమశాతం ఎక్కువగా ఉండడంతో ఉక్కపోత మాత్రం అధికంగానే ఉంది. శనివారం రాష్ట్రంలో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 38.3 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 20.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ప్రస్తుతం మరత్వాడ నుంచి అంతర్గత కర్ణాటక, తమిళనాడు మీదుగా కోమరిన్ ప్రాంతం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సగటు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రానికి తక్కువ ఎత్తు నుంచి దక్షిణ, ఆగ్నేయ దిశల వైపుగా గాలులు వీస్తున్నాయి. వాతావరణంలో నెలకొన్న మార్పులతో రానున్న మూడు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు నమోదు కావొచ్చని వాతావరణ శాఖ సూచించింది. వానలతో పాటు వడగండ్లు కూడా పడతాయని హెచ్చరించింది.

## సాధారణం కంటే తక్కువగా...




శనివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సగటున 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ మేర గరిష్ట ఉష్ణోగ్రతలు తగ్గినట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. భద్రాచలం, హనుమకొండ, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లో సాధారణ ఉష్ణోగ్రత కంటే 3 డిగ్రీలు తక్కువగా నమోదైంది. ఇక రామగుండంలో 3 డిగ్రీల కంటే తక్కువగా గరిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. కనిష్ట ఉష్ణోగ్రతలు మాత్రం సాధారణ స్థితిలోనే నమోదయ్యాయి.

### ఖర్గే కంచుకోటలో మోదీ సమర శంఖం..

# వికసిత భారత నిర్మాణమే లక్ష్యం..

**ప్రజా విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం: మోదీ**

**రాష్ట్రంలో 28 స్థానాల్లోనూ గెలిపించాలని పిలుపు**



బెంగళూరు: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకంచుకోటగా భావించే కలబురగి నుంచే ప్రధాని నరేంద్రమోదీ తన ఎన్నికల ప్రచార శంఖారావాన్ని పూరించారు. తొలుత ప్రధాని రోడ్‌షోకు పెద్దఎత్తున ప్రజలు హాజరై జేజేలు పలికారు. ఆయనపై పుష్పవృష్టి కురిపించారు. అనంతరం జరిగిన బహిరంగసభలోనూ ప్రధాని మోదీ ఉత్సాహంగా ప్రసంగించారు. కాంగ్రెస్ అవినీతి రాజకీయాలను తూర్పారబట్టారు. గత పదేళ్ల పాలనలో తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాలను ప్రజలముందు ఉంచారు. వీటిలో ఆర్టికల్ 370 రద్దు, జీఎస్టీ అమలు, నారిశక్తి వందనా చట్టాలు, నూతన పార్లమెంటు గురించి వివరించారు. వికసిత భారత నిర్మాణమే తమ తదుపరి లక్ష్యమన్నారు. ఈ సాధనకోసం మొత్తం 28 నియోజకవర్గాల్లోనూ ప్రచండ విజయం అందించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నేతలు ఎన్ని రకాలుగా దుస్తులు మార్చినా వారి మూలస్వభావం మారదన్నారు. అతి తక్కువ సమయంలోనే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిందని, శాంతిభద్రతలు దిగజారాయని ఆరోపించారు. అన్ని చోట్ల ప్రజల ఆగ్రహం వెల్లువెత్తుతోందన్నారు. ప్రజలు నిత్యం భయంతో జీవించే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కుటుంబ రాజకీయాలు చేసేవారికే అవినీతి ఆక్సిజన్‌గా ఉందన్నారు. రెండు రోజులుగా దక్షిణభారత రాష్ట్రాల్లో పర్యటిస్తున్నానని, అన్నిచోట్లా ప్రజాభిమానం వెల్లువెత్తుతోందన్నారు. 1989 తర్వాత శ్రీనగర్‌లో జరిగిన ర్యాలీకి జనం భారీగా హాజరయ్యారని తెలిపారు. దక్షిణభారతదేశంలోని అన్ని వర్గాల ప్రజలు బీజేపీకి మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని సభకు లక్షలాదిమంది కార్యకర్తలు తరలిరావడంతో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేసింది. కాంగ్రెస్, కొన్ని కుటుంబ రాజకీయ పార్టీలకు అవినీతి ఆక్సిజన్‌గా ఉందని ప్రధాని ప్రస్తావించినప్పుడు కార్యకర్తలనుంచి కరతాళ ధ్వనులు మిన్నంటాయి. కేంద్రంలోని తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను ప్రధాని ఏకరువు పెట్టారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర మాట్లాడుతూ మోదీ ప్రజాసంక్షేమానికి ప్రజలు ఫిదా అవుతున్నారని, రాష్ట్రంలోని మొత్తం 28 లోక్‌సభ నియోజకవర్గాలను క్లీన్‌స్వీప చేస్తామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రపంచం మొత్తం మోదీవైపే చూస్తోందన్నారు. ప్రధాని తన ప్రసంగంలో ఎలక్టోరల్ బాండ్ల అంశంగానీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలపైగానీ ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోవడం గమనార్హం. మాజీ ముఖ్యమంత్రులు బీఎస్ యడియూరప్ప, బసవరాజ్ బొమ్మైతోపాటు కేంద్రమంత్రులు ప్రహ్లాద్‌జోషి, భగవంత్ ఖూబా, బీజేపీ నేతలంతా పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కు షాక్.. మరో ఎంపీ రాజీనామా..




హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ షాకుల మీద షాకులు ఇస్తున్నారు నేతలు. ఒక్కొక్కరుగా నేతలు పార్టీని వీడుతున్నారు. కేసీఆర్ వెళ్లే వారు వెళ్లొచ్చు.. ఒక్కరిద్దరు పోతే పోయేది ఏం లేదన్నారు. అయినప్పటికీ నేతలు పార్టీని వీడుతున్నారు. తాజాగా బీఆర్ఎస్ కు చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో తాను బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నానని రంజిత్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు. ఇంతకాలం తనకు పార్టీలో సహకరించిన అందరికీ రంజిత్ రెడ్డి ధన్యవాదాలు చెప్పారు. ఇన్ని రోజులు చెవేళ్ల ప్రజలను సేవ చేసే అవకాశం కల్పించిన కేసీఆర్, కేటీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తన రాజీనామాను ఆమోదించాలని కేసీఆర్ ను రంజిత్ రెడ్డి కోరారు. రంజిత్ రెడ్డి కాంగ్రెస్ లో చేరుతారని ప్రచారం జరుగుతోంది. ఆయనకు కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ టికెట్ ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. రంజిత్ రెడ్డి ఈటలకు దగ్గర అయినప్పటికీ కాంగ్రెస్ నుంచి టికెట్ హామీ రావడంతో హస్తం పార్టీలో చేరుతారని తెలుస్తోంది. చెవెళ్ల నుంచి సునీత రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇస్తుందని ప్రచారం జరిగింది. కానీ రంజిత్ రెడ్డికి టికెట్ హామీ వచ్చినట్లు సమాచారం. రంజిత్ రెడ్డి 2004లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రంజిత్ రెడ్డి 2019లో పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డి పై 14 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో రజింత్ రెడ్డి విజయం సాధించారు. రంజిత్ రెడ్డి పార్లమెంట్ లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కమిటీ సభ్యుడిగా కొనసాగుతోన్నారు. కాగా బీఆర్ఎస్ ఎంపీలు వరుసగా రాజీనామాలు చేస్తున్నారు. పెద్దపల్లి ఎంపీ వెంకటేష్, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, నాగర్ కర్నూలు ఎంపీ రాములు రాజీనామా చేశారు. తాజాగా రంజిత్ రెడ్డి బీఆర్ఎస్ కు రాజీనామా చేశారు. రెండు రోజుల క్రితం వరంగల్ ఎంపీ పసనూరి దయాకర్ కూడా బీఆర్ఎస్ కు రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరారు. కొంత ఎమ్మెల్యేలు కూడా బీఆర్ఎస్ కు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# సార్వత్రిక ఎన్నికలు 2024 ఈవీఎంల పనితీరుపై చీఫ్ ఎన్నికల కమిషనర్ ఏమన్నారు

**18వ లోక్‌సభ ఎన్నికల తేదీలను విడుదల చేసింది భారత ఎన్నికల కమిషన్.**

**ఏడు దశల్లో ఓటింగ్ నిర్వహించి, జూన్ 4న ఓట్ల లెక్కింపు, ఫలితాలను వెల్లడిస్తామని తెలిపింది.**




ఢిల్లీ: ఎన్నికలు జరిగే రాష్ట్రాల షెడ్యూల్‌ను విడుదల చేయడానికి ముందు ఎన్నికల నిర్వహణకు తాము ఎలా సన్నద్ధం అవుతున్నారో తెలిపారు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్. ఎందుకని ఏడు దశల్లో పోలింగ్ నిర్వహించాల్సి వస్తుందో కూడా ఆయన మీడియాకు వివరించారు. ఈవీఎంలపై ఉన్న అనుమానాల గురించి సమాధానాలు ఇచ్చారు.

### ఇంకా ఆయన ఏమన్నారు

### 1. ఏడు దశల్లోనే ఎందుకు

ఏడు దశల్లో ఎన్నికల నిర్వహణ అనేది అనవసరమని, అది అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేలా ఉందని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయనే ప్రశ్నకు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ బదులిస్తూ, "దేశంలోని భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా అన్ని ప్రాంతాలకు ఏకకాలంలో చేరుకోవడం సాధ్యం కాదు. భద్రతా దళాలపై ఉండే ఒత్తిడిని కూడా ఆలోచించాలి" అన్నారు "అంతేకాక, పండుగల సమయం. హెూలీ, రంజాన్, రామనవమి పండుగలు ఉన్నాయి. అందుకోసమే తేదీల్లో మార్పులు, అంతేకానీ ఎవరికో లబ్ధి లేదా నష్టం కలిగించడానికి కాదు. ఆ ఆరోపణలు నిజం కాదు. వాస్తవాల గురించే మనం మాట్లాడాలి" అన్నారు. ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఏడు దశల్లో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.



### 2. ఈవీఎంలపై అనుమానాలేంటి

ఈవీఎంల పనితీరుపై ప్రతిపక్షాల ఆరోపణలపై జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు రాజీవ్ కుమార్ బదులిస్తూ, "ఈ ప్రశ్నలు చాలాసార్లు వచ్చాయి. ట్యాంపరింగ్, కంప్యూటర్‌తో హ్యాకింగ్, ఫలితాల మార్పు వంటి పిటీషన్లను పలు రాష్ట్రాల్లోని హైకోర్టులు, సుప్రీం కోర్టులు పలు పిటీషన్లను విచారించి, అన్నింటినీ తిరస్కరించాయి" అన్నారు. "అంతేకాదు, ఈవీఎంల ద్వారా నిర్వహించిన పోలింగ్‌లో అధికార పార్టీలు ఓటమిపాలైన సందర్భాలూ ఉన్నాయి" అంటూ ఈవీఎంలపై ప్రచురించిన పుస్తకాన్ని మీడియాకు చూపి, "ఇందులో ఈవీఎంలకు సంబంధించి 40కు పైగా కేసులను విచారించిన రాజ్యాంగ ధర్మాసనాల తీర్పులు సవివరంగా ఉన్నాయి. నిపుణులు కూడా చదవాలి" అన్నారు.

### 3. టోటలైజర్ ఎందుకు ఉపయోగించరు

బూత్‌కు కేటాయించిన ఈవీఎం మిషన్ నెంబర్‌ల ఆధారంగా ఏ అభ్యర్థికి ఏ బూత్‌లో ఎక్కువ లేదా తక్కువ ఓట్లు వచ్చాయో తెలుసుకునే అవకాశం ఉందని ఓ జర్నలిస్ట్ అన్నారు. అందుకు ఆస్కారం ఇవ్వకుండా ఉండేందుకు టోటలైజర్ పరికరంతో అన్ని మిషన్ల నుంచి ఫలితాలు ఒకేసారి తెలుసుకోవచ్చని, ఎందుకని టోటలైజర్‌ను వినియోగించట్లేదని ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ప్రశ్నించారు. అందుకు, "బూత్‌ల వారీగా ఫలితాలు తెలుసుకోవడం మంచిది కాదని నేనూ అంగీకరిస్తున్నాను. కానీ, చాలా మిషన్లను టోటలైజర్ పరికరంతో అనుసంధానం చేసి ఫలితాలు వెల్లడించడం క్లిష్టతతో కూడుకున్నది. ఎందుకంటే, ఒక్క మిషన్ పనితీరుపైనే చాలామంది ప్రశ్నిస్తున్నారు. టోటలైజర్ పరికరంతో లెక్కిస్తే వారు ఇంకేమంటారో తెలీదు" అన్నారు. రాజకీయ వ్యవస్థ కొత్త సాంకేతికతను స్వాగతించాలని అన్నారు. ఆ సమయం వస్తుందని తాను ఆశిస్తున్నానని చెప్పారు.

### 4. అరుణ్ గోయల్ రాజీనామాపై ఏమన్నారు


గతవారం ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ రాజీనామాపై జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నలకు ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ బదులిస్తూ, "ఆయన మా బృందంలో ప్రత్యేకమైన వ్యక్తి. ఆయనతో పనిచేయడం సంతోషంగా ఉంది. కానీ, ప్రతి సంస్థలో వారికంటూ సొంత నిర్ణయాలు ఉంటాయి. వాటిని మనం గౌరవించాలి" అన్నారు. "ఎన్నికల సంఘంలో అసమ్మతి ఉంటూనే



ఉంటుంది. అందరి అభిప్రాయాలను గౌరవిస్తాం" అన్నారు.

### 5. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై..

ఎన్నికల కోడ్ అమలు తమ ప్రధాన నాలుగు సవాళ్లలో ఒకటని అన్నారు రాజీవ్ కుమార్. పీఎం నరేంద్ర మోదీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షాలపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయని, అయితే, ప్రతిపక్ష నేతలపై చర్యలు తీసుకున్నట్లు వారిపై ఎందుకు తీసుకోవడంలేదని ఓ జర్నలిస్ట్ ఆయన్ను ప్రశ్నించారు. దానిపై రాజీవ్ కుమార్ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. "ఇలా మీరు మమ్మల్ని ప్రశ్నించొచ్చు. గత 11 ఎన్నికల సమయంలో మాకు అందిన ఫిర్యాదులపై మా స్పందనలు కూడా చూడండి" అన్నారు. "ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు వచ్చిన వెంటనే మేం స్పందిస్తాం. క్యాంపెయినర్ ఎవరైనా సరే, ఉపేక్షించం. తగిన చర్యలు తీసుకుంటాం" అన్నారు. పుల్వామా దాడి: కశ్మీర్ ఎలా విడిపోయింది, వారికి ఏం కావాలి జమ్ము, కశ్మీర్‌లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి మీడియా ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు ప్రధాన ఎన్నికల కమిషనర్



### 6. జమ్ము, కశ్మీర్‌లో ఎన్నికలు ఎందుకు లేవు

జమ్ము, కశ్మీర్‌లో ఎన్నికలు జరపకపోవడానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ రెండు కారణాలు చెప్పారు. ఒకటి: జమ్ము-కశ్మీర్ రీఆర్గనైజేషన్ చట్టం 2019లో అమల్లోకి వచ్చింది. అప్పటికి రాష్ట్రంలో 107 అసెంబ్లీ స్థానాలున్నాయి. వాటిలో 47 స్థానాలు పీఓకేలో ఉన్నాయి. తరువాత 2022లో మళ్ళీ డీలిమిటేషన్ చేసి సీట్ల సంఖ్యను 107 నుంచి 114కు పెంచారు. వాటిలో రిజర్వేషన్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఈమేరకు డిసెంబర్‌లో రీఆర్గనైజేషన్ చట్టానికి సవరణ చేశారు. కానీ, అప్పటికే ఎన్నికల కమిషన్ లోక్‌సభ ఎన్నికలకు ఏర్పాట్లు చేయడంలో పూర్తిగా నిమగ్నమైందని సీఈసీ చెప్పారు. రెండు: "మేం కశ్మీర్ ప్రజలను కలుసుకోవడానికి వెళ్ళాం. అక్కడి రాజకీయ పార్టీలు లోక్‌సభ ఎన్నికలతో పాటే తమ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కోరాయి. కానీ, ప్రభుత్వ యంత్రాంగం మాత్రం అది సాధ్యం కాదని చెప్పింది. ఎందుకంటే, అక్కడ కనీసం 1,000 మంది అభ్యర్థులు బరిలోకి దిగే అవకాశం ఉంది. వారి రక్షణ కోసం భద్రతా బలగాలను అధిక సంఖ్యలో మోహరించాల్సి వస్తుంది.

### 7. నగదు పట్టుబడినప్పుడు తీసుకునే చర్యలేంటి

ఇటీవల 11 రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినప్పుడు దాదాపు రూ. 3,500 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎన్నికల కమిషన్ తెలిపింది. దీనిపై ఒక జర్నలిస్ట్, మరి అంత డబ్బు పట్టుబడినప్పుడు ఎవరెవరిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. అయితే, ఆ సమాచారాన్ని సీఈసీ వెల్లడి చేయలేదు. దీనికి సూటిగా బదులివ్వకుండా 2019 ఎన్నికల సందర్భంగా తమిళనాడులోని వెల్లూరులో పట్టుబడిన నగదు గురించి చెబుతూ రాజీవ్ కుమార్, "చాలా రాష్ట్రాల్లో డబ్బు చాలా శక్తిమంతంగా మారింది. ఈ విషయంలో మేం సీరియస్‌గా ఉన్నాం. ఇటీవలి దక్షిణాది రాష్ట్రాల ఎన్నికల్లో మేం ఈ సమస్యను చాలా వరకు కట్టడి చేశాం. ఈ విషయంలో ఆందోళన అవసరం లేదు" అని బదులిచ్చారు.

# సగర్వంగా ఎగిరిన సామాజిక జెండా

**అజెండాను అమలు చేసి చూపించిన సీఎం జగన్**

**ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సరిగ్గా సగం సీట్లు**

**ఒకేసారి 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన వైఎస్సార్‌సీపీ**

**దేశ చరిత్రలోనే సీఎం జగన్ సరికొత్త రికార్డు.. అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ అభ్యర్థుల ఎంపిక**

**టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి 135 స్థానాల్లో బీసీలకు కేవలం 25 సీట్లే**

**మరోసారి బీసీ వర్గాలకు ద్రోహం చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్**

**గత ఎన్నికల్లో ఎస్సీలకు 29, ఎస్టీలకు 7, మైనార్టీలకు 5.. బీసీలకు 41 శాసనసభ స్థానాల్లో అవకాశం**

**ఈ దఫా ఎస్సీలకు 4, ఎస్టీలకు 1, బీసీలకు 11 స్థానాల్లో అవకాశం**

**గత ఎన్నికల్లో మహిళలకు నాలుగు చోట్ల అవకాశం.. ఇప్పుడు ఐదు సీట్లు**

అమరావతి : సార్వత్రిక ఎన్నికల్లో 175 శాసనసభ, 25 లోక్‌సభ మొత్తం 200 స్థానాలకుగాను సరిగ్గా సగం అంటే 100 స్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యర్థులను బరిలోకి దించుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ సామాజిక న్యాయ పతాకాన్ని ఎగరేశారు. దేశ చరిత్రలో ఇదో రికార్డు. గత ఎన్నికల తరహాలోనే శనివారం వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయలోని మహానేత వైఎస్సార్ సమాధి వద్ద నివాళులు అర్పించిన సీఎం జగన్.. మంత్రి ధర్మాన, ఎంపీ నందిగం సురేష్ లతో ఒకేసారి 175 శాసనసభ, 24 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటింపజేశారు.

### సామాజిక మహా విప్లవం

నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటూ ఆ వర్గాలను అక్కున చేర్చుకుంటూ వారి సాధికారతకు బాటలు వేసిన సీఎం జగన్.. సార్వత్రిక ఎన్నికల్లో 175 శాసనసభ స్థానాలకుగాను



29 స్థానాల్లో ఎస్సీ, 7 స్థానాల్లో ఎస్టీ, 48 స్థానాల్లో బీసీ వర్గాలకు చెందిన అభ్యర్థులను బరిలోకి దించారు. మొత్తం 84 శాసనసభ స్థానాలను ఆ వర్గాలకు కేటాయించారు. ఇందులో 7 స్థానాల్లో మైనార్టీలకు, మొత్తంగా మహిళలకు 19 స్థానాల్లో అవకాశం ఇచ్చారు. గత ఎన్నికల్లో ఎస్సీలకు 29, ఎస్టీలకు 7, బీసీలకు 41 స్థానాలు వెరసి ఆ వర్గాలకు 77 స్థానాలను కేటాయించారు. వీటిని పరిశీలిస్తే గత ఎన్నికల కంటే ఇప్పుడు 7 స్థానాలు అధికంగా ఆ వర్గాలకు కేటాయించారు. గత ఎన్నికల కంటే ఇప్పుడు మహిళలకు అదనంగా 4 స్థానాలు, మైనార్టీలకు అదనంగా 2 స్థానాలు కేటాయించారు. 25 ఎంపీ స్థానాలకుగాను 4 స్థానాల్లో ఎస్సీ, ఒక స్థానంలో ఎస్టీ, 11 స్థానాల్లో బీసీ వర్గాలకు చెందిన వారిని అభ్యర్థులుగా ఎంపిక చేశారు. అంటే.. మొత్తం 16 లోక్‌సభ స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కేటాయించినట్లు స్పష్టమవుతోంది. గత ఎన్నికల్లో ఎస్సీలకు 4, ఎస్టీలకు 1, బీసీలకు ఏడు వెరసి 12 స్థానాలను ఆ వర్గాలకు కేటాయించారు. వీటిని పరిశీలిస్తే గత ఎన్నికల కంటే ఇప్పుడు ఆ వర్గాలకు అదనంగా 4 స్థానాలు కేటాయించారు. గత ఎన్నికల్లో లోక్‌సభ అభ్యర్థినులుగా 4 చోట్ల మహిళలకు అవకాశం కల్పిస్తే.. ఇప్పుడు 5 స్థానాలను కేటాయించారు.

### చంద్రబాబు, పవన్ సామాజిక ద్రోహం

సీఎం జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోవడానికి చంద్రబాబు భయపడి జనసేనతో జట్టుకట్టారు. అయినా ఘోర పరాజయం తప్పదని గ్రహించి.. అవినీతి కేసుల నుంచి బయటపడొచ్చనే వ్యూహంతో బీజేపీ పెద్దల కాళ్లావేళ్లాపడి వార్టితో పొత్తు పెట్టుకుని జనసేనకు 21, బీజేపీకి పది శాసనసభ స్థానాలు కేటాయించారు. 144 స్థానాల్లో టీడీపీ పోటీ చేసేలా లెక్క తేల్చారు. ఈ కూటమి ఇప్పటిదాకా 135 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేస్తే అందులో బీసీలు కేవలం 25 (టీడీపీ 24, జనసేన 1) మంది, మైనార్టీలు కేవలం ముగ్గురే ఉండటం గమనార్హం. ఆ మూడు పార్టీలు ఖరారు చేయాల్సిన స్థానాలు ఇంకా 40 మాత్రమే మిగిలాయి. వాటిలో ఒకట్రెండు స్థానాలు మాత్రమే బీసీలకు కేటాయించే అవకాశం ఉంది. దీన్ని బట్టి చూస్తే చంద్రబాబు, పవన్ మరోసారి బీసీలకు వెన్నుపోటు పొడిచి, ఆ వర్గాలకు ద్రోహం చేసినట్లు స్పష్టమవుతోంది.

### చట్టం చేసి మరీ నామినేటెడ్ పదవులు ఇచ్చిన తరహాలోనే..

మంత్రివర్గం కూర్పుతోనే సామాజిక న్యాయానికి నాంది పలికిన సీఎం జగన్.. కేబినెట్ నుంచి స్థానిక సంస్థల వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, మహిళలకు పెద్దపీట వేసి, పరిపాలనలో భాగస్వామ్యం కల్పిస్తూ సామాజిక విప్లవాన్ని ఆవిష్కరించారు. నామినేటెడ్ పదవుల్లో, పనుల్లో 50 శాతం రిజర్వేషన్ చేస్తూ చట్టం చేయడం దేశ చరిత్రలోనే ప్రథమం. నా నా అంటూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు.. మహిళలకు పదవులు, పనులు ఇచ్చారు. ఇప్పుడు 175 అసెంబ్లీ, 24 ఎంపీ స్థానాలు కలిపి 200 స్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారికి 50 శాతం కేటాయించి సామాజిక న్యాయాన్ని చేతల్లో చూపించారు. దేశ చరిత్రలో ఎన్నడూ కనివిని ఎరుగని రీతిలో సీఎం జగన్ సామాజిక న్యాయం చేశారని రాజకీయ పరిశీలకులు ప్రశంసిస్తున్నారు.

### అన్ని వర్గాలకు ఊతం.. అందుకే గెలుపు ఖాయం

గత 58 నెలలుగా అర్హతే ప్రామాణికంగా.. వివక్ష, అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో అన్ని వర్గాల పేదల ఖాతాల్లో రూ.2.70 లక్షల కోట్లను సీఎం జగన్ జమ చేశారు. నాన్ డీబీటీ రూపంలో మరో రూ.1.79 లక్షల కోట్లు.. వెరసి రూ.4.49 లక్షల కోట్ల ప్రయోజనం చేకూర్చడం ద్వారా అన్ని వర్గాల పేదల అభివృద్ధికి ఊతమిచ్చారు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక మార్పులతో రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఉంటే.. అందులో 2.13 లక్షల ఉద్యోగులను గత 58 నెలల్లోనే నియమించారు. గత 58 నెలల పాలనలో ప్రతి ఇంట్లో ప్రతి గ్రామంలో, ప్రతి నియోజకవర్గంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు కళ్లకు కట్టినట్లు కన్పిస్తున్నాయి. మీ బిడ్డ పాలనలో మీ ఇంట్లో మీకు మంచి జరిగి ఉంటే మీ బిడ్డను ఆశీర్వదించండి అంటూ వినమ్రంగా కోరుతూ సార్వత్రిక ఎన్నికల్లో 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో విజయమే లక్ష్యంగా సీఎం జగన్ సమర భేరి మోగించారు. ఇందులో భాగంగా భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభలు ఒకదానికి మంచి మరొకటి విజయవంతమయ్యాయి. టీడీపీ-జనసేన తొలిసారిగా తాడేపల్లిగూడంలో ఉమ్మడిగా నిర్వహించిన జెండా సభ జనం లేక అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం తథ్యమని టైమ్స్‌నౌ-ఈటీజీ, జీన్యూస్-మార్టిటైజ్ వంటి డజనుకుపైగా ప్రముఖ జాతీయ మీడియా సంస్థల సర్వేలు తేల్చి చెబుతున్న నేపథ్యంలో ఎన్నికల్లో జగన్ ఎగరేసిన సామాజిక న్యాయ పతాకం రెపరెపలాడటం ఖాయమని రాజకీయ పరిశీలకులు విశ్లేస్తున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారు.. రేవంత్ ఖబర్దార్..!



హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి నోరు, ఒళ్ళు దగ్గర పెట్టుకోవాలని, ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని, ఖబర్దార్ అంటూ మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వ్యాపారస్తులను బ్లాక్ మెయిల్ చేసి చేస్తున్న వసూళ్ళ చిట్టా రికార్డ్ అవుతుందన్నారు. ఈమధ్య కాలంలో నడమంత్రపు సిరిలాగా ముఖ్యమంత్రి పదవి వచ్చిన రేవంత్ నెలరోజుల్లోనే రెండు నాల్కల ధోరణితో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మోడీ మా పెద్దన్న, ఆయన ఆశీర్వాదం ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది అని చెప్పారు. ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న కొంపల్లి, అల్వాల్ ఫ్లై ఓవర్ కోసం 175 ఎకరాల రక్షణ రంగ భూమిని కేటాయించారు అని చెప్పిన సీఎం.. మళ్లీ మోదీ ఎంది అనిమాట్లడుతున్నారు. కేసీఆర్ కూడా అలానే మాట్లాడారు. ఆయనకు పట్టిన గతే మీకు పడుతుందని మండిపడ్డారు. నోరు, ఒళ్ళు దగ్గర పెట్టుకో.. అధికారం ఉందని ఏది పడితే అది మాట్లాడితే సహించడానికి ప్రజలు సిద్ధంగా లేరని అన్నారు. కేసీఆర్ ఫోన్ టాపింగ్ చేస్తున్నారని విమర్శించిన వీరు.. కూడా ఫోన్ టాపింగ్ చేస్తున్నట్టు తెలుస్తోందన్నారు. అప్రజాస్వామికం వ్యవహరిస్తే ఖబర్ధార్ అన్నారు. పిల్లి కళ్ళు మూసుకొని పాలుతాగినట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి ఫండ్స్ పంపించడానికి ఇక్కడ ఉన్న వ్యాపారస్తుల ఎంత వేదిస్తున్నది.. ఎంత బ్లాక్ మెయిల్ చేస్తున్నది రికార్డ్ అవుతుందని క్లారిటీ ఇచ్చారు. ఒక్క రాష్ట్రంలో ఉండి నేనే అన్నీ అనుకుంటున్నావు.. నిన్ను వీక్షించే వారు కూడా ఉన్నారని మర్చిపోకు రేవంత్ అన్నారు. మల్కాజిగిరిలో ఎవరు వచ్చిన ఎన్ని డబ్బులు ఖర్చుపెట్టిన గెలిచేది బీజేపీనే.. అని ప్రజల ఆశీర్వాదం తమకే ఉంటుందని అన్నారు. మోడీ ఏనాడు అలవికాని హామీలు ఇవ్వలేదన్నారు. దేశచరిత్రలో ఎక్కడా లేనన్ని హామీలు ఇక్కడ కాంగ్రెస్ ఇచ్చిందని తెలిపారు. మా పాలన నచ్చితే 370 సీట్లు ఇవ్వాలని, ఎన్‌డిఏ కి చార్ సౌ పార్ అందించాలని మోడీ కోరుతున్నారని అన్నారు. ఎంత మెజారిటీ వచ్చినా తోడుగా వచ్చిన పార్టీలను మాత్రం వదిలిపెట్టడం లేదు.. కొంతమంది ఒడ్డు ఎక్కాక బొడ మల్లన్న అని వదిలివేస్తారు కానీ కష్టకాలంలో అండగా ఉన్న వారిని వదిలిపెట్టలేదన్నారు.

### ‘100 రోజుల్లో ప్రజాపాలన అందించాం’..

## సీఎం రేవంత్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

ఇచ్చిన హామీల మేరకు గ్యారంటీలను అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు 26 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, 8 లక్షల కుటుంబాలు రూ.500 సిలిండర్ అందుకున్నాయని తెలిపారు. 42 లక్షల కుటుంబాలు 200 యూనిట్ల విద్యుత్ పథకాన్ని పొందాయని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కేసీఆర్ నాశనం చేశారని, వాహన రిజిస్ట్రేషన్‌లో బీఆర్ఎస్‌కు నకలుగానే టీఎస్ తీసుకొచ్చారని సీఎం రేవంత్ ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక 100 రోజుల్లో ప్రజాపాలన అందించామని సీఎం రేవంత్ అన్నారు. ప్రజలు స్వేచ్ఛ కోరుకొని కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని ఆయన అన్నారు. గతంలో అభివృద్ధి, సంక్షేమం పేరుతో కేసీఆర్ రాచరిక పాలన చేశారని, ప్రజలు నిరసనలు చేయకుండా అడ్డుకున్నారని సీఎం దుయ్యబట్టారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ నిర్బంధానికి గురైందని సీఎం అన్నారు. నియంత ఎప్పుడూ సంస్కృతిని ధ్వంసం చేయాలని చూస్తాడని చురకలంటించారు. 1948 సెప్టెంబర్ 17కు ఎంతో ప్రాముఖ్యత ఉందో, 2023 డిసెంబర్ 3కు కూడా చరిత్రలో అంతే ప్రాముఖ్యత ఉందన్నారు. 1948 సెప్టెంబర్ 17న నిజాం రాచరిక పాలన అంతమైందని, 2023 డిసెంబర్ 3న కేసీఆర్ పాలన అంతమైందని చురకలంటించారు. జయ జయహే తెలంగాణ పాటను కెసిఆర్ రాష్ట్రగీతంగా ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. తెలంగాణ వచ్చిన తరువాత కవులు, కళాకారులు గడిల్లో దాక్కొవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.



## వారు ఎన్నిసార్లు పర్యటించినా ఫలితం మాత్రం శూన్యమే..

### రాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురికానున్న మోదీ
### టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

చెన్నై: ప్రధాని మోదీ రాష్ట్రానికి ఎన్నిసార్లు వచ్చినా ఫలితం శూన్యమని, రాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై తెలిపారు. రాయపేటలోని టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో శనివా రం సెల్వపెరుందగై, దక్షిణ చెన్నై మధ్య జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఎస్.ఉమ సమక్షంలో తమిళనాడు ఐక్య జనతాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.జితేంద్రబాబు, శ్రీమాల సహా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన సెల్వపెరుందగై విలేకరులతో మాట్లా డుతూ... రాష్ట్రం నుంచి డీఎంకే - కాంగ్రెస్ ను వెళ్లగొట్టాలని మోదీ ప్రకటించ డం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమిళ భాష మాట్లాడలేనందుకు బాధగా ఉందంటూ మోదీ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రాచీన భాష హోదా కలిగిన తమిళ భాషాభివృద్ధికి 2017-20 వరకు కేంద్ర ప్రభుత్వం రూ.12.31 కోట్లు మాత్రమే కేటాయించిందని తెలిపారు. అదే సమయంలో 24,000 మంది మాత్రమే మాట్లాడుతున్న సంస్కృతం భాషాభివృద్ధికి రూ.643.84 కోట్లు కేటాయించారని తెలిపారు. ప్రస్తుతం లోకసభ ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం రాష్ట్రానికి వస్తున్న మోదీ, తమిళ భాషపై అమితమైన ప్రేమ చూపుతున్నారని, ఆయన కపట నాటకాలను రాష్ట్రప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు.

## నేను గెలవకపోతే అమెరికాలో ‘రక్తపాతమే’: ట్రంప్



మెరికా అధ్యక్షుడిగా తనను ఎన్నుకోకపోతే దేశంలో రక్తపాతం తప్పదని రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. అధ్యక్ష ఎన్నిక జరుగనున్న నవంబర్ 5.. అమెరికా చరిత్రలో అత్యంత ముఖ్యమైన తేదీ అని చెప్పారు. ఒహియోలోని వాండాలియాలో జరిగిన ర్యాలీలో ట్రంప్ మాట్లాడారు. అయితే ఈ వ్యాఖలు ఏ ఉద్దేశంలో చేశారో స్పష్టంగా వెల్లడించలేదు. అధ్యక్షుడిగా తాను ఎన్నికైతే అమెరికాకు దిగుమతి చేసుకున్న కార్లను చైనా విక్రయించలేదని పేర్కొన్నారు. మెక్సికోలో కార్లను తయారు చేసి వాటిని అమెరికన్లను అమ్మాలని డ్రాగన్ దేశం చూస్తున్నదని విమర్శించారు. తన ప్రత్యర్థి అయిన జో బైడెన్‌ను ‘చెత్త’ అధ్యక్షుడిగా అభివర్ణించారు. వలసదారులకు మిలియన్ల కొద్ది వర్క్ పర్మిట్లు మంజూరు చేయడం ద్వారా ఆఫ్రికన్-అమెరికన్ ఓటర్లకు బైడెన్ వెన్నుపోటుపొడిచారని ఆరోపించారు. అమెరికాలో ఈసారి జరుగబోయే ఎన్నికల్లో 2020 పునరావృతం కానుంది. మరోసారి జో బిడెన్, డొనాల్డ్ ట్రంప్ యునైటెడ్ స్టేట్స్ అధ్యక్ష పదవికి పోరులో తలపడ్డారు. డెమొక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య పోరు మరింత వేడెక్కుతోంది. మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒకదాని తర్వాత మరొకటి గెలుస్తూ అధ్యక్ష ఎన్నికల్లో తన స్థానాన్ని ఖాయం చేసుకున్నారు. ఇప్పుడు భయంకరమైన బెదిరింపులు ఇచ్చాడు. ఈ ఎన్నికల్లో రక్తపాతం తప్పదని బెదిరించారు. మెక్సికోలో కార్లను తయారు చేసి అమెరికన్లకు విక్రయించాలనే చైనా ప్రణాళికలను ఆయన విమర్శించారు, ‘నేను ఎన్నికైతే, వారికి ఆ కార్లను విక్రయించే అవకాశం లేదు. అదే సమయంలో, జో బిడెన్ అమెరికా చెత్త అధ్యక్షుడిగా పేర్కొన్న ట్రంప్.. ‘నేను ఈసారి ఎన్నిక కాకపోతే, రక్తపాతం జరుగుతుంది’ అని అంటూ హెచ్చరికలు జారీ చేశాడు. ఇక బిడెన్ ఇమ్మిగ్రేషన్ విధానాన్ని కూడా ట్రంప్ విమర్శించారు. ‘మిలియన్ల కొద్దీ వలసదారులకు పని అనుమతి ఇవ్వడం ద్వారా బిడెన్ ఆఫ్రికన్-అమెరికన్ ఓటర్లను పదేపదే వెన్నుపోటు పొడిచాడు’ అని ట్రంప్ విమర్శించారు. రిపబ్లికెన్ పార్టీ కీలక నేత, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్? ట్రంప్ చేసిన సంచలన వ్యాఖ్యలపై డెమొక్రాట్ పార్టీ, జో బైడెన్ వర్గం ప్రకటన విడుదల చేసింది. “2020 జనవరి 6న జరిగిన హింస అందరికి గుర్తుంది. దానిని మళ్లీ రిపీట్ చేయాలని ట్రంప్ చూస్తున్నారు. ఆయనొక లూజర్. ప్రజలు తెలివైన వారు. ఈసారి కూడా ఆయన్ని ఓడిస్తారు. హింసతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని ఓడిస్తారు,” అని జో బైడెన్ క్యాంపైన్ చెప్పుకొచ్చింది. ఇదే విషయంపై.. వాషింగ్టన్ లో జరిగిన ఓ ఈవెంట్ లో మాట్లాడారు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్.”స్వేచ్ఛపై దాడి జరుగుతోంది. 2020 ఎన్నికల్లో చెప్పిన అబద్ధాలు, తీర్పును తారుమారు చేయాలని చేసిన ప్రయత్నాలు, జనవరి 6 సంఘటన.. ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారాయి. 2020లో వాళ్లు ఓడిపోయారు. కానీ ప్రమాదం ఇంకా పొంచి ఉంది,” అని జో బైడెన్ అన్నారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజల స్వప్నాలను ఛిద్రం చేశాయి

ఇసుర్రాయిలో తెలంగాణ నలిగిపోయింది

నాగర్‌కర్నూల్ బీజేపీ సభలో ప్రధాని మోదీ ఫైర్

ప్రజల పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి అన్నట్లు తయారైంది

వచ్చే ఐదేళ్లు కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం నాశనం కాకుండా ఉండాలంటే 17 సీట్లలో బీజేపీని గెలిపించండి

కాంగ్రెస్ అవినీతి, దుష్ట పాలనను అడ్డుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం

గత ఎన్నికల్లో బీజేపీ ఓటింగ్ శాతాన్ని డబుల్ చేశారు

ఈసారి రెండంకెల సీట్లలో గెలిపించి ఆశీర్వదించండి

అవినీతికి పాల్పడిన ఎవరినీ శిక్షించకుండా వదిలిపెట్టబోమని వ్యాఖ్య

ఏఐ టెక్నాలజీతో ‘ఎక్స్’లో తన ప్రసంగాలను తెలుగులో వినాలని ప్రధానమంత్రి మోదీ విజ్ఞప్తి



నాగర్‌కర్నూల్ ,: కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య తెలంగాణ ఇసుర్రాయిలో పడిన మాదిరిగా నలిగిపోయిందని.. ఆ రెండూ పార్టీలు కలసి తెలంగాణకు సంబంధించిన ప్రతీ స్వప్నాన్ని ఛిద్రం చేశాయని ప్రధాని నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం లూటీకి పాల్పడితే.. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు భూములు, ఇతర ఆస్తుల కైంకర్యానికి దిగుతోందని ఆరోపించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రజల పరిస్థితి ముందు నుయ్యి, వెనక గొయ్యి అన్నట్టు తయారైందన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఓటింగ్ శాతాన్ని రెండింతలు చేశారని.. ఈ ఎన్నికల్లో బీజేపీని రెండంకెల సీట్లలో గెలిపించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. శనివారం నాగర్‌కర్నూల్‌లో బీజేపీ నిర్వహించిన విజయ సంకల్ప సభలో ప్రధాని మోదీ మాట్లాడారు. ‘నా తెలంగాణ కుటుంబ సభ్యులకు నమస్కారాలు..’అంటూ తెలు గులో ప్రసంగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే.. “ఎన్నికల కమిషన్ లోక్‌సభ ఎన్నికల నగారా మోగిస్తోందని సాయంత్రమే టీవీల్లో చూశా. కానీ దేశ ప్రజలు ఇప్పటికే అబ్‌కీ బార్.. మోదీ సర్కార్.. 400 పార్ (మళ్లీ మోదీ సర్కార్.. ఈసారి 400 సీట్లపైనే..) అని నిర్ణయించుకున్నారు. ఇప్పుడు నాగర్‌కర్నూల్‌లో జన సునామీని.. నిన్న మల్కాజిగిరిలో రోడ్‌షోకు వచ్చిన అద్భుత స్పందనను చూస్తే.. మోదీనే మరోసారి ప్రధాని అని తెలంగాణ చెబుతున్నట్టు ఉంది.

### ఏ ఒక్క అవినీతిపరుడు తప్పించుకోలేడు

అవినీతికి పాల్పడిన ఏ ఒక్కరూ శిక్ష పడకుండా తప్పించుకోలేరని తెలంగాణ ప్రజలకు వాగ్దానం చేస్తున్నాను. అవినీతిపరులకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరులో మాకు తెలంగాణ ప్రజలు, యువత, మహిళల ఆశీర్వాదం కావాలి.

### కాంగ్రెస్ చేసేది మోసాలు, దోపిడీయే..

ఏడు దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో మోసాలు, దోపిడీ తప్ప ఏమీ లేవు. గరీబీ హఠావో అని నినాదమిచ్చి మోసానికి, లూటీకి దిగింది. పేదల జీవితాల్లో ఎలాంటి మార్పు తీసుకురాలేదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకుంది. 2014లో ఎన్డీయే ప్రభుత్వం పూర్తి మెజారిటీతో అధికారంలోకి వచ్చాకే దేశంలో మార్పు ప్రారంభమైంది. గత పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటికి వచ్చారు. మార్పు అనేది మోదీ గ్యారంటీగా అమల్లోకి వచ్చింది. ఇప్పుడు మనందరం కలసి తెలంగాణలో కూడా మార్పు తీసుకురావాలి. మోదీ మీ ఓట్లతో గెలిచి కుటుంబ సభ్యులకో, పరివారానికో పదవులు, బ్యాంక్ బ్యాలెన్స్‌లు ఏర్పాటు చేయడు. మొత్తం 140 కోట్ల మంది భారతీయులు మోదీ కుటుంబ సభ్యులే. 23 ఏళ్ల నుంచి సీఎంగా, ప్రధానిగా ప్రజలకు సేవచేసే అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నాను. ఒక్కరోజు కూడా నా కోసం సెలవు తీసుకోలేదు. పేదలకు లబ్ధి చేకూర్చడం కోసం జన్‌ధన్ బ్యాంకు ఖాతాలు, బీమా, ముద్రా రుణాలు, ఆయుష్మాన్ భారత్ వంటివి తెచ్చాం. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ప్రక్రియ మొదలైంది. దీనిని పూర్తి చేయడం మోదీ గ్యారంటీ.

### అట్టడుగు వర్గాలను కాంగ్రెస్ అవమానిస్తోంది

కేంద్రప్రభుత్వ పథకాల ద్వారా అత్యధికప్రయోజ నం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, మహిళలు, రైతులకే అందుతోంది. ఇది సామాజిక న్యాయం. ఈ పథకాలను కాంగ్రెస్, బీఆర్ఎస్ వంటి అవినీతి, కుటుంబ పార్టీలు వ్యతిరేకిస్తూ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలను అవమానిస్తోంది. గతంలో అంబేద్కర్‌ను ఎన్నికల్లో ఓడించేందుకు ప్రయత్నించింది. ఆదివాసీ మహిళ ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతి కాకుండా ఓడించాలని చూసింది. ఇప్పుడు తెలంగాణ డిప్యూటీ సీఎంను కింద కూర్చోబెట్టి అవమానించింది. కేసీఆర్ కూడా కొత్త రాజ్యాంగం కావాలంటూ అంబేద్కర్‌ను అవమానించారు. దళితబంధు ఇస్తామని మోసం చేశారు. దళితుడిని సీఎం చేస్తామని చెప్పి దగా చేశారు. కాంగ్రెస్ 2జీ స్కామ్‌కు పాల్పడితే.. బీఆర్ఎస్ ఇరిగేషన్ ప్రాజెక్టులో అవినీతికి దిగింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ భూముల కుంభకోణాలకు దిగాయి..”అని ప్రధాని మోదీ ఆరోపించారు. బీజేపీ తరఫున బరి లో ఉన్న పి.భరత్‌ప్రసాద్ (నాగర్‌కర్నూల్), డీకే అరుణ (మహబూబ్‌నగర్), కిషన్‌రెడ్డి (సికింద్రాబాద్) శానంపూడి సైదిరెడ్డి (నల్గొండ)లను వేదికపై నుంచి సభికులకు మోదీ పరిచయం చేశారు. పార్టీ తరఫున ప్రజలకు సేవ బాధ్యతను వారికి అప్పగించానని, వారిని గెలిపించి మద్దతివ్వాలని కోరారు.

### దొంగలు పోతే గజదొంగలు వచ్చారు: కిషన్‌రెడ్డి

రాష్ట్రంలో బీఆర్ఎస్ అవినీతి, దొంగల పాలన పోవాలనుకుంటే.. గజ దొంగలు అధికారంలోకి వచ్చారని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి విమర్శించారు. “గతంలో కాంగ్రెస్ హయాంలో లక్షల కోట్ల అవినీతికి పాల్పడ్డారు. ఇప్పుడు గ్యారంటీల పేరిట గారడీ చేసి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తోంది. గ్యారంటీలు అమలు చేస్తున్నామని ప్రచారం చేస్తోందే తప్ప క్షేత్రస్థాయిలో అవి పేదలకు ఏమాత్రం అందడం లేదు. గత పదేళ్లు రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం దోచుకుంది. రాష్ట్రంలో సరిపోక ఢిల్లీలో కూడా లిక్కర్ వ్యాపారంలో అవినీతికి పాల్పడ్డారు. తాజా అరెస్టులు, ఇతర పరిణామాలకు బీజేపీని, కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న బీఆర్ఎస్ నేతలకు సిగ్గుండాలి..”అని పేర్కొన్నారు. తెలంగాణలో నిజమైన మా ర్పు రావాలంటే రాష్ట్రంలోని మొత్తం 17 సీట్లలో బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

### ‘ఎక్స్’లో నా ప్రసంగాలను తెలుగులో వినండి

“నా ప్రసంగాలను, ఆలోచనలను, నాకు-ప్రజలకు మధ్య సంభాషణలను ప్రతీ ఇంటికి తీసుకెళ్లేందుకు, ప్రతి పౌరుడు వినేందుకు కృత్రిమ మేధ ద్వారా అందుబాటులో ఉంచాం. ఎక్స్ (ట్విటర్)లో ‘నమో ఇన్ తెలుగు’హ్యాండిల్ ద్వారా చూడొచ్చు. ఏఐని ఉపయోగించి నాతో జతకలవొచ్చు. ప్రసంగాలను అంతా వినండి..”అని ప్రధాని మోదీ కోరారు. ఇక తన ప్రసంగాన్ని సీనియర్ జర్నలిస్ట్ రాకా సుధాకర్‌రావు తెలుగులోకి అనువదిస్తుంటాన్ని చూసి.. “ఇంత బాగా ట్రాన్స్‌లేట్ చేస్తున్నారు. పదిరోజులు మీరు నాతో ఉంటే నాకు తెలుగు వచ్చేస్తుంది..”అని నవ్వుతూ పేర్కొన్నారు.

### 17 సీట్లలో కమలం వికసించాలి

తెలంగాణను మళ్లీ నాశనం చేసేందుకు కాంగ్రెస్‌కు ఐదేళ్లు చాలు. దేశవ్యాప్తంగా బీజేపీని 400 సీట్లలో గెలిపిస్తే కాంగ్రెస్ పార్టీ తమ ఇష్టానుసారం చేయడం సాధ్యం కాదు. అందువల్ల తెలంగాణలోని మొత్తం 17 ఎంపీ సీట్లలో కమలం పువ్వును వికసించేలా చేయండి. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటింగ్ శాతాన్ని రెండింతలు చేశారు. ఈసారి రెండంకెల సీట్లలో గెలిపించండి. అలా చేస్తే తెలంగాణ ప్రజల నుంచి ఎంపీల ద్వారా నాకు నేరుగా సందేశం చేరుతుంది. మీకు మరింత సేవచేసే అవకాశం నాకు లభిస్తుంది. మీ కష్టాలు, సమస్యలు, ఆకాంక్షలు తెలుసుకుని.. వాటిని తీర్చేందుకు రాత్రీపగలూ శ్రమిస్తా..

# ఏడు రోజులపాటు కస్టడీకి అప్పగించిన ఢిల్లీ అవెన్యూ కోర్టు

- ఈడీ కస్టడీకి కవిత
- ఈ నెల 23న మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి కోర్టులో హాజరుపర్చాలని ఆదేశాలు
- అంతకుముందు సుదీర్ఘంగా ఇరుపక్షాల వాదనలు
- సుప్రీంకోర్టులో కేసు విచారణలో ఉండగా అరెస్టు చట్టవిరుద్ధమన్న కవిత లాయర్లు
- నిబంధనల మేరకే అదుపులోకి తీసుకున్నామన్న ఈడీ
- కుంభకోణంలో ఆమె పాత్రపై ఆధారాలు ఉన్నాయని వివరణ
- కవిత భర్త అనిల్, ముగ్గురు వ్యక్తిగత సిబ్బందికి ఈడీ నోటీసులు!
- సోమవారం ఢిల్లీలో విచారణకు రావాలని సూచన



న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ ప్రత్యేక కోర్టు ఏడు రోజుల ఈడీ కస్టడీకి అప్పగించింది. తిరిగి ఈ నెల 23న మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి కోర్టులో హాజరుపర్చాలని ఈడీ అధికారులను ఆదేశించింది. ఈడీ కవితను శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో అరెస్టు చేసి, ఢిల్లీకి తరలించిన విషయం తెలిసిందే. శనివారం ఉదయం ఇద్దరు వైద్యులను ఈడీ కార్యాలయానికి పిలిపించి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం ఉదయం 11.30 సమయంలో ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు ముందు హాజరుపర్చారు. మద్యం స్కాం కేసుకు సంబంధించి కవిత నుంచి కీలక అంశాలు రాబట్టాల్సి ఉందని, ఆమెను 10 రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు.

### అరెస్టు అక్రమం: కవిత తరఫు న్యాయవాది

కవిత అరెస్టు అక్రమమని ఆమె తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి కోర్టుకు చెప్పారు. శుక్రవారం కవితను అరెస్టు చేసిన ఈడీ అధికారులు.. ఆమెను కలిసేందుకు తమకు అనుమతివ్వలేదని, విచారణకు ముందు ఆమెతో మాట్లాడేందుకు ఐదు నిమిషాలు సమయం ఇవ్వాలని కోరారు. ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ నాగ్‌పాల్.. కవితతో మాట్లాడేందుకు అనుమతించారు. కాసేపటి తర్వాత విచారణ తిరిగి ప్రారంభించారు. సెప్టెంబర్ 15న సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తదుపరి విచారణ వరకూ కవితపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోబోమని ఈడీ హామీ ఇచ్చిందని న్యాయవాది విక్రమ్ చౌదరి గుర్తు చేశారు. కానీ ఆ హామీని ఉల్లంఘించి కవితను అక్రమంగా అరెస్ట్ చేసిందని చెప్పారు. ఇలా సుప్రీంకోర్టులో విచారణలో ఉన్న సమయంలో కవితను అరెస్టు చేయడాన్ని బ్లాక్‌డేగా అభివర్ణించారు. సుప్రీంకోర్టు మహిళలను విచారించే అంశంలో నళిని చిదంబరం వేసిన పిటిషన్‌కు కవిత పిటిషన్‌ను జతచేసి, విచారణకు చేపట్టిందని న్యాయమూర్తికి వివరించారు.

### నిబంధనల మేరకే అరెస్టు చేశాం: ఈడీ

కవితను నిబంధనల మేరకే అరెస్టు చేశామని ఈడీ తరఫు న్యాయవాది జోసెబ్ హుస్సేన్ కోర్టుకు విన్నవించారు. పత్రికల్లో వచ్చిన విషయాలను పరిగణనలోకి తీసుకోవద్దని న్యాయమూర్తిని కోరారు. తర్వాతి 10 రోజుల్లో సమన్లు ఇవ్వబోమని మాత్రమే సెప్టెంబర్ 15న సుప్రీంకోర్టుకు ఈడీ చెప్పిందని.. విచారణ నుంచి మినహాయింపు ఇవ్వలేదని వివరించారు. ఒక ఆర్డర్ అనుకూలంగా ఉంటే దానిని నిరవధిక కాలానికి వర్తింపజేసుకోవద్దని, ఇతరులకు ఇచ్చిన ఉత్తర్వులను, మధ్యంతర ఉత్తర్వులను మొత్తానికి వర్తించుకోవడం సరికాదని స్పష్టం చేశారు. కవితపై తీవ్ర చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని, కవిత సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి మాత్రమే చేశారని జోసెబ్ వివరించారు. లిక్కర్ స్కాం కేసులో కవిత పాత్రపై ఆధారాలు ఉన్నాయని, ఆమె నుంచి కీలక అంశాలు రాబట్టేందుకు పది రోజులు ఈడీ కస్టడీకి ఇవ్వాలని కోరారు. ఇరువర్గాల వాదనలను విన్న రౌజ్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి.. సాయంత్రం 4.30 గంటలకు తీర్పు వెలువరించారు. కవితను ఏడు రోజుల పాటు ఈడీ కస్టడీకి అనుమతించారు.

### నా అరెస్టు అక్రమం: కవిత

ఈడీ అదుపులో ఉన్న ఎమ్మెల్సీ కవిత ఢిల్లీలో కోర్టుకు హాజరయ్యే ముందు మీడియాతో మాట్లాడారు. తనను ఈడీ అధికారులు అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. దీనిపై పోరాటం చేస్తామని చెప్పారు. కాగా కవిత భర్త అనిల్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, రవిచంద్ర, బడుగుల లింగయ్య యాదవ్, కవిత పీఏలు రాజేశ్, అశోక్ కౌశిక్ తదితరులు రౌజ్ అవెన్యూ కోర్టుకు వచ్చారు. కోర్టులో జరిగిన వాదనలు విన్నారు.

### కవిత భర్త అనిల్, వ్యక్తిగత సిబ్బందికి ఈడీ నోటీసులు!

కవిత భర్త అనిల్‌కు, ఆమె వ్యక్తిగత సిబ్బంది ముగ్గురికి ఈడీ నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. వారిని సోమవారం ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని పేర్కొన్నట్టు సమాచారం. హైదరాబాద్‌లో సోదాల సందర్భంగా ఈడీ అధికారులు ఈ నలుగురి ఫోన్లను సీజ్ చేశారు కూడా.

# టార్గెట్.. బీఆర్ఎస్ ఖతం!

### 38 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో మూడో వంతు మందిని దారిలోకి తెచ్చుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రణాళిక

### అండగా ఉంటామని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే భరోసా ఇస్తున్నారన్న సీఎం రేవంత్

హైదరాబాద్: ‘నన్ను నా పని చేయనిస్తే ప్రతిపక్షాలుగా మీ పని మీరు చేసుకోవచ్చు. నాకేదో కాళ్లలో కట్టె పెట్టాలి. ఈ ప్రభుత్వాన్ని పడగొట్టాలనుకుంటే... మిమ్మల్ని దించుతామని చెప్పి దించి చూపెట్టాం. ఇప్పుడు కూడా స్పష్టంగా చెబుతున్నా. పడగొట్టాలన్న ఆలోచన మీరు చేస్తే మీరు నిద్ర లేచే లోపు మీ పక్కన ఎవరూ ఉండరు. అలా వాళ్లు కోరుకుంటే నాకేమీ అభ్యంతరం లేదు. మీరు తారీఖు చెప్పండి. పడగొట్టేది ఏంటో చెప్పండి. దాని పరిణామాలేంటో నేను చెప్తా..’ అని శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆన్‌రికార్డ్ మాట్లాడిన మాటలు ఇవి. ఇప్పుడు ఈ వ్యాఖ్యలే రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమవుతున్నాయి. రేవంత్ భరోసా వెనుక ఉన్న ఆంతర్యమేంటన్న దానిపై పలు రకాల ఊహాగానాలు మొదలయ్యాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రస్తుతం బీఆర్ఎస్ పక్షాన ఉన్న 38 మంది ఎమ్మెల్యేల్లో 26 మంది కాంగ్రెస్‌తో టచ్‌లోకి వచ్చారని తెలుస్తోంది. ఏ క్షణమైనా, పరిస్థితి ఎలా ఉన్నా ఎదుర్కొనే ప్రణాళికలో భాగంగానే అన్ని రకాల మంతనాలు పూర్తయ్యాయని, భవిష్యత్తులో ప్రభుత్వానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసుకున్నామని రేవంత్ సన్నిహితులు బహిరంగంగానే చెబుతుండటం గమనార్హం. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబ సభ్యులతోపాటు కొత్తగా ఎన్నికైన ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లాకు ఒకరు చొప్పున బీఆర్ఎస్‌తో బంధం తెంచుకోలేని పరిస్థితుల్లో ఉన్న ఎమ్మెల్యేలు మినహా అందరూ టచ్‌లోకి వచ్చినట్లు వారు చెబుతుండటం చర్చనీయాంశమవుతోంది.

### కర్ణాటక తర్వాత ఇక్కడేనా

పార్లమెంటు ఎన్నికల తర్వాత వచ్చే ఫలితాల ఆధారంగా, కర్ణాటక రాజకీయాల్లో మార్పులను బట్టి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందా లేదా అన్నది తేలుతుందని ఇప్పటికే బీజేపీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. కేంద్రంలో మంచి మెజార్టీతో మోదీ మళ్లీ అధికారంలోకి వచ్చి, కర్ణాటకలో సిద్ధరామయ్య సర్కారును పడగొట్టగలిగితే తెలంగాణలోనూ కచ్చితంగా ఆపరేషన్ ఉంటుందని కమలనాథులు కూడా బహిరంగంగానే చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక టీమ్ ముందు జాగ్రత్త ఏర్పాట్లు చేసుకుంటోందని తెలుస్తోంది. అనివార్య పరిస్థితులు వస్తే ఏకంగా బీఆర్ఎస్ శాసనసభాపక్షాన్ని (బీఆర్ఎస్‌ఎల్పీ) కాంగ్రెస్‌లో విలీనం చేసే లక్ష్యంగానే ఇది సాగుతోందని సమాచారం. ఈ భరోసాతోనే మీడియా సమావేశంలో రేవంత్ భరోసాతో కూడిన వ్యాఖ్యలు చేశారనే చర్చ జరుగుతోంది. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో రేవంత్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల నిమిత్తం తనను కలిసిన ఎమ్మెల్యేలు కూడా అండగా నిలుస్తామని, నిజంగా అలాంటి పరిస్థితులు వస్తే తాము నిలబడతామని చెబుతున్నారని రేవంత్ వెల్లడించడం గమనార్హం.

# వెజ్ రోల్స్ మైదా



: అరకప్పు, కార్న్‌ఫ్లోర్: రెండు టేబుల్ స్పూన్లు, టమాట, క్యారెట్, ఆలుగడ్డ, క్యాప్సికమ్ ముక్కలు: రెండు టేబుల్ స్పూన్ల చొప్పున, పచ్చిమిర్చి: నాలుగు, ఉల్లిగడ్డ: ఒకటి, నూనె: పావు కప్పు, ఉప్పు: తగినంత, కారం: ఒక టీస్పూన్, అల్లం వెల్లుల్లి పేస్ట్: అర టీస్పూన్, గరం మసాలా: పావు టీస్పూన్, కొత్తిమీర తురుము: కొద్దిగా.

### కావలసిన పదార్థాలు

మైదా: అరకప్పు, కార్న్‌ఫ్లోర్: రెండు టేబుల్ స్పూన్లు, టమాట, క్యారెట్, ఆలుగడ్డ, క్యాప్సికమ్ ముక్కలు: రెండు టేబుల్ స్పూన్ల చొప్పున, పచ్చిమిర్చి: నాలుగు, ఉల్లిగడ్డ: ఒకటి, నూనె: పావు కప్పు, ఉప్పు: తగినంత, కారం: ఒక టీస్పూన్, అల్లం వెల్లుల్లి పేస్ట్: అర టీస్పూన్, గరం మసాలా: పావు టీస్పూన్, కొత్తిమీర తురుము: కొద్దిగా.

### తయారీ విధానం

పాన్‌లోని నూనె వేడయ్యాక సన్నగా తరిగిన పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ వేయాలి. అవన్నీ వేగాక క్యారెట్, ఆలు, క్యాప్సికమ్, టమాట ముక్కలు వేసి బాగా వేయించాలి. కారం, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు, గరం మసాలా, కొత్తిమీర తురుము జోడించి మరో మూడు నిమిషాలు వేయించి దించి చల్లార్చుకోవాలి. ఒక గిన్నెలో మైదా, కార్న్‌ఫ్లోర్, ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ నూనె వేసి బాగా కలిపి, తగినన్ని నీళ్లు పోసుకుని ముద్దలా చేసుకుని పావుగంటపాటు నాన బెట్టాలి. పిండిని కొద్దికొద్దిగా తీసుకుని పలుచని చపాతీల్లా చేసుకోవాలి. స్టవ్ మీద పెనం పెట్టి చపాతీలను పది సెకన్లపాటు రెండువైపులా కాల్చి తీసేయాలి. ఇప్పుడు ఒక్కో చపాతీ మధ్యలో కూరగాయల మిశ్రమం పెట్టి అన్నివైపులా మూసి రోల్స్‌లా చుట్టుకుని చివర్లను మైదా నీళ్లతో అంటించాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనెపోసి వేడయ్యాక చుట్టి ఉంచిన రోల్స్ వేసి దోరగా కాల్చుకుంటే కరకరలాడే వెజ్ రోల్స్ రెడీ.

# ఎయిర్ ఫ్రైడ్ కోకోనట్ ష్రింప్



### కావలసిన పదార్థాలు

మైదాపిండి: అర కప్పు, మిరియాల పొడి: ఒక టీస్పూన్, ఉప్పు: తగినంత, బ్రెడ్ పొడి: ఒక కప్పు, ఎండు కొబ్బరి తురుము: అర కప్పు, గుడ్లు: రెండు, పచ్చి రొయ్యలు: ఒక కప్పు, మయోనీజ్: అర కప్పు, స్పైసీ చిల్లీ సాస్: ఒక టేబుల్ స్పూన్, థాయ్ స్వీట్ చిల్లీ సాస్: ఒక టేబుల్ స్పూన్.

### తయారీ విధానం

ఒక పెద్ద గిన్నెలో మైదాపిండి, ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి. మరో గిన్నెలో కొబ్బరి తురుము, బ్రెడ్ పొడి వేసి కలపాలి. మూడో గిన్నెలో గుడ్ల సొన వేయాలి. ఇప్పుడు శుభ్రం చేసుకున్న ఒక్కో రొయ్యను ముందుగా పిండి, తర్వాత కొబ్బరి మిశ్రమం, చివరగా గుడ్డు సొనలో ముంచి పక్కనపెట్టాలి. వాటన్నిటినీ ఎయిర్ ఫ్రైయర్ బాస్కెట్‌లో పెట్టి, 400 డిగ్రీల దగ్గర ఉడికించాలి. దానికి 10-12 నిమిషాల సమయం పడుతుంది. వీటిని మయోనీజ్, చిల్లీ సాస్ మిశ్రమంతో నంజుకుని తింటే రుచిగా ఉంటాయి. చక్కని సాయంకాల ఫలహారం ఇది.

# మసాలా మ్యాకరోని



### కావలసిన పదార్థాలు

మ్యాకరోని: ఒక కప్పు, నూనె: రెండు టేబుల్ స్పూన్లు, వెల్లుల్లి: నాలుగు రెబ్బలు, జీలకర్ర: అర టీస్పూన్, పచ్చిమిర్చి: రెండు, ఉల్లిగడ్డ: చిన్నది, పసుపు: చిటికెడు, చిన్నగా తరిగిన టమాట, క్యాప్సికం ముక్కలు: రెండు టేబుల్ స్పూన్ల చొప్పున, మిరియాల పొడి, గరం మసాలా, జీలకర్ర పొడి: పావు టీస్పూన్ చొప్పున, కారం: అర టీస్పూన్, ఉప్పు: తగినంత, కొత్తిమీర తురుము: కొద్దిగా.

### తయారీ విధానం

ముందుగా మ్యాకరోనీని పది నిమిషాలు ఉడికించి నీళ్లు వంచి పెట్టుకోవాలి. స్టవ్‌మీద పాన్‌పెట్టి నూనె వేడయ్యాక జీలకర్ర, చిన్నగా తరిగిన వెల్లుల్లి, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ ముక్కలు వేయాలి. బాగా వేగాక టమాట ముక్కలు జోడించి రెండు నిమిషాలు మూతపెట్టి మగ్గించాలి. పసుపు, మిరియాల పొడి, గరం మసాలా, కారం, జీలకర్ర పొడి, ఉప్పు, క్యాప్సికం ముక్కలు కలిపి ఒక కప్పు నీళ్లుపోసి ఉడికించాలి. మిశ్రమం ఉడుకుతుంటే మ్యాకరోని వేసి నీరు ఇగిరిపోయే వరకు కలుపుతూ వేయించాలి. చివరగా కొత్తిమీర చల్లుకుని దించుకుంటే కారంకారంగా నోరూరించే మసాలా మ్యాకరోని సిద్ధం.

# పులగం ఎలా తయారు చేసుకోవాలంటే..?



### పులగం తయారీకి కావలసిన పదార్థాలు

బియ్యం: ఒక కప్పు, పెసరపప్పు: అరకప్పు, ఉల్లిగడ్డ: ఒకటి, టమాట: ఒకటి, పచ్చిమిర్చి: ఆరు, మిరియాలు: అర టీస్పూన్, ఆవాలు, జీలకర్ర: ఒక టీస్పూన్ చొప్పున, పసుపు: పావు టీస్పూన్, నూనె: రెండు టేబుల్ స్పూన్లు, కరివేపాకు: రెండు రెబ్బలు, ఉప్పు: తగినంత.

### పులగం తయారీ విధానం

బియ్యం, పెసరపప్పు కడిగి విడివిడిగా గంటసేపు నానబెట్టుకోవాలి. కుక్కర్‌లో నూనె వేసి.. వేడయ్యాక ఆవాలు, జీలకర్ర, మిరియాలు, తరిగిన ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, కరివేపాకు వేయాలి. బాగా వేగాక పసుపు కలపాలి. నానబెట్టిన పెసరపప్పు, బియ్యం, తగినంత ఉప్పు జోడించి రెండు నిమిషాలు బాగా కలిపి మూడు కప్పుల నీళ్లుపోసి.. మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికిస్తే నోరూరించే పులగం సిద్ధం.

# అన్నీ అవినీతి మరకలే..!



న్యూఢిల్లీ : తన ప్రభుత్వానికి అవినీతి ఆరోపణల మరక అంటలేదని ప్రధాని నరేంద్ర మోడీ తరచుగా చెబుతుంటారు. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమని, చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు ప్రకటించిన తర్వాత ఆయన వాదనలో ఏ మాత్రం నిజం లేదని, ప్రధాని మాటలన్నీ అబద్ధాల మూటలేనని తేలిపోయింది. సుప్రీంకోర్టు తీర్పు ఫలితంగా ఎన్నికల బాండ్ల గుట్టు రట్టయింది. వాటి ద్వారా అత్యధికంగా ఆర్థిక ప్రయోజనం పొందింది బిజెపియేనని స్పష్టమవడంతో తనది అవినీతి రహిత ప్రభుత్వమని మోడీ చెప్పుకోవడం హాస్యాస్పదమే అవుతుంది. 2017లో ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రారంభించడానికి ముందు దానిని గురించి పాలకులు ఎన్నో గొప్పలు చెప్పారు. బడా కార్పొరేట్ సంస్థలు కూడా ఈ పథకాన్ని స్వాగతిస్తున్నాయని అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పుకొచ్చారు. కాకపోతే రాజకీయ పార్టీలకు విరాళాలు అందించే కార్పొరేట్ సంస్థల గుర్తింపును గోప్యంగా ఉంచాలని అవి కోరుతున్నాయని తెలిపారు. అయితే ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన కంపెనీల జాబితాలో ఎక్కువగా ఊరూ పేరూ లేని సంస్థలే ఉన్నాయి. వీటిలో అనేక సంస్థలు బడా కంపెనీలకు బినామీలుగా వ్యవహరిస్తున్నవే. ఇవి తమ నికర లాభాలలో పది నుండి వంద రెట్ల వరకూ వెచ్చించి ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయి. ఏ కంపెనీ అయినా తన నికర లాభం కంటే వంద రెట్లు ఎక్కువ విలువ కలిగిన బాండ్లను కొనుగోలు చేయగలదా అన్నదే ఇక్కడ ప్రశ్న. విరాళాలు పొందడానికి ఇడి, ఐటి సంస్థలను అధికార పక్షం దుర్వినియోగం చేసిందన్నది సుస్పష్టం. తన హయాంలో కంపెనీలు, వ్యక్తులకు చెందిన రూ.1.12 లక్షల కోట్ల ఆస్తులను జప్తు చేసినట్లు ప్రధాని మోడీ చెబుతారు. అయితే గత పదేళ్లలో ఇడి పెట్టిన మనీ లాండరింగ్ నిరోధక చట్టం కేసులలో కేవలం 0.5% కేసులలో మాత్రమే శిక్షలు పడ్డాయి.

**విరాళాల కోసమే వెలిసిన కంపెనీలు**

కంపెనీలు తమ నికర లాభాలతో నిమిత్తం లేకుండా పెద్ద మొత్తంలో పార్టీలకు విరాళాలు అందించడం వెనుక ఆ సంస్థలకు ఉన్న ప్రయోజనాలు ఏమిటి? వాటి ఉద్దేశం ఏమిటి? వీటిలో కొన్ని కంపెనీలు దొడ్డిదారిన రాజకీయ పార్టీలకు విరాళాలు అందించడానికే వెలిశాయంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇది క్విడ్ ప్రోకో తప్పించి మరొకటి కాదు. ఎన్నికల బాండ్ల కేసు విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌కు ఇదే సందేహం కలిగింది.

**పసలేని నిర్మలమ్మ వాదనలు**

దేశంలో మెగా ప్రాజెక్టులు చేపట్టిన మౌలిక సదుపాయాల కంపెనీల విరాళాల గుట్టును బయటపెట్టడంలో విచారణ సంస్థలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాల్సి ఉంటుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రభుత్వాన్ని సమర్ధించుకుంటూ.. 'దాడుల తర్వాతే ఆయా కంపెనీలు విరాళాలు అందించాయని మీకు ఎలా తెలుసు? దాడులకు ముందే బాండ్లు కొనుగోలు చేసి ఉండవచ్చు కదా!' అని సందేహం లేవనెత్తారు. విరాళాల వ్యవహారంలో బయటపడుతున్న సమాచారాన్ని పరిశీలిస్తే ఆమె వాదనలో ఏ మాత్రం పస లేదని తేలిపోతుంది.

**దాడుల తర్వాతే విరాళాలు**

ఇడి, ఆదాయపన్ను అధికారులు దాడులు జరిపిన తర్వాతే పలు కంపెనీలు రూ.300 కోట్ల విలువ కలిగిన బాండ్లను కొనుగోలు చేసి, రాజకీయ పార్టీలకు సమర్పించుకున్నాయని గతంలోనే న్యూస్ మినిట్, న్యూస్‌లాండ్రీ వంటి స్వతంత్ర మీడియా సంస్థలు తమ విచారణల్లో తేల్చాయి. ఎన్నికల కమిషన్ వెబ్‌సైటులో అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషిస్తే పలు కంపెనీలు ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసి భారీ మొత్తంలో విరాళాలు అందించాయని స్పష్టమవుతోంది. విరాళాలు అందజేసిన కంపెనీలలో ఎన్ని సంస్థలు ఇడి, సిబిఐ, ఐటి దాడులకు గురై ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయన్నదే ప్రశ్న. అనేక చిన్న కంపెనీలు బడా కార్పొరేట్ సంస్థలకు అనుబంధ సంస్థలుగా కొనసాగుతూ బాండ్లు కొనుగోలు చేశాయి. రిలయన్స్ రిటైల్‌కు అనుబంధ కంపెనీలుగా కొనసాగుతున్న లిస్టింగ్ కాని సంస్థలే ఇందుకు ఉదాహరణ.

**ప్రచారాస్త్రంగా బాండ్లు**

ఎన్నికల బాండ్ల పేరుతో ప్రధాని నరేంద్ర మోడీ పెద్ద దోపిడీ రాకెట్ నడుపుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్ష పార్టీలు ఈ బాండ్ల బాగోతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉంది. ఎన్నికల బాండ్లను సిపిఎం తిరస్కరించగా, మిగిలిన ప్రతిపక్షాలకు కూడా విరాళాలు అందాయి. బిజెపికి అందిన విరాళాలలో ఇవి ఐదు నుండి ఇరవై శాతం లోపే ఉన్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే రూ.20 వేలు, అంతకంటే ఎక్కువ మొత్తంలో ఇచ్చిన విరాళాలు మాత్రమే నమోదవుతాయి. వీటిలో 80 నుండి 85 శాతం విరాళాలు బిజెపి ఖాతాలోనే పడడంతో ప్రతిపక్షాల వాటా మరింత తగ్గిపోయింది.

**పరిమితులు ఎత్తేసి%ా**

%ఎన్నికల బాండ్ల పథకం రాకముందు విరాళాలపై పరిమితి ఉండేది. కంపెనీలు గత మూడు సంవత్సరాల నికర లాభాలలో 7.5%కి మించి విరాళాలు ఇవ్వకూడదు. క్విడ్ ప్రోకోకు అడ్డుకట్ట వేయడానికే ఈ పరిమితిని విధించారు.

ఈ విరాళాలను రాజకీయ పార్టీలు, కంపెనీలు తమ పుస్తకాలలో విధిగా నమోదు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల పారదర్శకతకు ఎక్కువ అవకాశం ఉండేది. ఎన్నికల బాండ్ల పథకం ఈ పరిమితిని ఎత్తేసింది. కంపెనీలు లేదా వ్యక్తులు అపరిమితంగా విరాళాలు అందించవచ్చు. ఇది అవినీతిని ఆహ్వానించడమే అవుతుంది.

# వన్యప్రాణుల ప్రేమాలయం... వనతార!






మనకు బాగోకపోతే చూడ్డానికి ఎన్నో ఆసుపత్రులున్నాయి. పెంపుడు జంతువులకూ పశువులకూ వెటర్నరీ హాస్పిటళ్లు అందుబాటులో ఉన్నాయి. మరి వన్య ప్రాణులైన ఏనుగులూ చిరుతపులులూ వంటివాటికి ఏమైనా అయితే ఎవరు పట్టించుకుంటారు... ప్రమాదాల్లో గాయపడితే వాటి బాధను ఎవరు తీర్చుతారు... అని ఆలోచించాడు అనంత్ అంబానీ. ఆ ప్రశ్నలకు సమాధానం, మూగజీవాల పట్ల అతని ప్రేమకు తార్కాణమే 'వనతార'! వన్యప్రాణుల బాధను తీర్చి సాంత్వన చేకూర్చే ఆ కృత్రిమ అడవిలోని ప్రతి సౌకర్యమూ ఓ అద్భుతమే! అక్కడ అడుగు పెట్టగానే మైదానంలో పరుగులు తీసే దుప్పులూ, నీళ్లలోనూ ఒడ్డునా విశ్రాంతి తీసుకునే మొసళ్లూ కనిపిస్తాయి. రకరకాల పక్షిజాతులూ, హిప్పోలూ, కొండ జాతి మేకలూ, జిరాఫీలూ, అడవి దున్నల వంటి రకరకాల జంతువులు స్నేహంగా తిరుగుతుంటాయి. నెమళ్లు పురివిప్పి నాట్యమాడుతుంటే ఏనుగులు మట్టితో సయ్యాట ఆడుతుంటాయి. తెల్ల పులులూ, నల్ల పులులూ ఓరగా చూస్తుంటాయి... ఇలా ఆ అడవిలో అడుగడుగునా స్వేచ్ఛగా తిరిగే క్రూరమృగాలూ, సాధు జంతువులూ ఎన్నో తారసపడతాయి. అక్కడే ఓ వైపు జబ్బుతో బాధపడే జంతువుల్నీ, మరోవైపు కంటికి కునుకు లేకుండా వాటికి సేవలు అందించే సిబ్బందినీ చూడొచ్చు. సహజమైన అడవిలోనో, జూలోనో ఇలాంటి వాతావరణం మనకెక్కడా కనిపించదు. ఇది- మూగ జీవాలను అక్కున చేర్చుకుని వాటి మౌన రోదన తీర్చడానికి అంబానీలు సృష్టించిన అరణ్యం 'వనతార'.



**కలల ప్రాజెక్టు....**


తాత ధీరూభాయ్ అంబానీ, తల్లి నీతా అంబానీ వన్యప్రాణుల విషయంలో శ్రద్ధ తీసుకోవడం, వాటిని కాపాడటం, దానధర్మాలు చేయడం చూస్తూ పెరిగాడు అనంత్ అంబానీ. వారి ప్రభావం వల్ల చిన్నతనం నుంచీ జంతువులకోసం ఏదైనా చేయాలనుకున్నాడు. తమ స్వస్థలమైన గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో రిలయన్స్ రిఫైనరీ కాంప్లెక్స్ ప్రాంతంలో దాదాపు 3000 ఎకరాల స్థలం ఖాళీగా ఉందని అతనికి తెలిసింది. ఆ స్థలాన్ని వన్య ప్రాణుల సంరక్షణకోసం ఉపయోగించాలన్న కోరికతో వివిధ రకాల పండ్ల మొక్కల్నీ ఔషధ మొక్కల్నీ నాటించి కృత్రిమ అడవికి బీజం వేశాడు. అప్పుడు అనంత్‌కు పద్దెనిమిదేళ్లు. టీనేజీ పిల్లలంటేనే సరదాలూ సంతోషాల గురించి ఎక్కువ ఆలోచిస్తారు. సంపన్నుల వారసులంటే ఇంకెంతో విలాసంగా గడుపుతుంటారు. అలాంటిది ఆ వయసులోనే ప్రాణి సేవ గురించి ఆలోచించిన అనంత్ నిర్ణయానికి సంబరపడిన అంబానీల కుటుంబం రిలయన్స్ ఫౌండేషన్ తరపున అడవిని నిర్మించడానికి ముందుకొచ్చింది. పదేళ్లలో పెరిగి పెద్దవైన చెట్ల మధ్యలో రెండు ఆసుపత్రుల్నీ, పెద్ద వంటగదినీ, ఇతరత్రా భవనాలను నిర్మించారు. అడవి నక్షత్రం (స్టార్ ఆఫ్ ది ఫారెస్ట్) అని అర్థం వచ్చేలా ఆ కేంద్రానికి 'వనతార' అనే పేరు పెట్టుకున్నాడు అనంత్. ప్రాణాపాయంలో చిక్కుకున్న అడవి జంతువులనూ ఇతర జీవజాతులనూ రక్షించి- వాటికి పునరావాసం కల్పించేలా వనతారలో అన్ని రకాల సదుపాయాలూ కల్పించాడు. ఈ బృహత్కార్యం కోసం దాదాపు పదివేల మంది సిబ్బందినీ నియమించాడు. అనారోగ్యం వల్లనో ప్రమాదాల్లోనో వేటగాళ్ల కారణంగానో గాయపడిన జంతువులకు అత్యాధునిక వైద్యంతోపాటు అవసరమైతే శస్త్రచికిత్సలూ చేసి సంరక్షిస్తున్నారు సిబ్బంది. జూలో బంధించినట్టుగా కాకుండా అడవిలో మాదిరిగా స్వేచ్ఛగా తిరిగేలా- క్రూరజంతువులకూ, సాధు జంతువులకూ విడివిడిగా స్థలం కేటాయించిన వనతారలోని సేవలన్నింటినీ రిలయన్స్ ఫౌండేషన్ పర్యవేక్షిస్తుంటుంది.





**లీలావతితో మొదలు**


'లీలావతి'... ఓ పెద్ద సర్కస్ కంపెనీకి చెందిన ఏనుగు. కొవిడ్‌కు ముందు రోజుల్లో అగ్నిప్రమాదంలో చిక్కుకుని తీవ్ర గాయాలపాలైంది. కొవిడ్‌తో పరిస్థితులు కాస్త చక్కబడ్డాక దాన్ని 'వనతార'కు తీసుకొచ్చే ఏర్పాట్లు చేశాడు అనంత్ అంబానీ. లీలావతితో సేవలు మొదలుపెట్టిన వనతారలో- అప్పట్నుంచీ దానికి రకరకాల చికిత్సలు అందించడంతోపాటు హైపర్‌బారిక్ ఆక్సిజన్ థెరపీ చేస్తున్నారు. ఈ చికిత్సలో భాగంగా లీలావతిని ఓ అద్దాల గదిలో ఉంచి ఔషధాల సమ్మిళితమైన ఆక్సిజన్‌ను లోపలికి పంపుతున్నారు. ఆ ప్రత్యేకమైన గాలులతోనూ లేజర్‌థెరపీతోనూ ఇప్పుడిప్పుడే లీలావతి కోలుకుంటోంది. ప్రస్తుతం వనతారలో రకరకాల కారణాల వల్ల అనారోగ్యం పాలైన ఇలాంటి దాదాపు 200 ఏనుగులు సాంత్వన పొందుతున్నాయి. వాటికోసం 25000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆసుపత్రిని నిర్మించారు. పంచంలోనే అతిపెద్ద ఏనుగుల ఆసుపత్రుల్లో ఒకటిగా నిలిచిన ఈ కేంద్రంలో పోర్టబుల్ ఎక్స్‌రే, లేజర్ మిషన్ల వంటివాటితోపాటు పరీక్షలకోసం ల్యాబులూ, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్, ఏసీ ఐసీయూ తదితర సౌకర్యాలు ఉన్నాయి. చికిత్స కోసం వచ్చినవాటినీ, కోలుకుంటున్న వాటినీ కంటికి రెప్పలా చూసుకోవడానికి- వెటర్నరీ డాక్టర్లూ, బయాలజిస్టులూ, పాథాలజిస్టులూ, న్యూట్రిషనిస్టులూ, ఇతర సిబ్బందీ కలిసి దాదాపు 500 మంది ఉన్నారు. ఆ ఏనుగుల్లో ఒక్కోదానికి రోజుకు 200 కిలోల ఆహారం కావాలి. అందుకోసం అక్కడున్న ప్రత్యేక వంటగదిలో రోజూ దాదాపు యాభై వేల కిలోల ఆహారాన్ని సిద్ధం చేస్తారు. పోషకాహార నిపుణుల సమక్షంలో జావలూ, కిచిడీలూ, డ్రైఫ్రూట్స్ లడ్డూలూ, బెల్లం స్వీట్లూ వంటివెన్నో తయారు చేస్తారు. వాటికోసం కావల్సిన ముడిసరకును స్థానిక సేంద్రియ రైతుల నుంచీ సేకరిస్తున్నారు.



**ఆధునిక వైద్యం...**

ఏనుగుల సంరక్షణ కేంద్రం నుంచి బయటికొచ్చాక వనతారలోనే 650 ఎకరాల్లో 'గ్రీన్ జూలాజికల్ రెస్క్యూ అండ్ రీహాబిలిటేషన్ కింగ్‌డమ్'(జీజెడ్‌ఆర్‌ఆర్‌కే) పేరుతో మరో విభాగం కనిపిస్తుంది. అందులో 43 జాతులకు చెందిన రెండువేలకు పైగా వివిధ జీవులు ఆశ్రయం పొందుతున్నాయి. వాటికోసం లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఆసుపత్రిలో ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, ఎండోస్కోపీ, డయాలసిస్ పరికరాలూ- ఆధునిక సౌకర్యాలతో ఆపరేషన్ థియేటర్ వంటివెన్నో ఉన్నాయి. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాల్లోనూ దాడుల్లోనూ గాయపడిన సుమారు 200 చిరుతపులులను రక్షించి ఇక్కడకు తీసుకొచ్చారు జీజెడ్‌ఆర్‌ఆర్‌కే సిబ్బంది. వాటితోపాటు దుప్పులూ, మొసళ్లూ, పాములూ, తాబేళ్లూ, రకరకాల జాతులకు చెందిన పక్షులకు ఈ కేంద్రంలో శస్త్రచికిత్సలు నిర్వహించి, కొత్త జీవితాన్నిచ్చి సంరక్షిస్తున్నారు. మనదేశంతోపాటు ఆఫ్రికాలో గాయపడిన వన్యప్రాణులకు కూడా వైద్యమందించడానికి ప్రభుత్వ పరమైన అనుమతులన్నీ తీసుకుని సేవలందిస్తున్నారు. మెక్సికో, వెనెజువేలాల్లోని అంతర్జాతీయ వన్యప్రాణి రెస్క్యూ కేంద్రాలతో కలిసి పనిచేస్తున్న వనతార- వైద్యుల పరిశోధనలకు ప్రయోగశాలను కూడా అభివృద్ధి చేసింది. అందుకోసం ఈ కేంద్రంలో దాదాపు 2500 మంది సిబ్బందిని నియమించింది.





ప్రాణి సేవకు పెద్ద పీట వేసిన వనతార కేంద్రం- సాధారణ జూ లాగా ఉంటుందనుకుంటే పొరపాటే. ఎందుకంటే అక్కడ బోనుల్లో బంధించి ఉంచిన జంతువులుగానీ, వాటిని చూడ్డానికి వచ్చే సందర్శకులు గానీ కనిపించరు. అచ్చంగా అడవుల్లోని జీవావరణ పరిస్థితులనే కృత్రిమంగా సృష్టించి జంతువులు స్వేచ్ఛగా విహరించేలా ఏర్పాట్లు చేసిన ప్రాణి ప్రపంచమిది. వన్యప్రాణుల గురించి తెలుసుకోవాలనుకునే వారిక్జీ, ఎడ్యుకేషనల్ టూర్‌కు వచ్చేవారికీ మాత్రమే ప్రవేశం కల్పిస్తున్న వనతార- దేశంలోని 150కి పైగా జూలను అభివృద్ధి చేసేందుకు సెంట్రల్ జూ అథారిటీతోనూ ఇతర ప్రభుత్వ విభాగాలతోనూ కలిసి పనిచేయడానికి సిద్ధమైంది. దేశం నలుమూలల్లోని జంతుజాలమంతటినీ ఆదరించి అక్కున చేర్చుకుని ఉచితంగా వైద్యమందించే బాధ్యతను భుజానికెత్తుకున్న 'వనతార'- మూగజీవాల పాలిటి మమత కోవెల అనేందుకు సందేహమెందుకు..?!

# ప్రజాస్వామ్యంలో దేన్నీ దాచివుంచలేం!




ఢిల్లీ: దాతల గోప్యతకై వ్యవస్థాగత యంత్రాంగం రూపొందించాలి : సిఇసి రాజీవ్ కుమార్ వ్యాఖ్యలున్యూఢిల్లీ : ప్రజాస్వామ్యంలో దేన్నీ దాచిపెట్టడానికి ఎలాంటి అవకాశం వుండదని చీఫ్ ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల బాండ్ల విక్రయాలు, కొనుగోళ్ల వ్యవహారానికి సంబంధించిన వివరాలన్నీ బహిర్గతమవుతున్న నేపథ్యంలో ఆయన శనివారం ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీలకు ఇచ్చిన విరాళాలకు సంబంధించి దాత గోప్యతతో పారదర్శకతను సమతుల్యం చేసుకోవాల్సిన అవసరం వుందన్నారు. దాతల గోప్యతకు ఒక వ్యవస్థాగత యంత్రాంగాన్ని రూపొందించాల్సిన అవసరాన్ని కూడా పరిశీలించాల్సి వుందని సిఇసి నొక్కి చెప్పారు. 'మొదటినుండి పారదర్శకత వుండాలనే కమిషన్ చెబుతూ వస్తోంది. సుప్రీంకోర్టులో ఇందుకు సంబంధించి మా వైఖరి కూడా తెలియచేశాం. అన్ని విషయాలు అందరికీ తెలియడమే ప్రజాస్వామ్యం' అని అన్నారు. దాతల గోప్యతను పాటించేందుకు ఒక వ్యవస్థాగత యంత్రాంగాన్ని ఇప్పుడు దేశం రూపొందించాల్సి వుందన్నారు. రాజకీయ పార్టీలు తమ వార్షిక ఖర్చులు, విరాళాల వివరాలను అందజేయాలని, వాటిని ఇసి వెబ్సైట్లో ప్రచురిస్తామని తెలిపారు. లెక్కకు రాని రూపాల్లో వచ్చే విరాళాలను కూడా ఎలా నియంత్రించాలనేది దేశం మొత్తం కలిసి పనిచేయాల్సిన విషయమన్నారు. దాతల గోప్యతను కాపాడడం, వారు వేధింపులకు గురి కాకుండా చూడడం, ఆ నిధులు ఏ ఏ మార్గాల ద్వారా రావాలి వంటి అంశాలన్నింటినీ కలిసికట్టుగా పనిచేసి నిర్ణయించాల్సి వుందన్నారు. ఈ డిజిటల్ యుగంలో నగదు రూపాన్ని తగ్గించాల్సి వుందన్నారు. ఇంతకంటే మెరుగైన వ్యవస్థ కచ్చితంగా వస్తుందని అన్నారు.

# ఇదొక దోపిడీ రాకెట్!

## ఎలక్టోరల్ బాండ్లపై రాహుల్ ఫైర్



థానే, : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎలక్టోరల్ బాండ్స్ పథకంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. దీనిని దోపిడీ రాకెట్‌గా అభివర్ణించారు. ఈ బాండ్స్ ద్వారా అందిన నిధులను ప్రభుత్వాలను కూల్చేసేందుకు, పార్టీలను విచ్ఛిన్నం చేసేందుకు వినియోగించారని మండిపడ్డారు. భారత్ జోడో న్యాయ యాత్రలో భాగంగా మహారాష్ట్రలోని జంబాలీనాకా ప్రాంతంలో యాత్ర చేసిన రాహుల్‌గాంధీ ఈ సందర్భంగా ఎలక్టోరల్ బాండ్స్‌పై మాట్లాడారు. "ఎలక్టోరల్ బాండ్స్ పథకం.. అంతర్జాతీయ స్థాయి దోపిడీ రాకెట్. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కూల్చేసేందుకు, రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేసేందుకు ఈ రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే వారిని ఈడీ, సీబీఐ, ఐటీలు వెంటాడుతున్నాయి" అని దుయ్యబట్టారు. "మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీ ఎమ్మెల్యేలు ఉచితార్థంగా ఆయా పార్టీలను వీడి వెళ్లిపోయారనుకుంటున్నారా?" అని నర్మగర్భంగా ప్రశ్నించారు. వారంతా డబ్బు ఎరజూపితేనే ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్‌ల వెంట వెళ్లిపోయారని పరోక్షంగా వ్యాఖ్యానించారు. కాగా, ఎన్నికల బాండ్ల విషయంలో బీజేపీని విమర్శిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. తమ పార్టీ తీసుకున్న ఎన్నికల బాండ్లను తిరిగిచ్చేస్తారా? అని మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ నిలదీశారు. కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో వినియోగించుకునేందుకు నల్ల ధనం ద్వారా నిధులు సమకూరేవని ఫడణవీస్ ఆరోపించారు. ఆ నల్లధనానికి ఎన్నికల బాండ్ల పథకం అడ్డుకట్టవేయడం వల్లే ఆ పథకాన్ని రాహుల్ విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు.

# పండ్ల ఉత్పత్తిలో దేశంలోనే ఏపీ అగ్రగామి

**రెండో స్థానంలో మహారాష్ట్ర, మూడో స్థానంలో ఉత్తరప్రదేశ్**

**2023-24లో ఏపీలో 1,81,11,600 టన్నుల పండ్ల ఉత్పత్తి**

**కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ తొలి ముందస్తు అంచనాల్లో వెల్లడి**



అమరావతి: ఉద్యాన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుండటంతో పండ్ల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ రూపాల్లో సాయం అందిస్తుండటంతో పండ్ల రైతులు ఈ ఘనత సాధించారు. దేశవ్యాప్తంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో 11,20,77,190 టన్నుల పండ్లు ఉత్పత్తి కాగా.. ఇందులో ఆంధ్రప్రదేశ్ వాటా అత్యధికంగా 16.16 శాతంగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాల వారీగా పండ్ల ఉత్పత్తి, సాగు విస్తీర్ణంపై కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ తొలి ముందస్తు అంచనాలను సోమవారం వెల్లడించింది. - సాక్షి, అమరావతి

### 1.81 కోట్ల టన్నులతో మనమే టాప్

2023-24 ఆర్థిక ఏడాదిలో 1,81,11,600 టన్నుల పండ్ల ఉత్పత్తితో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. ఆ తరువాత మహారాష్ట్ర 1,42,78,250 టన్నుల పండ్లు ఉత్పత్తితో రెండో స్థానంలో నిలిచింది. ఉత్తరప్రదేశ్ 1,27,02,060 టన్నుల పండ్ల ఉత్పత్తితో మూడో స్థానంలో నిలిచింది. అరటి ఉత్పత్తిలో ఏపీ మొదటి స్థానంలో ఉండగా.. తమిళనాడు రెండో స్థానంలో, ఉత్తరప్రదేశ్ మూడో స్థానంలో నిలిచాయి. బత్తాయి ఉత్పత్తిలో ఏపీ మొదటి స్థానంలో ఉండగా.. రెండో స్థానంలో మహారాష్ట్ర, మూడో స్థానంలో తెలంగాణ నిలిచాయి. నిమ్మ ఉత్పత్తిలో ఏపీ మొదటి స్థానంలో కొనసాగుతుండగా.. రెండో స్థానంలో గుజరాత్, మూడో స్థానంలో మధ్యప్రదేశ్ నిలిచాయి. మామిడి ఉత్పత్తిలో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. బొప్పాయి ఉత్పత్తిలో గుజరాత్ మొదటి స్థానంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం మహారాష్ట్రలో ఎక్కువగా ఉన్నప్పటికీ.. తక్కువ విస్తీర్ణమే ఉన్నా పండ్ల ఉత్పత్తిలో మాత్రం ఆంధ్రప్రదేశ్ అగ్రభాగాన ఉండటం విశేషం. ఆంధ్రప్రదేశ్‌లో పండ్లు సాగు విస్తీర్ణం 7,80,310 హెక్టార్లు ఉండగా.. మహారాష్ట్రలో 8,48,370 హెక్టార్లలో పండ్ల సాగు విస్తీర్ణం ఉంది.

# దటీజ్ భారత్ నేవీ.. 40 గంటల రెస్క్యూ ఆపరేషన్ సక్సెస్




ఢిల్లీ: భారత నావికాదళం మరోసారి సత్తా చాటింది. అరేబియా సముద్రంలో హైజాక్‌కు గురైన నౌకలో ఉన్న 17 మందిని ఎంతో సాహసోపేతంగా కాపాడింది. సుమారు 40 గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్ జరిపి నౌకలో ఉన్న 35 మంది సముద్రపు దొంగలను పట్టుకుంది. వివరాల ప్రకారం.. గతేడాది డిసెంబర్ 14న అరేబియా సముద్రంలో ఎంవీ రుయెన్ నౌకను సముద్రపు దొంగలు హైజాక్ చేశారు. సముద్రంలో దోపిడీకి ఈ నౌకను ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నౌనకు రక్షించేందుకు భారత నేవీ రంగంలోకి దిగింది. నౌక రక్షణ కోసం ఆపరేషన్ చేపట్టింది. సుమారు 40 గంటల పాటు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి నౌకను రక్షించారు. ఈ ఆపరేషన్‌లో మొత్తం 35 మంది సముద్రపు దొంగలు లొంగిపోగా.. నౌకలోని 17 మంది సిబ్బంది సురక్షింతంగా ఉన్నట్టు నేవీ అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఐఎన్ఎస్ కోల్‌కత్తా, యుద్ధనౌక ఐఎన్ఎస్ సుభద్ర, ఆధునిక డ్రోన్లు, %ా8×% పెట్రోలింగ్ విమానాలు ఉపయోగించినట్టు ఇండియన్ నేవీ తెలిపింది. హైజాక్‌కు గురైన ఎంవీ రుయెన్ పూర్తిగా భారత నావికాదళం ఆధీనంలో ఉన్నట్టు పేర్కొంది. ఇదిలా ఉండగా.. ఈ నెల 15వ తేదీన భారత నేవీ ఆపరేషన్ చేపట్టే ముందు సముద్రపు దొంగలను లొంగిపోవాలని సూచించింది. లేకపోతే వారిపై దాడులు ప్రారంభించాలని మెరైన్ కమాండోలకు నేవీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సోమాలియా సముద్రపు దొంగలు నేవీ అధికారులపై కాల్పులు జరిపారు. అనంతరం ఏ మాత్రం బెదరకుండా రెస్క్యూ కొనసాగించిన నేవీ సముద్రపు దొంగలు లొంగి పోయేలా చేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలను కూడా ఇండియన్ నేవీ రిలీజ్ చేసింది. ఇక,అంతకుముందు బంగ్లాదేశ్‌కు చెందిన ఓ నౌకను సైతం ఇండియన్ నేవీ రక్షించింది. భారత నావికాదళం అరేబియా సముద్రంలో జరిగిన సంఘటనలను తక్షణమే పరిష్కరించడం, వాణిజ్య నౌకలను రక్షించడానికి అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి పనిచేస్తోంది. దీంతో, భారత నావికాదళంపై ప్రపంచదేశాలు ప్రశంసలు కురిపిస్తున్నాయి.

# గెలుపే లక్ష్యం... వైసీపీ వ్యూహాలకు ప్రతివ్యూహాలు రచిస్తూ..



అమరావతి: ఏపీ అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. సార్వత్రిక ఎన్నికలతో పాటుగా ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు వెల్లడించింది. నాలుగో దశలో ఏపీలో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలకు ఏప్రిల్ 25 వరకూ అవకాశం కల్పించారు. ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 29వ తేదీ వరకూ గడువు ఇచ్చారు. ఏపీలోని 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాలకు మే 13న ఎన్నికలు జరగనుండగా.. జూన్ 4న ఫలితాలు విడుదల కానున్నాయి. దీంతో ఏపీలో రాజకీయ పరిణామాలు తీవ్ర స్థాయిలో మారిపోయాయి. ఈ నేపథ్యంలోనే వైసీపీ 175 ఎమ్మెల్యే, 24 ఎంపీ స్థానాలకు ప్రకటించి.. ప్రత్యర్థులకు సవాల్ విసిరింది. ప్రతిపక్ష నేతల వ్యూహాలకు ప్రతివ్యూహాలు రచిస్తూ.. అడుగులు ముందుకు వేస్తోంది. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రజల్లో వెళ్లేందుకు సిద్ధమైంది. షెడ్యూల్ విడుదల అవ్వడంతో ఏపీలో పొలిటికల్ హీట్ పెరిగింది. ఓ వైపు ప్రతిపక్ష పార్టీలు కూటమి కడితే.. మరోవైపు సింగిల్‌గా, పక్కా ప్రణాళికతో జనాల్లోకి వెళ్లేందుకు సిద్ధం అయ్యారు వైసీపీ అధినేత సీఎం జగన్. ఎన్నికలకు కౌంట్ డౌన్ మొదలవుతుండటంతో.. సీఎం జగన్ ఇక రంగంలోకి దిగేందుకు ఫిక్స్ అయ్యారు. ఏపీలో నెలకొన్న తాజా రాజకీయ సమీకరణాల నడుమున వైసిపి తరఫున ప్రచారంలో కొత్త పుంతలు తొక్కేలా జగన్ ప్రసంగం ఉండబోతోంది. ఎన్నికల క్యాంపైన్లో భాగంగా.. సీఎం జగన్ జిల్లాల పర్యటనలు చేయనున్నారు. దీంతో 2024 ఎన్నికల స్పీచ్ ఎలా ఉండబోతుంది అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఇప్పటికే సిద్ధం సభల పేరుతో ప్రాంతాల వారీగా సభల్లో పాల్గొన్న ఆయన ఎన్నికల క్యాంపెయిన్ ఈ నెలలోనే ప్రారంభించబోతున్నారు. ఇప్పటికే సిద్ధం సభలతో రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ క్యాడర్లో జోష్ నింపిన ఆయన.. ఎన్నికల షెడ్యూల్ విడుదల అవ్వడంతో ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచి విపక్షాలపై విమర్శల డోస్ పెంచి దూసుకెళ్ళనున్నారు. ఈ నేపథ్యంలో ఒకే రోజు వేరు వేరు ప్రాంతాల్లో వేర్వేరు సభలు నిర్వహించేలాగా ఏర్పాట్లు చేస్తుంది వైసీపీ. ఏపీలో కీలకమైన నియోజకవర్గాలను టచ్ చేస్తూనే ఆయా నియోజకవర్గాల్లో వైఎస్ జగన్ ప్రచారం ఉండేలాగా ప్లాన్ రూపొందిస్తున్నారు. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర చేసి 151 నియోజకవర్గాల్లో విజయ బావుటా ఎగురవేసిన వైసీపీ.. ఇప్పుడు తాజాగా ఎన్నికల ప్రచారంలో వై నాట్ 175 నినాదాన్ని మరోసారి ప్రజల్లోకి తీసుకొని వెళ్లబోతోంది. తమ పర్యటనలో మ్యానిఫెస్టోను వైఎస్ జగన్ ప్రకటించే అవకాశం ఉంది. నాడు-నేడు పేరుతో సంక్షేమం, అభివృద్ధి అంశాలను ఇటీవల ప్రజల్లోకి తీసుకెళుతున్న వైసీపీ అధినేత.. అదే ఫార్ములాను మరోసారి ప్రజల్లోకి తీసుకొని వెళ్ళేలా స్పీచ్?ను తయారు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి 2019 ఎన్నికల్లో తన స్పీచ్?లతో ప్రజలకు చేరువైన జగన్.. ఈ ఎన్నికల ప్రచారంలో అంతే దూకుడుతో తన ప్రసంగాన్ని ఉండేలా చూసుకుంటున్నారు. ఇక ప్రాంతాలవారీగా ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వెనుక బాటుతనం, ఉత్తరాంధ్రలో వలసలు, ఉద్దానం తాగునీటి సమస్యలు, మేనిఫెస్టో హామీల అమలు, సంక్షేమ పథకాలు, రైతాంగం, యువత మహిళల కోసం అమలు చేసిన సంస్కరణలను ప్రజలకు వివరించబోతున్నారు. సభలు, సమావేశాలు, రోడ్ షోలు, ర్యాలీలతో ఎన్నికల ప్రచారం ఉధృతం చేయబోతోన్నటు తెలుస్తోంది.

# సోషల్ మీడియాతో ఎన్నికల్లో గెలుపు ఖాయామా



దేశంలో ఎన్నికల హడావిడి మొదలైంది. గెలుపే లక్ష్యంగా ఆయా పార్టీలు నిర్విరామంగా ప్రచారం చేస్తున్నాయి. మరో వైపు వాట్సప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా మాధ్యమాలు ఓటర్ సైకాలజీని ప్రభావితం చేసే మాధ్యమాలుగా ఉద్భవించాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు,రాజకీయ పార్టీలు తమ విజయాలను ప్రచారం చేయడానికి, ఓటర్ల నుండి మద్దతు పొందడానికి సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగిస్తున్నాయి.

### పార్టీలు ఓటర్లను ఎలా ఆకర్షిస్తున్నాయి

భారత్‌లో ప్రతినెలా 500 మిలియన్లకు పైగా యాక్టివ్ యూజర్ల ఉన్న వాట్సప్‌లో లెటర్ ఫ్రమ్ ది ప్రైమ్ మినిస్టర్ పేరుతో ప్రధాని మోదీ ప్రజల్లోకి మరింత చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నిస్తుంటారు. తద్వారా తాను ప్రధానిగా దేశానికి చేసిన సేవ, సంక్షేమ పథకాలు, పనితీరు వంటి విషయాల గురించి అవగాహన కల్పిస్తూ అభిప్రాయాల్ని సేకరించేందుకు ఉపయోగపడుతుంది.

### 'మై ఫస్ట్ ఓట్ ఫర్ మోడీ'

బీజేపీ 'మై ఫస్ట్ ఓట్ ఫర్ మోడీ' అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. వెబ్‌సైట్‌ను విజిట్ చేసే యూజర్లు మోదీకి ఓటు వేసేలా ప్రతిజ్ఞ చేయడం, అందుకు గల కారణాల్ని తెలుపుతూ వీడియోల్ని క్రియేట్ చేసి అభిప్రాయాల్ని పంచుకునేందుకు అవకాశం కల్పిస్తుంది. అదే సమయంలో ఎన్‌డీఏ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వీడియోలు దర్శనమిస్తాయి.

### వాట్సప్‌లో రాహుల్ గాంధీ సైతం

మరోవైపు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వాట్సప్ గ్రూప్‌ను నడుపుతున్నారు. ఇందులో ప్రజలతో సంభాషించడంతో పాటు వారి ప్రశ్నలకు సమాధానం ఇస్తారు. తద్వారా పార్టీ కార్యక్రమాల్లో ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ఉపయోగపడడమే కాదు ఓటర్ల బేస్‌ను గుర్తించవచ్చు.

### పాండమిక్ తర్వాత ట్రెండ్ మారింది

కోవిడ్-19 మహమ్మారి తర్వాత, సమాచార సాధనంగా సోషల్ మీడియా పట్ల దృక్పథం గణనీయంగా మారిపోయిందని, పొలిటిక్ అడ్వైజర్ వ్యవస్థాపకుడు, ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ ఐటీ సెల్ హెడ్ అంకిత్ లాల్ అన్నారు. 'సమాచారాన్ని పొందడానికి సోషల్ మీడియాపై ఎక్కువగా ఆధారపడే ఓటర్లతో కనెక్ట్ అవ్వడానికి అనేక రాజకీయ పార్టీలు ఇప్పుడు తమ ఎన్నికల ప్రచారానికి డిజిటల్ వ్యూహాన్ని అవలంబించాయి. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్‌లు మరో మాధ్యమంగా మారారు. వీరి ద్వారా ప్రజల్ని ప్రభావితం చేయొచ్చని తెలిపారు.

### సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు

గత కొన్ని నెలలుగా యువ ఓటర్లను కనెక్ట్ అవ్వడానికి పలువురు రాజకీయ నాయకులు ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు యూట్యూబ్ ఛానెల్స్ వరుస ఇంటర్వ్యూలతో హోరెత్తించారు. ఎస్ జైశంకర్, స్మృతి ఇరానీ, పీయూష్ గోయల్, రాజీవ్ చంద్రశేఖర్ వంటి బీజేపీ నేతలు యూట్యూబ్‌లో 7 మిలియన్లకు పైగా ఫాలోవర్లను కలిగి ఉన్న పోడ్‌కాస్టర్ రణవీర్ అలహాబాడియాకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ట్రావెల్ అండ్ ఫుడ్ వీడియో పాడ్‌కాస్ట్ కర్లీ టేల్స్ వ్యవస్థాపకుడు కమియా జానీతో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇంటర్వ్యూ ఇచ్చారు.

### ప్రతి పక్షాలకు అదే ఎదురు దెబ్బ

2014 సార్వత్రిక ఎన్నికల్లో చాలా మంది నాయకులు సోషల్ మీడియాను వినియోగించుకోవడంలో వెనుకబడి పోయారు. దీంతో ఆ ప్రభావం ప్రతిపక్షంలో ఉండేలా చేసింది. ప్రతిపక్షాల కంటే ముందే సోషల్ మీడియాను వినియోగించుకోవడం ముందున్న బీజేపీ ఎన్నికల్లో విజయం సాధించిందని అంకిత్ లాల్ చెప్పారు.

### పోల్ ఫలితాలపై సోషల్ మీడియా ప్రభావం

పోల్ ఫలితాలపై సోషల్ మీడియా ప్రచారం ప్రాముఖ్యతను లాల్ వివరిస్తూ, '40 శాతం ఇంటర్నెట్ వ్యాప్తితో, సగటున రెండు లక్షల మంది జనాభా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గంలో డిజిటల్ మాధ్యమాల ద్వారా 75,000 నుండి 80,000 మందిని ప్రభావితం చేయడం సాధ్యమవుతుంది. ఏ అసెంబ్లీ ఎన్నికల్లోనైనా 5,000 ఓట్ల తేడా మంచి గెలుపు ఓటమి తేడా ఉంటుంది. అదే సమయంలో ఇతర విశ్లేషకులు ప్రజలను ఓటర్లుగా మార్చడంలో సోషల్ మీడియా శక్తిపై అనేక సందేశాలు వ్యక్తం చేస్తున్నారు.

# బెంగళూరు 'జల' పాఠాలు



బెంగళూరు: కొన్ని సంవత్సరాల క్రితం మేము (సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్) ప్రచురించిన 'ఎక్స్‌క్రీటా మేటర్స్ ఇన్ బెంగళూరు' అనే నివేదిక విడుదల సందర్భంగా ఆ మహానగర నీటి సరఫరా, వ్యర్థ పదార్థాల నిర్వహణకు బాధ్యులైన ఉన్నతాధికారులతో సంబంధిత అంశాలపై చురుగ్గా చర్చించాను. ముఖ్యంగా ఆ నగరంలో నీటి సరఫరా నిర్వహణ విషయమై మా మధ్య తీవ్ర వాద ప్రతివాదాలు జరిగాయి. మా పరిశోధనలో బెంగళూరు నగరంలో నీటి సరఫరా వ్యయాలు భరించలేని విధంగా ఉన్నాయని, అంతేకాకుండా ప్రస్తుతమున్న సరఫరా సదుపాయాలు సుదీర్ఘ కాలం స్థిరంగా నిర్వహించలేని విధంగా ఉన్నట్టు వెల్లడయిందని నేను చెప్పాను. నా అభిప్రాయంతో ఆ ఉన్నతాధికారులు (సివిల్ ఇంజనీర్లు) ఏకీభవించలేదు. వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న కావేరీ నది నుంచి పైప్‌లైన్స్ ద్వారా నగరానికి నీటిని తీసుకువస్తున్నామని, కలవరపడాల్సిన అవసరమేమీ లేదని వారు వాదించారు. సరే, ఇప్పుడు ఈ హై-టెక్ సిటీ తీవ్ర నీటి ఎద్దడితో సతమతమవుతోంది. ఈ సమస్య మరింతగా విషమించనున్నది. మరి భారతదేశ అత్యంత అధునాతన నగర నీటి సరఫరా బాధ్యత నిర్వహిస్తున్న ప్రాజ్ఞులు, తాము అమలుపరుస్తున్న నీటి సరఫరా పథకాలపై పునరాలోచించి, వాటికి ప్రత్యామ్నాయ ప్రణాళికలను రూపొందిస్తారా? బహుశా...! అని మాత్రమే అనుకోవల్సి వున్నది. మహానగరాలలోని ప్రజలకు, పరిశ్రమలకు అవసరమైన నీటిని (బాగా ఖర్చుతో కూడిన) అధునాతన ఇంజనీరింగ్ పరిష్కారాల ద్వారా సమృద్ధిగా సరఫరా చేయవచ్చన్న విధానకర్తల కలలు కరిగిపోతున్నాయిబీ నిర్దేశిత విధానాలకనుగుణంగా పథకాలు రూపొందించి, అమలుపరిచే ప్రభుత్వాధికారుల కృషి ఫలించడం లేదు.

ఈ విపత్కర పరిస్థితికి బెంగళూరు నగరం అద్దం పడుతోంది. ఈ జల సంక్షోభానికి ఆ నగరం మొదటిదీ కాదు, చివరిదీ కాబోదు. బెంగళూరు మహానగరానికి సుదూర గతంలో అనేక సరస్సుల నుంచి నీటి సరఫరా జరుగుతూ ఉండేది. నగర పరిధిలోని ఆ సరస్సులనన్నిటినీ వాననీటిని భద్రపరిచేందుకు, వరదలను నివారించేందుకు సృష్టించారు. కాలక్రమేణా నగరం విస్తరించింది. జనాభా పెరిగింది. నగర నీటి అవసరాలను సరస్సులు తీర్చలేని పరిస్థితి వచ్చింది. దీంతో 1974లో కావేరీ నదీ జలాల సరఫరా పథకాన్ని రూపొందించారు. ఈ పథకంలో భాగంగా తొలుత కావేరీ నది నుంచి నీటిని 490 మీటర్ల ఎత్తుకు పంపింగ్ చేస్తారు. అక్కడ నుంచి 100 కిలోమీటర్లకు పైగా ఆ నీటిని రవాణా చేసి నగర ప్రజలకు అందుబాటులో ఉంచుతారు. నగర ఇంజనీర్లతో నేను జరిపిన చర్చల్లో ఆ ఇంజనీరింగ్ అద్భుతం నాల్గవ దశను అమలు పరచడంలో నిమగ్నమై ఉన్నారని అర్థమయింది. నేను ముందే చెప్పినట్టు నగరంలో సంభావ్య నీటి కొరత గురించి కలవరపడేందుకు సరైన కారణమేదీ వారికి కనిపించలేదు మరి. ఇంజనీర్లు కొన్ని వాస్తవాలను నిర్లక్ష్యం చేస్తున్నారని కూడా నేను నిష్కర్షగా చెప్పాను. అవి: (1) బెంగళూరు నగరంలోనూ, పరిసర ప్రాంతాలలోనూ భూగర్భ జలాల వినియోగం అంతకంతకూ పెరుగుతోంది. దీన్నిబట్టి నీటి సరఫరా సరైన విధంగా, సంపూర్ణంగా జరగడం లేదనేది స్పష్టమయిందిబీ (2) నగరం భౌగోళికంగా విస్తరిస్తోంది. ఈ విస్తరణతో పాటు జనాభా కూడా పెరుగుతోంది. గతంలో ఎన్నడో నిర్మించిన మురికి నీటిపారుదల వ్యవస్థలు విస్తరిస్తోన్న నగరం, పెరుగుతోన్న జనాభా అవసరాలకు అనుగుణంగా లేవుబీ (3) ఉత్పాదితమవుతోన్న మురుగునీరు, వ్యర్థ పదార్థాలను శుద్ధి చేయడం లేదని నగర పాలనాధికారులే ఒప్పుకుంటున్నారు. దీనివల్ల నగరంలోని సరస్సులు, చెరువులు, వివిధ నీటి వనరులు కలుషితమై పోతున్నాయి. నేను ఎత్తి చూపిన ఈ వాస్తవాలను కూడా ఆ ఇంజనీర్లు సీరియస్‌గా తీసుకోలేదు. అవేమీ పెద్ద సమస్యలు కావని, కాబోవనే ధీమాను వారు వ్యక్తం చేశారు. భవిష్యత్తు అంతా చక్కగా ఉంటుందని పరిపూర్ణ ఆశాభావం వారిలో నిండుగా కనిపించింది. రోజుకు 720 మిలియన్ లీటర్ల (ఎమ్ఎల్‌డి) మురుగునీటిని శుద్ధి చేసే సామర్థ్యం నగర పాలనా వ్యవస్థకు ఉన్నదని వారు ఘనంగా చెప్పుకున్నారు. అత్యంత అధునాతన సాంకేతికతలు తమకు అందుబాటులో ఉన్నాయని, అవి పెద్ద ఎత్తున ఉత్పాదితమవుతోన్న వ్యర్థ పదార్థాలను పూర్తిగా శుద్ధి చేయగలుగుతాయని వారు గొప్పగా చెప్పారు. సరే, ప్రస్తుత పరిస్థితులకు వద్దాం. 2010 సంవత్సరంలో బెంగళూరు నగర దినసరి అవసరాలు 1,125 మిలియన్ లీటర్లు కాగా ఇప్పుడది రోజుకు 2600 మిలియన్ లీటర్లకు పెరిగింది. ఈ అవసరాలలో సగ భాగాన్ని కావేరీ నది తీరుస్తోంది. మిగతా సరఫరాలకు భూగర్భ జలాలపై ఆధారపడుతున్నారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే నగర నీటి అవసరాలు పూర్తిగా తీరడం లేదు. దీంతో నగర వాసులు నీటిని సమకూర్చుకునేందుకు బోర్‌వెల్స్‌ను స్వయంగా ఏర్పాటు చేసుకుంటున్నారు. వర్షపాతంలో అస్థిరత్వం బాగా పెరిగిపోవడంతో కొత్తగా ఏర్పాటు చేసుకున్న నీటి వనరులు శీఘ్రగతిన ఎండిపోతున్నాయి. అయినా ప్రాజ్ఞులైన నగర ఇంజనీర్లు సంక్షోభాన్ని అర్థం చేసుకున్నట్టుగా లేదు. వారు ఇంకా తమ పాత కలలే కంటున్నారు. త్వరలో ప్రారంభమవనున్న కావేరీ ప్రాజెక్టు ఐదవ దశతో నీటి సరఫరాకు సంబంధించిన సమస్త సమస్యలు పరిష్కారమై పోతాయని నగర చీఫ్ ఇంజనీర్ ఎంతో నమ్మకంగా చెప్పారు. మురుగునీటి వ్యవస్థల కథ కూడా నీటి సరఫరా నిర్వహణకు భిన్నంగా లేదు. మురుగునీటి శుద్ధికి అవసరమైన సదుపాయాలను నిర్మించారు. బెంగళూరు నగరానికి రోజుకు 1,167.50 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసే సామర్థ్యం ఉన్నదని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు 2021 నివేదిక పేర్కొంది. ఉన్న సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకోవడం కూడా 75 శాతం మేరకు మెరుగుపడింది. అయితే ఉత్పాదితమవుతున్న మురుగు నీరు, దాని శుద్ధి చేయగల సామర్థ్యం మధ్య అంతరం అంతకంతకూ పెరుగుతోంది. ప్రస్తుత నీటి అవసరాలు పూర్తిగా తీరుతాయని భావిస్తే ఉత్పాదితమయ్యే మురుగు నీరు రోజుకు 2000 మిలియన్ లీటర్లుగా ఉంటుంది. అంటే అందులో సగానికి పైగా శుద్ధి చేయబడనిదిగా ఉండిపోతుంది. ఈ సమస్య నధిగమించేందుకు నగర అధికారుల మధ్య చాలాసార్లు చర్చలు జరిగాయి. అయినా పరిస్థితులు ఒక దశాబ్దం క్రితం ఎలా ఉన్నాయో ఇప్పుడూ అలానే ఉన్నాయి! మహా నగరాల నీటి సరఫరా ప్రణాళికల్లో ఇదొక నిజమైన సంక్షోభం. పెరుగుతున్న అవసరాలను, అందుకనుగుణంగా మార్పులు చేసేందుకు గల అవకాశాలను అవగాహన చేసుకోవడంలో మన అసమర్థత, అశక్తతే అసలు సంక్షోభం సుమా! వాస్తవమేమిటంటే బెంగళూరులో వర్షాలు బాగానే కురుస్తున్నాయి. ఆ వాననీటిని సంరక్షించి, భూగర్భ జలాలను పునశ్శక్తిమంతం చేయగల సరస్సులు కూడా నగరంలో చాలా పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ప్రతి వాన బొట్టును కాపాడుకుని, తీవ్ర నీటి కొరత కాలంలో ఉపయోగించుకోవాలి. అప్పుడు మాత్రమే నగర మురుగునీటి పారుదల వ్యవస్థను సక్రమంగా, సమర్థంగా నిర్వహించుకోవచ్చు. అయితే ఇదెలా సాధ్యం? మురుగునీటిని పైప్‌లైన్ల ద్వారా రవాణా చేయడం కాకుండా వ్యర్థ పదార్థాలన్నిటినీ ట్యాంకర్ల ద్వారా సేకరించి శుద్ధి చేసి పునర్వినియోగించుకోవాలి. అయితే ఇందుకు మన నీటి వ్యవస్థల నిర్వహణ ఇంజనీర్లు తమ పగటి కలలకు స్వస్తి చెప్పి వాస్తవికంగా ఆలోచించాలి. లక్ష్యాలు, వాటి సాధనా మార్గాలపై పునరాలోచన చేయాలి పథకాలను పునః రూపొందించి, పటిష్ఠంగా అమలుపరచాలి. ఏమైనా ఇది నేటి బెంగళూరు కథ. రేపు ఇదే మీ నగర కథ కూడా కావచ్చు సుమా!

## టీమిండియా ట్రోఫీ గెలవాలంటే అతడు జట్టులో ఉండాల్సిందే!



విరాట్ కోహ్లి గురించి వస్తున్న వార్తలపై టీమిండియా మాజీ కెప్టెన్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ మండిపడ్డాడు. పనీపాటా లేని వాళ్లే వదంతులు సృష్టించి జనాల మీదకు వదులుతారని ఘాటు వ్యాఖ్యలు చేశాడు. అసలు కోహ్లి లేని ప్రపంచకప్ జట్టును ఊహించడం కూడా కష్టమన్నాడు. కాగా టీ20 వరల్డ్‌కప్-2024 భారత జట్టులో కోహ్లికి చోటు ఇవ్వకుండా.. యువకులకు పెద్దపీట వేయాలని బీసీసీఐ ఆలోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. కోహ్లి బ్యాటింగ్ స్టైల్ వెస్టిండీస్ పిచ్‌లకు అంతగా సూట్ కాదని.. అందుకే ఈ ఢిల్లీ బ్యాటర్‌ను తప్పించాలని సెలక్టర్లు భావిస్తున్నట్లు వదంతులు వ్యాపించాయి.

### టీమిండియా గెలవాలంటే అతడు ఉండాల్సిందే

ఈ విషయంపై క్రిష్ణమాచారి శ్రీకాంత్ తనదైన శైలిలో స్పందించాడు. "విరాట్ కోహ్లి లేకుండా టీ20 ప్రపంచకప్ టీమా? ఛాన్సే లేదు. 2022లో జట్టును సెమీస్‌కు చేర్చిన ఘనత తనది. ఆ ఎడిషన్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ కూడా అతడే. అలాంటి వ్యక్తికి జట్టులో చోటు ఉండదా? అసలు ఈ పుకార్లు పుట్టిస్తున్నది ఎవరు? వాళ్లకు వేరే పనులేమీ లేవా? నిరాధారపూరిత వ్యాఖ్యలతో ఎందుకు గందరగోళం సృష్టిస్తున్నారు ఒకవేళ ఈసారి టీమిండియా గనుక టీ20 వరల్డ్‌కప్ గెలవాలంటే విరాట్ కోహ్లి కచ్చితంగా జట్టులో ఉండి తీరాల్సిందే" అని చిక్కా తన అభిప్రాయాన్ని కుండబద్దలుకొట్టినట్లు చెప్పాడు. ఇక ఇదే విషయం గురించి పాకిస్తాన్ మాజీ స్పిన్నర్ డానిష్ కనేరియా కూడా స్పందించాడు.

### సచిన్ మాదిరే కోహ్లికి కూడా ఆ గౌరవం దక్కాలి

ఈ మేరకు.. "వన్డే వరల్డ్‌కప్ లేదంటే టీ20 ప్రపంచకప్.. ఈవెంట్ ఏదైనా.. జట్టును ఒడ్డుకు చేర్చే ఆటగాడు ఉండాల్సిందే. విరాట్ కోహ్లి వంటి ఆటగాళ్లు కేవలం జట్టులో ఉంటే చాలు. అన్నీ సజావుగా సాగిపోతాయి. వందకు వంద శాతం జట్టుకు కోహ్లి అవసరం ఉంది. కోహ్లి కోసం టీమిండియా కచ్చితంగా ప్రపంచకప్ ట్రోఫీ గెలవాలి. 2011లో సచిన్ టెండుల్కర్‌కు దక్కిన మాదిరే విరాట్ కోహ్లికి కూడా గౌరవం దక్కాలి. అతడికి జట్టు ఇచ్చే గొప్ప కానుక అంతకంటే మరొకటి ఉండదు" అని డానిష్ కనేరియా పేర్కొన్నాడు.


## ఎంఎస్ ధోనీకి ఇదే చివరి సీజన్..
## మోకాళ్లు అరిగిపోతున్నప్పటికీ..!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 మరో వారం రోజుల్లో ప్రారంభం కానుంది. టోర్నీ మొదటి మ్యాచ్ మార్చి 22న డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య జరగనుంది. ఇటీవలే చెన్నైలో అడుగుపెట్టిన సీఎస్‌కే కెప్టెన్ ఎంఎస్ ధోనీ.. ప్రాక్టీస్ ముమ్మరం చేశాడు.సీఎస్‌కేను ఆరోసారి విజేతగా నిలపాలని చూస్తున్నాడు. అయితే ఎప్పటిలానే మహీకి ఇదే చివరి సీజన్ అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనిపై ఓ చర్చా కార్యక్రమంలో మాజీ క్రికెటర్లు స్పందించారు. మోకాళ్లు అరిగిపోతున్నప్పటికీ ఎంఎస్ ధోనీ వికెట్ కీపింగ్ చేయడానికి ఇష్టపడుతాడని ఇయాన్ మోర్గాన్, రాబిన్ ఉతప్ప అన్నారు. 'ఎంఎస్ ధోనీ రిటైర్‌మెంట్ గురించి చాలా మంది మాట్లాడుతున్నారు. గత 2-3 ఏళ్లుగా రిటైర్‌మెంట్ అంటూ వార్తలు వస్తున్నాయి. ధోనీ స్క్రిప్ట్‌ను అతడే రాసుకునే వైవిధ్యభరితమైన క్రికెటర్. అతడి మోకాలు ఇబ్బంది పెట్టినా.. ధోనీ మాత్రం తన స్థానాన్ని వదిలిపెట్టడు. సీఎస్‌కేను విజయవంతంగా నడిపించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడు. ఎవరైనా బాధ్యతలు తీసుకునే వరకూ జట్టుతో పాటే ఉంటాడు' అని మోర్గాన్ అన్నాడు. 'ఎంఎస్ ధోనీకి ఆట పట్ల మక్కువ ఎక్కువ. జట్టును గెలిపించేందుకు ఎప్పుడూ కష్టపడుతుంటాడు. సీఎస్‌కేతో అతడికి మంచి అనుబంధం ఉంది. ఒకవేళ ధోనీ వీల్‌ఛైర్‌లో ఉన్నా సరే చెన్నై అతడికి ఆడేందుకు అవకాశం ఇస్తుంది. బ్యాటింగ్‌లో అతడికి సమస్యేమీ లేదు. కీపింగ్‌లోనే ఏదైనా ఇబ్బంది ఎదురు కావచ్చు. మోకాళ్లు అరిగిపోతున్నప్పటికీ.. కీపింగ్ చేయడమంటే ధోనీకి చాలా ఇష్టం' అని రాబిన్ ఉతప్ప పేర్కొన్నాడు. ధోనీ 250 ఐపీఎల్ మ్యాచులు ఆడి 5082 రన్స్ చేశాడు.

## కేఎల్ రాహుల్ టీమ్‌లోకి ఆస్ట్రేలియా మాజీ ప్లేయర్..
## ఈసారైనా లక్నోకు లక్ కలిసొచ్చేనా






2024 ప్రారంభానికి ముందు లక్నో సూపర్‌జెయింట్స్ తమ కోచింగ్ స్టాఫ్‌లో చాలా మార్పులు చేసింది. గౌతమ్ గంభీర్, ఆండీ ఫ్లవర్ నిష్క్రమణ తర్వాత, కొత్త సిబ్బంది వచ్చారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో పేరు చేరింది. లక్నో ఫ్రాంఛైజీ కొత్త అసిస్టెంట్ సిబ్బంది పేర్లను ప్రకటించింది. ఫ్రాంఛైజీ ఆస్ట్రేలియన్ మాజీ స్టార్ బ్యాట్స్‌మెన్ ఆడమ్ వోగ్స్‌ను జట్టు సహాయక సిబ్బందిగా నియమించింది. వోగ్స్ మొదటి సారి ఒక జట్టుకు సహాయక సిబ్బందిగా పని చేస్తున్నాడు. ఈ సీజన్‌లో, లక్నో కోచింగ్ సిబ్బందిలో గణనీయమైన మార్పులు చేసింది. ఆస్ట్రేలియా మాజీ కోచ్, ఓపెనింగ్ బ్యాటర్ జస్టిన్ లాంగర్‌ను జట్టు కోచ్‌గా నియమించారు. తర్వాత దక్షిణాఫ్రికా మాజీ ఆల్‌రౌండర్ లాన్స్ క్లూసెనర్ అసిస్టెంట్ కోచ్‌గా నియమితులయ్యారు. అతను ఇప్పుడు వోగ్ టీమ్ సపోర్టింగ్ స్టాఫ్‌లో చోటు సంపాదించాడు. వోగ్స్‌కు కోచింగ్‌లో గొప్ప అనుభవం ఉంది. అతను వెస్ట్రన్ ఆస్ట్రేలియా కోచ్. అతని కోచింగ్‌లో వెస్ట్రన్ ఆస్ట్రేలియా అనేకసార్లు మార్ష్ కప్, షెఫీల్డ్ షీల్డ్ వంటి ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లను గెలుచుకుంది. ఇక ఆస్ట్రేలియన్ బిగ్ బాష్ లీగ్ లో పెర్త్ స్కార్చర్స్‌కు కోచ్‌గా పనిచేశాడు ఆడమ్ వోగ్స్. ఆ జట్టు రెండుసార్లు జట్టు టైటిల్‌ను గెలుచుకోవడంలో సహాయపడ్డాడు. మరి ఐపీఎల్ ట్రోఫీని గెలవడానికి లక్నోకు వోగ్స్ ఎలా సహాయపడతాడో చూడాలి. లక్నోకు ఇది మూడో సీజన్. 2022లో ఐపీఎల్‌లో ఆ జట్టు అరంగేట్రం చేసింది. వోగ్స్ రాక జట్టుకు బోనస్ అని ఆ జట్టు ప్రధాన కోచ్ లాంగర్ అన్నారు. వోజెస్ గొప్ప కోచ్, వ్యక్తి. 'మేము ఇంతకు ముందు కలిసి పనిచేశాము,' అని లాంగర్ చెప్పుకొచ్చారు.

### లక్నో సూపర్ జెయింట్స్ జట్టు

కేఎల్ రాహుల్ (కెప్టెన్), నికోలస్ పూరన్ (వైస్ కెప్టెన్), క్వింటన్ డి కాక్, ఆయుష్ బదోని, మార్కస్ స్టోయినిస్, దీపక్ హుడా, కైల్ మేయర్స్, దేవదత్ పడిక్కల్, నవీన్-ఉల్-హక్, రవి బిష్ణోయ్, కృనాల్ పాండ్యా, యుధ్వీర్ సింగ్, యశ్ ఠాకూర్ , ప్రేరక్ మన్కడ్, అమిత్ మిశ్రా, మయాంక్ యాదవ్, షమర్ జోసెఫ్, మొహ్సిన్ ఖాన్, కృష్ణప్ప గౌతమ్, అర్షిన్ కులకర్ణి, శివమ్ మావి, ఎం సిద్ధార్థ్, డేవిడ్ విల్లీ, అష్టన్ టర్నర్, మహ్మద్ అర్షద్ ఖాన్.

# ధోనీ - సచిన్ ఒక్కటే..
# వీల్‌చైర్‌లో కూర్చొనైనా మహీ ఆడేస్తాడు

ఇంటర్నెట్ డెస్క్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ ) 17వ సీజన్ మరో వారం రోజుల్లో ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మార్చి 22న తొలి మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే 'కెప్టెన్ కూల్' ఎంఎస్ ధోనీ ప్రాక్టీస్ ముమ్మరం చేశాడు. సీఎస్కేను ఆరోసారి విజేతగా నిలపాలనే ఉద్దేశంతో బరిలోకి దిగుతున్నాడు. మరోవైపు అతడికిదే చివరి సీజన్ అంటూ ప్రచారం జరుగుతోంది. దీనిపై మాజీ క్రికెటర్లు ఓ చర్చా కార్యక్రమంలో అద్భుతమైన సమాధానం ఇచ్చారు.



### ధోనీ ముందే రావడం శుభపరిణామం: సురేశ్ రైనా

'కెప్టెన్ ఎంఎస్ ధోనీ టోర్నీ ప్రారంభానికి ముందే చెన్నైకు రావడం శుభ పరిణామం. కఠిన వాతావరణ పరిస్థితుల్లో నాలుగైదు గంటలపాటు సాధన చేయడం అద్భుతం. జిమ్‌లోనూ సమయం గడిపేస్తున్నాడు. ఇలాంటప్పుడే జట్టుతో చాలా అనుబంధం కలుగుతుంది. ఆటగాళ్లు కూడా స్వేచ్ఛగా సీనియర్లతో కలిసేందుకు అవకాశం ఉంటుంది" అని సీఎస్కే మాజీ ఆటగాడు సురేశ్ రైనా అన్నాడు.

### వారిద్దరి మధ్య పోలికలు ఉన్నాయి: అనిల్ కుంబ్లే

"నేను ధోనీతో కలిసి ఐపీఎల్‌లో ఆడలేదు. కానీ.. భారత జట్టుకు ఆడా. నన్ను ఒకసారి పైకి ఎత్తాడు. నాలాంటి బరువున్న వ్యక్తిని లేపాలంటే అతడు చాలా బలంగా ఉండాలి. టీమ్‌ఇండియా తరఫున నాకు అదొక అద్భుత క్షణం. నేను కోచ్‌గా ఉన్నప్పుడు ధోనీ కెప్టెన్సీ చేస్తున్నాడు. రాంచీ వేదికగా వన్డే మ్యాచ్ అనుకుంటా. ప్రాక్టీస్ సెషన్ ఏర్పాటు చేశాం. అది ఆప్షనల్. రాంచీ ధోనీ సొంతూరు. అతడు రావాల్సిన అవసరమే లేదు. కానీ, వచ్చాడు. 'నువ్వేం చేస్తున్నావు? మన మ్యాచ్‌కు ఇంకా రెండు రోజుల సమయం ఉంది' అని అడిగా. 'లేదు. నేను ఇక్కడ ఉండాలని భావించా' అని సమాధానం ఇచ్చాడు. ఇలాంటి లక్షణమే సచిన్‌లోనూ గమనించా. దాదాపు పాతికేళ్లపాటు క్రికెట్ ఆడిన సచిన్.. ఆప్షనల్ రోజుల్లోనూ అందరికంటే ముందు బస్సులో ఉంటాడు. అందుకే, ధోనీ సీఎస్కే తరఫున కొనసాగడంపై నేను ఆశ్చర్యపోవడం లేదు. అతడికి ఆటపట్ల ఉన్న అభిరుచి ఆ స్థాయిలో ఉంటుంది" అని కుంబ్లే వ్యాఖ్యానించాడు.

### ధోనీకి సీఎస్కే అలాంటి ఆఫర్ ఇస్తుంది: రాబిన్ ఉతప్ప

"ఒకవేళ ధోనీ వీల్‌ఛైర్‌లో ఉన్నా సరే సీఎస్కే అతడికి ఆడేందుకు అవకాశం ఇస్తుంది. బ్యాటింగ్ విషయంలో అతడికి సమస్యేమీ లేదు. వికెట్ కీపింగ్‌లోనే ఏదైనా ఇబ్బంది ఎదురు కావచ్చు. మోకాళ్లు అరిగిపోతున్నప్పటికీ కీపింగ్ చేయడమంటే ధోనీకి చాలా ఇష్టం" అని రాబిన్ ఉతప్ప తెలిపాడు.

### అతడి స్క్రిప్ట్‌ను అతడే రాసుకుంటాడు: ఇయాన్ మోర్గాన్

"ధోనీ రిటైర్‌మెంట్ గురించి చాలా మంది మాట్లాడుతున్నారు. అతడి స్క్రిప్ట్‌ను అతడే రాసుకునే వైవిధ్యభరితమైన క్రికెటర్. రాబిన్ ఉతప్ప చెప్పినట్లుగా అతడి మోకాలు ఇబ్బంది పెట్టినా.. ధోనీ మాత్రం తన స్థానాన్ని వదిలిపెట్టాలనుకోడు. ఫ్రాంఛైజీని విజయవంతంగా నడిపించేందుకు సిద్ధంగా ఉంటాడు. సమయాన్ని గౌరవిస్తూనే... ఎవరైనా వచ్చి బాధ్యతలు తీసుకునే వరకూ జట్టుతోపాటే ఉంటాడు" అని మోర్గాన్ వెల్లడించాడు.

# రంజీట్రోఫీ 'రారాజు' ముంబై!

భారత క్రికెట్ చిరునామా ముంబై దేశవాళీ రంజీ ట్రోఫీకి మరోపేరుగా నిలిచింది. రికార్డుస్థాయిలో 42వ టైటిల్ నెగ్గి తన రికార్డును తానే అధిగమించింది. దేశవాళీ క్రికెట్లో అత్యంత పురాతన టోర్నీలలో ఒకటైన రంజీట్రోఫీ చరిత్రలో ముంబై రికార్డుస్థాయిలో 42వసారి విజేతగా నిలిచింది. ఎనిమిదేళ్ల విరామం తరువాత జాతీయ క్రికెట్ చాంపియన్ గా సరికొత్త రికార్డు నెలకొల్పింది.




### ముంబై స్కూల్ ఆఫ్ క్రికెట్.....

గత తొమ్మిది దశాబ్దాలుగా జరుగుతున్న రంజీట్రోఫీలో ముంబై ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. అలనాటి విజయ్ మర్చెంట్ నుంచి నేటితరం యశస్వి జైశ్వాల్ వరకూ ఎందరో గొప్పగొప్ప క్రికెటర్లకు భారత, అంతర్జాతీయ క్రికెట్ కు అందించిన ముంబైకి భారత క్రికెట్ నర్సరీగా, 'ముంబై స్కూల్ ఆఫ్ క్రికెట్' గా గొప్ప పేరుంది. గొప్ప క్రికెటర్లను తయారు చేయటమే కాదు..గొప్పజట్లను తీర్చి దిద్దుతూ తనదైన క్రికెట్ సంస్కృతిని పాదుకొల్పిన ఘనత కేవలం ముంబై క్రికెట్ సంఘానికి మాత్రమే దక్కుతుంది. దేశవాళీ క్రికెట్లో జూనియర్ స్థాయి నుంచి రంజీట్రోఫీ స్థాయి వరకూ ముంబై తిరుగులేని ఆధిపత్యమే కొనసాగుతోంది.

### 169 పరుగుల విజయంతో......

అయితే..రంజీట్రోఫీ చరిత్రలో మాత్రం సౌరాష్ట్ర, విదర్భ, మధ్యప్రదేశ్ లాంటి జట్ల జోరుతో గత దశాబ్దకాలంగా ముంబై వెనుకబడి పోతూ వస్తోంది. ఏజట్టు సాధించని విధంగా ఇప్పటికే 41సార్లు రంజీ విజేతగా నిలిచిన ముంబై ఎనిమిదేళ్ల విరామం తరువాత ప్రస్తుత సీజన్ రంజీ ఫైనల్స్ కు చేరింది. క్వార్టర్ ఫైనల్లో బరోడా, సెమీఫైనల్లో తమిళనాడును చిత్తు చేసిన ముంబై ఫైనల్లో మాత్రం గట్టి పోటీ ఎదుర్కొని రెండుసార్లు చాంపియన్ విదర్భను 169 పరుగులతో అధిగమించడం ద్వారా 42వ సారి ట్రోఫీ కైవసం చేసుకోగలిగింది.

### స్టార్ ప్లేయర్లు అందుబాటులో లేకున్నా...

భారత కెప్టెన్ రోహిత్ శర్మ, యువఓపెనర్ యశస్వి జైశ్వాల్, సర్ ఫ్రాజ్ ఖాన్ లాంటి మేటి బ్యాటర్లు అందుబాటులో లేకున్నా ముంబై 2023-24 రంజీ ఫైనల్స్ కు చేరడం, అందుబాటులో ఉన్న ఆటగాళ్లతోనే అజింక్యా రహానే నాయకత్వంలో విజేతగా నిలవడం, 42వసారి విజేతగా తన రికార్డును తానే అధిగమించడం ఓ గొప్ప రికార్డుగా మిగిలిపోతుంది. గత తొమ్మిది దశాబ్దాల కాలంలో 48సార్లు రంజీ ఫైనల్స్ చేరడంతో పాటు 42 సార్లు విజేతగా, ఆరుసార్లు రన్నరప్ గా నిలిచిన అరుదైన రికార్డు కేవలం ముంబైకి మాత్రమే సొంతం. హెూంగ్రౌండ్ వాంఖడే స్టేడియం వేదికగా విదర్భతో జరిగిన టైటిల్ సమరంలో ముంబై తొలి ఇన్నింగ్స్ లో తడబడినా..ప్రత్యర్థిని 105 పరుగులకే కుప్పకూల్చడం, తన రెండో ఇన్నింగ్స్ లో భారీస్కోరు సాధించడం ద్వారా టైటిల్ ఖాయం చేసుకోగలిగింది. 19సంవత్సరాల యువబ్యాటర్ ముషీర్ ఖాన్ రికార్డు శతకంతో ముంబై..ప్రత్యర్థి ఎదుట 538 పరుగుల భారీవిజయలక్ష్యాన్ని ఉంచగలిగింది. కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ ( 102), హర్ష దుబే ( 65 ) పోరాడినా విదర్భ 365 పరుగులు మాత్రమే చేయగలిగింది. విదర్భ టెయిల్ ఎండర్ ఉమేశ్ యాదవ్ ను వెటరన్ ధవళ్ కులకర్ణీ పడగొట్టడంతో ముంబై 42వసారి రంజీట్రోఫీ విజేతగా నిలువగలిగింది. ముంబై విజయంలో ప్రధానపాత్ర వహించిన యువబ్యాటర్ ముషీర్ ఖాన్ కు ప్లేయర్ ఆఫ్ ది ఫైనల్స్ అవార్డు దక్కింది.

### ముంబైజట్టుకి మాస్టర్ హ్యాట్సాఫ్...

ముంబై క్రికెట్ ప్రధాన కేంద్రం వాంఖడే స్టేడియం 50 సంవత్సరాల వేడుకల సమయంలోనే ..వాంఖడే సేడియం వేదికగా జరిగిన రంజీ ఫైనల్లో ముంబైజట్టే విజేతగా నిలవడం ఓ చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోతుంది. జాతీయ క్రికెట్ చాంపియన్ గా నిలిచిన ముంబైకి మాస్టర్ సచిన్ టెండుల్కర్, భారత కెప్టెన్ రోహిత్ శర్మ, విఖ్యాత కామెంటీటర్లు సునీల్ గవాస్కర్, సంజయ్ మంజ్రేకర్ హ్యాట్సాఫ్ చెప్పారు.

### ముంబైజట్టుకి 10 కోట్ల నజరానా...

రంజీట్రోఫీ విజేత ముంబైజట్టుకు బీసీసీఐ 5 కోట్ల రూపాయలు ప్రైజ్ మనీగా చెల్లిస్తే..ముంబై క్రికెట్ సంఘం తమ ఆటగాళ్లకు మరో 5 కోట్ల రూపాయలు బోనస్ గా ప్రకటించింది. ముంబై జట్టులోని సభ్యులంతా మొత్తం 10 కోట్ల రూపాయల ప్రైజ్ మనీని పంచుకోనున్నారు. ముంబై క్రికెట్ పరంపరను కొనసాగించిన జట్టు సభ్యులకు 5 కోట్ల రూపాయలు అదనంగా ఇస్తున్నట్లు ముంబై క్రికెట్ సంఘం అధ్యక్షుడు అమోల్ కాలే, కార్యదర్శి అజింక్యా నాయక్ ప్రకటించారు. దేశవాళీ క్రికెట్ ప్రస్తుత సీజన్లో వివిధ విభాగాలలో ముంబైజట్టు 7 విభాగాలలో జాతీయ చాంపియన్ గా నిలవడం తమకు గర్వకారణమని ముంబై క్రికెట్ సంఘం తెలిపింది. రంజీట్రోఫీ మ్యాచ్ ల్లో ఆడిన క్రికెటర్లకు ఆడిన మ్యాచ్ ల ప్రాతిపదికన రోజుకు 25వేల నుంచి 50 వేల రూపాయల వరకూ మ్యాచ్ ఫీజుగా చెల్లిస్తున్నారు. ప్రస్తుత సీజన్లో ముంబై తరపున 10 మ్యాచ్ లు ఆడిన ఒక్కో ఆటగాడు 25 లక్షల రూపాయల చొప్పున మ్యాచ్ ఫీజు అందుకోనున్నాడు.

# ఆ వైభవం మళ్లీ చూడాలని..

ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ది ఆసక్తికర ప్రయాణం. తొలి మూడు సీజన్లలో పేలవ ప్రదర్శన చేయడంతో ఆ జట్టును అందరూ తేలిగ్గా తీసుకున్నారు. కానీ ఉన్నట్లుండి పుంజుకున్న ఆ జట్టు మూడేళ్ల వ్యవధిలో రెండు టైటిళ్లతో అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అప్పట్లో ఐపీఎల్ మేటి జట్లలో ఒకటిగా దాన్ని పరిగణించారందరూ. కానీ తర్వాత వైభవం కోల్పోయి సాధారణ జట్టుగా మారిపోయింది. కొన్నేళ్లుగా టైటిల్ సంగతి పక్కన పెడితే ప్లేఆఫ్స్ చేరడం కూడా కష్టమవుతోంది నైట్‌రైడర్స్‌కు. పునర్వైభవం కోసం ఆ జట్టు చేస్తున్న ప్రయత్నం ఈసారైనా ఫలిస్తుందేమో చూడాలి. గౌతమ్ గంభీర్ నాయకత్వంలో తొలిసారి 2012లో, ఆ తర్వాత 2014లో టైటిల్ గెలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్.. ఆ తర్వాత నిలకడ తప్పింది. ఆపై గంభీర్ కూడా జట్టుకు దూరమయ్యాడు. అతను వైదొలిగాక వేర్వేరు కెప్టెన్ల నాయకత్వంలో ఆడుతున్న నైట్‌రైడర్స్ ఒడుదొడుకుల ప్రయాణం సాగిస్తోంది. గత అయిదు సీజన్లలో నాలుగుసార్లు ఆ జట్టు గ్రూప్ దశ దాటలేదు. 2021లో మోర్గాన్ నాయకత్వంలో ఫైనల్ చేరినా కప్పు గెలవలేకపోయింది. తర్వాతి సీజన్లో శ్రేయస్ అయ్యర్ ఆ జట్టును నడిపించాడు. నిరుడు అతను అందుబాటులో లేకపోవడంతో నితీశ్ రాణా సారథ్యంలో ఆడింది. ఇప్పుడు తిరిగి శ్రేయస్ పగ్గాలందుకుంటున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధికంగా రూ.24.75 కోట్లకు ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్‌ను కొన్న కోల్‌కతా.. స్పిన్నర్ ముజీబ్ రెహ్మాన్ (అఫ్గానిస్థాన్), హిట్టర్ షెఫానీ రూథర్‌ఫర్డ్ (వెస్టిండీస్), పేసర్ గస్ అట్కిన్సన్ (ఇంగ్లాండ్)లనూ జట్టులోకి తీసుకుని బలం పెంచుకుంది. బలాలు: కోల్‌కతాకు బౌలింగే అతి పెద్ద బలం. దేశవాళీ యువ బౌలర్లు వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా, సుయాశ్ శర్మ ఇప్పటికే ఆ జట్టు తరఫున సత్తా చాటుతున్నారు. రసెల్, నరైన్ కూడా బౌలింగ్‌లో బాగా ఉపయోగపడుతున్నారు. ఇప్పుడు మిచెల్ స్టార్క్‌కు తోడు చమీర, ముజీబ్ రెహ్మాన్‌ల రాకతో కోల్‌కతా బౌలింగ్ మరింత బలోపేతం



కానుంది. శ్రేయస్ అయ్యర్, నితీశ్ రాణా, గుర్బాజ్, రసెల్, షెఫానీ రూథర్‌ఫర్డ్, ఫిల్ సాల్ట్‌లతో బ్యాటింగ్ కూడా బాగానే కనిపిస్తోంది. మేటి మ్యాచ్ ఫినిషర్‌గా ప్రశంసలందుకుంటున్న రింకు సింగ్ ఆ జట్టుకు అతిపెద్ద బలం. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా తనదైన ముద్ర వేస్తే కోల్‌కతా ప్లేఆఫ్స్ చేరడానికి మంచి అవకాశాలున్నట్లే. బలహీనతలు: కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఉత్తమ స్థితిలో ఉంటే జట్టుకు బలమే కానీ.. ఇటీవల ఫిట్‌నెస్, ఫామ్‌తో తంటాలు పడుతున్నాడు. ఏడాది విరామం తర్వాత ఐపీఎల్‌లో అతనెలా రాణిస్తాడో చూడాలి. టీమ్‌ఇండియాకు ప్రాతినిధ్యం వహించే అనుభవజ్ఞుడైన పేసర్ జట్టులో లేకపోవడం ప్రతికూలతే. మిడిలార్డర్‌లోనూ సమస్యలున్నాయి. జట్టుకు కొంత ఆల్‌రౌండర్ల కొరత కూడా ఉంది. రసెల్ మీదే ఎక్కువ ఆధారపడాల్సి వస్తోంది. అతను ఎప్పుడో ఒకసారి మాత్రమే మెరుపులు మెరిపిస్తున్నాడు. నరైన్ బౌలింగ్‌లో మునుపటి పదును లేదు. ఐపీఎల్ కెరీర్ ఆరంభంలో అదరగొట్టిన వెంకటేశ్ అయ్యర్ తర్వాత బలమైన ఆల్‌రౌండర్‌గా రూపాంతరం చెందలేదు. వీళ్లందరూ ఈసారి నిలకడగా రాణించాల్సిందే. దేశీయ ఆటగాళ్లు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), నితీశ్ రాణా, వెంకటేశ్ అయ్యర్, రింకు సింగ్, వరుణ్ చక్రవర్తి, చేతన్ సకారియా, సుయాశ్ శర్మ, కేఎస్ భరత్, మనీష్ పాండే, హర్షిత్ రాణా, రఘువంశీ, అనుకుల్‌రాయ్, రమణ్‌దీప్ సింగ్, సకిబ్ హుస్సేన్, వైభవ్ అరోరా.

విదేశీయులు: మిచెల్ స్టార్క్, ఆండ్రి రసెల్, రహ్మానుల్లా గుర్బాజ్, సునీల్ నరైన్, ముజీబ్ రెహ్మాన్, దుష్మంత చమీర, షెఫానీ రూథర్‌ఫర్డ్, ఫిల్ సాల్ట్. కీలక ఆటగాళ్లు: శ్రేయస్ అయ్యర్, రింకు సింగ్, మిచెల్ స్టార్క్, రసెల్. ఉత్తమ ప్రదర్శన: 2012, 2014లో ఛాంపియన్

